సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 117

మంగళవారం 18-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





మరోసారి చంద్రయాన్-3 కక్ష్య దూరం పెంపు

ఇస్రో ఈనెల 13న ప్రయోగించిన చంద్రయాన్-3కి రెండోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను సోమవారం వేకువజామున విజయవంతంగా చేపట్టారు. - 6లో



రూ.2,381 కోట్ల డ్రగ్స్ ధ్వంసం

రూ.2,381 కోట్ల విలువైన 1.40 లక్షల కిలోల డ్రగ్స్‌ను ధ్వంసం చేయడాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వర్చువల్‌గా వీక్షించారు.

వివరాలు 6లో ▸



ఏమో! కారూ ఎగరావచ్చు.. కానీ

అమెరికాకు చెందిన అలెఫ్ ఏరోనాటిక్స్ సంస్థ ఎగిరే కారు ప్రజలకు అందుబాటులోకి రావడానికి ఎన్నో సవాళ్లను అధిగమించాల్సి ఉంది.

వివరాలు 6లో ▸



కిషన్‌రెడ్డికి ఘనస్వాగతం

లండన్ హీత్రూ విమానాశ్రయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ-యూకే విభాగం ఘన స్వాగతం పలికింది.

వివరాలు 2లో ▸



అమెరికాలో భీకర వర్షాలు

అమెరికాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పిడుగులు బెంబేలెత్తిస్తున్నాయి. 2,600పైగా విమానాల రాకపోకలను రద్దుచేశారు.

వివరాలు 6లో ▸

రేపట్నుంచి కాంగ్రెస్ రైతు భరోసా యాత్ర

- 32 జిల్లాల్లో పర్యటించనున్న కిసాన్‌సెల్ నేతలు
- ఆదిలాబాద్‌లో ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతుల పక్షాన భరోసా యాత్ర చేపట్టాలని టీపీసీసీ కిసాన్ సెల్ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో రైతాంగ సమస్యలే ఎజెండాగా ఈనెల 19 నుంచి యాత్రను ప్రారంభించనుంది. ఆదిలాబాద్‌లో ప్రారంభం కానున్న ఈ యాత్ర ఆగస్టు 2న నిజామాబాద్‌లో ముగియనుంది. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాట కార్యాచరణను రూపొందించటంతో పాటు ఆయా జిల్లాల రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందన్న మిగతా 2వ పేజీలో ▶

విద్యుత్ ప్లాంట్లలో రూ.15 వేల కోట్ల అవినీతి

- నిర్మాణ అంచనాలను పెంచి కమీషన్లు నొక్కారు: రేవంత్‌రెడ్డి
- నేను ఈ వాస్తవం చెప్పినందుకే కేటీఆర్ గంతులు వేస్తున్నారు
- కరెంట్ అంశంపై తాను ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ -2లో

బెంగళూరులో సోమవారం సమావేశమైన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ. చిత్రంలో తమిళనాడు, పశ్చిమబెంగాల్, బిహార్, ఢిల్లీ ముఖ్యమంత్రులు ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్, అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు లాలూప్రసాద్‌యాదవ్



26 విపక్షాలు బెంగళూరులో.. 38 ఎన్డీయే మిత్రపక్షాలు హస్తినలో

యాంటీ భేటీ.. ఫ్రెండ్స్ పోటీ

'కలుద్దాం, నిలుద్దాం' నినాదంతో ముందుకు

బెంగళూరులో మొదలైన విపక్షాల మేధోమథనం

బీజేపీకి ముకుతాడే లక్ష్యంగా కీలక ఐక్యతా భేటీ

నేడూ కొనసాగనున్న విపక్ష కూటమి చర్చలు

సోనియా సారథ్యంలో కొత్త కూటమి ఆవిర్భావం!

మరోపక్క విపక్షాల భేటీకి దీటుగా ఎన్డీఏ సమావేశం

నేటి భేటీకి 38 పార్టీలు!



నేడు ఎన్డీయే బల ప్రదర్శన

పేరులో ఇండియా.. సారథిగా సోనియా! 6లో

జాతీయ రాజకీయాల తీరుతెన్నులను నిర్ణాయక మలుపు తిప్పగల కీలక పరిణామాలు మంగళవారం చోటు చేసుకోనున్నాయి. అటు బెంగళూరులో కాంగ్రెస్ చొరవతో సోమవారం మొదలైన 26 విపక్షాల కీలక సమావేశం మంగళవారం పూర్తిస్థాయిలో జరగనుంది. ఇటు అందుకు దీటుగా బీజేపీ సారథ్యంలో అధికార ఎన్డీఏ కూటమి ఏకంగా 38 పార్టీలతో హస్తినలో పోటీ భేటీ తలపెట్టింది. ఇరు పక్షాల నుంచీ ఇందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. సోనియా, రాహుల్, ఖర్గే తదితర కాంగ్రెస్ అగ్ర నేతలతో పాటు నితీశ్ సహా పలు విపక్ష పాలిత రాష్ట్రాల సీఎంలు... ఇలా మొత్తం 26 విపక్ష పార్టీల అధినేతలు సోమవారమే బెంగళూరు చేరారు. మంగళవారం చర్చించాల్సిన అంశాలపై సాయంత్రం నుంచి రాత్రి విందు భోజనం దాకా సుదీర్ఘ మంతనాల్లో మునిగి తేలారు. మరోవైపు బీజేపీ కూడా ఎల్జేపీ (పాశ్వాన్)ని సోమవారం ఎన్డీఏ కూటమిలో చేర్చుకోవడం ద్వారా విపక్షాల సవాలుకు దీటుగా స్పందించింది. మంగళవారం జరిగే ఎన్డీఏ పూర్తిస్థాయి భేటీలో ఎల్జేపీ, హిందూస్తానీ అవామ్ మోర్చా వంటి కొత్త మిత్రులతో కలిపి ఏకంగా 38 పార్టీలు పాల్గొంటాయని కూడా బీజేపీ వర్గాలు వెల్లడించాయి! హస్తిన, బెంగళూరు వేదికలుగా జరగనున్న అధికార, విపక్ష కూటముల పోటాపోటీ భేటీల మీదే ఇప్పుడిక అందరి కళ్లూ నిలిచాయి. అతి కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల కురుక్షేత్ర సమరానికి ఈ భేటీలను వైరి కూటముల తొలి సన్నాహకంగా పరిశీలకులు భావిస్తున్నారు.

- వివరాలు 6లో▶

కారెలా నడుస్తోంది?

క్షేత్రస్థాయిలో పరిస్థితులపై బీఆర్ఎస్ అధినేత దృష్టి

- మంత్రులతో భేటీలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతల పనితీరుపై ఆరా
- సర్వే సంస్థలు, నిఘా వర్గాల నివేదికలపై చర్చలు
- చాలాచోట్ల ఇబ్బందికర పరిస్థితులున్నాయంటున్న మంత్రులు!
- మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలపై సీఎం అభిప్రాయ సేకరణ
- పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై నేడు లేదా రేపు భేటీ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధతపై భారత్ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దృష్టి సారించారు. తన కేబినెట్ సహచరులతో వరుస భేటీలు జరుపుతున్నారు. ప్రగతి భవన్ వేదికగా ఉమ్మడి జిల్లాల వారీగా జరుపుతున్న సమావేశాల్లో నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులపై లోతుగా చర్చిస్తున్నారు. ఇప్పటివరకు నల్లగొండ, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించిన సమీక్షలు పూర్తయినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. వివిధ సర్వే సంస్థలు, నిఘావర్గాల ద్వారా అందిన నివేదికలు, ఏప్రిల్, మే నెలల్లో జరిగిన ఆత్మీయ సమ్మేళనాలపై పార్టీ ఇన్‌చార్జిలు ఇచ్చిన రిపోర్టుల్లోని అంశాలు ఈ భేటీల్లో ప్రస్తావనకు వస్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, పార్టీకి చెందిన ఇతర కీలక నేతల పనితీరు, నియోజకవర్గ స్థాయిలో వారి నడుమ సమన్వయ లోపం వంటి మిగతా 2వ పేజీలో ▶

స్తబ్ధత వీడేలా.. జోరుగా

- ఆందోళన కార్యక్రమాలకు బీజేపీ రెడీ
- రుణమాఫీ అమలు డిమాండ్‌తో నేడు నిరసనలు.. 20న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించనున్న కిషన్‌రెడ్డి
- 24న జిల్లా కేంద్రాల్లో నిరసనలు.. 25న ఇందిరా పార్కు వద్ద ధర్నా.. 21న బాధ్యతలు స్వీకరించనున్న కిషన్‌రెడ్డి..



2 లో

'కరువు'కు ప్రత్యామ్నాయం!

రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత సీజన్ కష్టాల్లో పడినట్టేనని.. ఈ పరిస్థితి కొనసాగితే ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కరువు పరిస్థితులు నెలకొంటే.. ఏయే జిల్లాల్లో, ఏయే పంటల సాగు చేపట్టాలి, ఏమేం జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్న వివరాలను అందచేసింది.

- వివరాలు 5లో▶

క్లుప్తంగా...

కేటీఆర్‌కు బుడ్లు, బెడ్లు, దుడ్లు తప్ప ఏమీ తెలియదు

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: 'మంత్రి కేటీఆర్‌కు వ్యవసాయం గురించి ఏం తెలుసని మాట్లాడుతున్నారు? ఆయనకు బుడ్లు, బెడ్లు, దుడ్లు తప్ప ఎడ్లు, వడ్లు గురించి ఏమీ తెలియదు' అని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి లిక్కర్‌పై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని, 2004, 2009లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అవకాశం వచ్చినా ఆయన తీసుకోలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

టికెట్ నాదే.. గెలుపు నాదే

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



వీణవంకలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ శవయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

వీణవంక: హుజూరాబాద్ బీఆర్ఎస్ టికెట్ తనదేనని.. గెలుపు జెండా ఎగురవేసేది కూడా తానేనని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఆశీస్సులతో హుజూరాబాద్‌లో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో సమావేశం అయ్యారు. అంతకుముందు వీణవంక బస్టాండ్ నుంచి సర్కిల్ వరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. జమ్మికుంటలో జరిగిన సభలో ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి కేటీఆర్ తననే ప్రకటించారని, కానీ కొందరు టికెట్ విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు.

మాటపై నిలబడే దమ్ముంటే రుణమాఫీ చేయాలి: షర్మిల



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్‌కు మాట మీద నిలబడే దమ్ముంటే తక్షణం 31 లక్షల మంది రైతులకు రూ. లక్షలోపు రుణాలు మాఫీ చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. 'మాట ఇస్తే తల నరుక్కుంటం' అంటూ రుణమాఫీపై చేసిన వాగ్దానాలు గడప దాటలేదని, రైతులకు రుణమాఫీ కాలేదని ఆమె ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. కేసీఆర్ బూటకపు హామీని నమ్మి ఓటేసిన పాపానికి రైతన్నలు బ్యాంకుల దగ్గర దోషిలా నిలబడ్డారని విచారం వ్యక్తం చేశారు. రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు రైతుల ఇళ్ల మీద పడుతున్నా, రైతుబంధు పైసలను వడ్డీల కింద జమ చేసుకుంటున్నా కేసీఆర్‌కు కనీసం చీమ కుట్టినట్టైనా లేదన్నారు.

సీఎం కేసీఆర్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

రూ.కోట్ల హామీలను విస్మరించారని ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆరోపణ



భద్రాచలం: భద్రాచలం ప్రజలు, గోదావరి వరద ముంపు బాధితులకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపిస్తూ సీఎం కేసీఆర్‌పై భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భద్రాచలం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందజేసిన అనంతరం క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో భద్రాచలంలో శ్రీరామనవమికి వచ్చిన సీఎం కేసీఆర్, రామాలయం అభివృద్ధికి ప్రకటించిన రూ.100 కోట్లు, గత ఏడాది వరదల సమయంలో వచ్చినప్పుడు కరకట్ట ఎత్తు పెంపు, పక్కా ఇళ్ల నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు ప్రకటించి.. విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలంతా తన బిడ్డలేనన్న కేసీఆర్.. భద్రాచలం నియోజకవర్గ ప్రజలపై మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ గూటికే..

నిజామాబాద్ ఎంపీ అర్వింద్



జగిత్యాల టౌన్: బీజేపీ అధినాయకత్వం తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు స్పష్టమైన బ్లూప్రింట్ తయారైందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబ అవినీతిపై దర్యాప్తు సంస్థలు పట్టుబిగిస్తున్నాయన్నారు. జగిత్యాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌లో ఎవరు గెలిచినా బీఆర్ఎస్‌లోకే వెళ్తారని జోస్యం చెప్పారు.

స్తబ్ధత వీడేలా.. జోరుగా



- ఆందోళనకు సిద్ధమవుతున్న బీజేపీ
- ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టేలా కార్యాచరణ
- రుణమాఫీ పూర్తి అమలు డిమాండ్‌తో నేడు నిరసనలు.. మరికొన్ని రోజుల పాటు టిఫిన్ బాక్స్ బైఠక్‌లు
- 20న డబుల్ బెడ్‌రూం ఇళ్లు పరిశీలించనున్న కిషన్‌రెడ్డి
- 24న జిల్లా కేంద్రాల్లో నిరసనలు
- 25న ఇందిరాపార్కు వద్ద ధర్నా

సాక్షి, హైదరాబాద్: అధ్యక్షుడి మార్పునకు సంబంధించి చోటుచేసుకున్న పరిణామాలతో కొంతకాలంగా పార్టీలో ఏర్పడిన స్తబ్ధతను దూరం చేసే దిశలో బీజేపీ వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. పార్టీ నాయకులు, కేడర్‌లో జోష్ నింపేలా వివిధ వర్గాల ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ఆందోళనలకు సిద్ధమౌతోంది. ఇందులో భాగంగా రైతు రుణమాఫీని వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించనుంది. ఆదివారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రారంభించిన టిఫిన్ బాక్స్ 'బైఠక్'లను ఈ నెలాఖరు వరకు కొనసాగించనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో 18, 19 తేదీలలో ఈ బైఠక్‌లను నిర్వహించాలని నిర్ణయించినట్టు పార్టీ నాయకులు తెలిపారు. ఎక్కడికక్కడ నేతలంతా ఒకచోట చేరి పార్టీకి సంబంధించిన అంశాలు, ఇతర విషయాలపై స్వేచ్ఛగా మాట్లాడుకోవడం ఈ బైఠక్‌ల ముఖ్యోద్దేశమని ఓ ముఖ్యనేత సాక్షికి తెలిపారు. ప్రతినెలా ఈ టిఫిన్ బాక్స్ బైఠక్‌లు నిర్వహించాలని నాయకత్వం నిర్ణయించిందని బీజేపీ ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి చెప్పారు.

20 నుంచే రంగంలోకి కిషన్‌రెడ్డి..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి.. అమెరికా, లండన్ పర్యటనల నుంచి తిరిగొచ్చాక ఈ నెల 21న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించే భారీ సభ ద్వారా ఎన్నికలపై పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్నట్టు తెలిసింది. జాతీయ నేతలు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు సమాచారం. దీనికి ముందే ఈ నెల 20న బాటసింగారంలో డబుల్ బెడ్రూం ఇళ్లను కిషన్‌రెడ్డి పరిశీలించనున్నారు. భారీ కాన్వాయ్‌తో ఆయన అక్కడకు వెళ్తారని తెలుస్తోంది. పేదలకు 7 లక్షల ఇళ్లు నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీఆర్ఎస్.. కేవలం కొన్నివేలే పూర్తి చేసిందంటూ ఎండగట్టాలని భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఈ ఇళ్ల నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ 24న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, 25న ఇందిరాపార్కు వద్ద ధర్నా బీజేపీ నిర్వహించనుంది. ఇక నిరుద్యోగ యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని కూడా పార్టీ నిర్ణయించింది.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి లండన్‌లో ఘనస్వాగతం

ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ ఆధ్వర్యంలో అట్టహాసంగా మీట్ అండ్ గ్రీట్



ఎయిర్‌పోర్టులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ-యూకే విభాగం ప్రతినిధులు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచ పర్యాటక సంస్థ (డబ్ల్యూటీఓ) ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి హైలెవల్ పొలిటికల్ ఫోరం (హెచ్ఎల్‌పీఎఫ్) వేదికగా న్యూయార్క్‌లో జరిగిన సదస్సులో పాల్గొన్న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సోమవారం లండన్ చేరుకున్నారు. లండన్ హీత్రూ విమానాశ్రయం చేరుకున్న కిషన్‌రెడ్డికి ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ-యూకే విభాగం ఘన స్వాగతం పలికింది. సంప్రదాయ పద్ధతిలో డోలు వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య హారతులతో స్వాగతించారు. అనంతరం ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్'లో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, భారతీయ సమాజంలో వచ్చిన మార్పులను వివరించారు. విదేశాల్లో ఉంటున్న భారతీయుల ఆకాంక్షలను పూర్తిచేయడం, విదేశాల్లో వారికి సరైన గౌరవం లభించేలా ప్రధాని మోదీ తీసుకుంటున్న చర్యలను వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా 'సంస్కృతి సెంటర్ ఫర్ కల్చరల్ ఎక్సలెన్స్' విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ యూకే విభాగం అధ్యక్షుడు కుల్దీప్ షెకావత్, ప్రధానకార్యదర్శి సురేశ్ మంగళగిరి పలువురు పాల్గొన్నారు.

'ధరణి' తప్పులు ప్రభుత్వానికి పట్టవా? : కిషన్‌రెడ్డి

'ధరణి'లో జరుగుతున్న తప్పులపై ప్రభుత్వానికి బాధ్యత లేదా? ప్రజల తిప్పలు ప్రభుత్వానికి పట్టవా? అని మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేవారిని బెదిరిస్తూ, అరెస్టులకు పాల్పడుతున్నారని సోమవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'ధరణి'లో గందరగోళం వల్ల రాష్ట్రంలోని 75 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి సమాధానమిచ్చి, భరోసా కల్పించాల్సింది పోయి.. ప్రభుత్వం ఓ ప్రైవేటు సంస్థతో ప్రకటన చేయించడం దుర్మార్గమైన చర్యని కిషన్‌రెడ్డి విమర్శించారు.

ఎగుమతుల్లో రాష్ట్రానికి 6వ ర్యాంక్

సాక్షి, న్యూఢిల్లీ: ఎగుమతులకు సంబంధించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సన్నద్ధతపై 'ఎగుమతుల సన్నద్ధత సూచిక 2022'ను నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ సోమవారం విడుదల చేశారు. ఈ నివేదికలో తెలంగాణ 61.36 స్కోర్‌తో 6వ ర్యాంక్ సాధించగా, ఏపీ 59.27 స్కోర్‌తో 8వ ర్యాంకులో నిలిచింది. ఎగుమతుల సన్నద్ధతపై విశ్లేషణ ద్వారా రాష్ట్రాల మధ్య పోటీతత్వం పెరుగుతుందని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది.

రేపట్నుంచి కాంగ్రెస్ రైతు భరోసా యాత్ర

▶ మొదటి పేజీ తరువాయి

దానిపై స్పష్టత ఇచ్చేందుకు గాను 'రైతు భరోసా యాత్ర'ను చేపడుతున్నట్టు టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు సుంకెట అన్వేశ్‌రెడ్డి సోమవారం వెల్లడించారు.

యాత్ర షెడ్యూల్ ఇలా..

టీపీసీసీ సోమవారం ఈ యాత్రకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 19న సాయంత్రం ఆదిలాబాద్‌లో యాత్ర ప్రారంభం కానుంది. 20న ఆసిఫాబాద్, మంచిర్యాల, 21న జగిత్యాల, సిరిసిల్ల, 22న సిద్దిపేట, జనగామ, 23న హనుమకొండ, వరంగల్, 24న పెద్దపల్లి, భూపాలపల్లి, 25వ తేదీన ములుగు, మహబూబాబాద్, 26న కొత్తగూడెం, ఖమ్మం, 27న సూర్యాపేట, యాదాద్రి, 28వ తేదీన రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, 29న వనపర్తి, గద్వాల, 30న మహబూబ్‌నగర్, నారాయణపేట, 31న వికారాబాద్, సంగారెడ్డి, ఆగస్టు1న మెదక్, కామారెడ్డిల మీదుగా ఆగస్టు 2వ తేదీన నిజామాబాద్ జిల్లాలో యాత్ర ముగించనున్నారు. కాగా, రైతు భరోసా యాత్ర ముగింపు సందర్భంగా నిజామాబాద్‌లో భారీ సభ నిర్వహించాలని టీపీసీసీ కిసాన్‌సెల్ నేతలు యోచిస్తున్నారు.

కారెలా నడుస్తోంది?

▶ మొదటి పేజీ తరువాయి

అంశాలపై మంత్రుల అభిప్రాయాలను సీఎం తెలుసుకుంటున్నారు. మంత్రులు కూడా తమ దృష్టికి వచ్చిన అంశాలను తెలియజేయడంతో పాటు ఎమ్మెల్యేల పనితీరుపై తమ మనోగతాన్ని వెల్లడిస్తున్నారు. ఎమ్మెల్యేల ఏకపక్ష ధోరణి కారణంగా చాలా చోట్ల పార్టీ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటోందనే అభిప్రాయం ఈ భేటీల్లో వ్యక్తమవుతోంది. కొన్నిచోట్ల పార్టీ నేతలు గ్రూపులను ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యేలకు ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నారని కేసీఆర్‌కు మంత్రులు తెలిపారు. కాగా పార్టీకి నష్టం చేస్తున్న నేతల వివరాలను సేకరిస్తున్న ముఖ్యమంత్రి, వారి విషయంలో అనుసరించాల్సిన వైఖరిపై దిశా నిర్దేశం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు నియోజకవర్గాల వారీగా విపక్ష పార్టీల బలాలు, బలహీనతలపై కూడా ఈ భేటీల్లో చర్చిస్తున్నట్లు తెలిసింది.

అవసరమైన చోట చేరికలకు గ్రీన్ సిగ్నల్

సర్వే సంస్థల నివేదికలు, వివిధ నిఘా సంస్థల రిపోర్టుల ఆధారంగా, నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్, విపక్షాల బలాలు, బలహీనతలపై కేసీఆర్ ఇప్పటికే ఓ అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొన్ని నియోజకవర్గాల ద్వారా ఇతర పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహించాల్సిందిగా మంత్రులను ఆదేశించినట్లు తెలిసింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు విఫలమైన చోట ఇతరులకు టికెట్ కేటాయించే అంశంపై మాత్రం ఈ భేటీల్లో సీఎం ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని తెలిసింది. పార్టీకి ఉపయోగపడతారని భావించే అసంతృప్త నేతలతో మాట్లాడి వారు పార్టీలోనే ఉండేట్టుగా చూడటంతో పాటు ఇతర పార్టీల్లో ప్రజాదరణ కలిగిన నేతలతో సంప్రదింపులు జరపాలనే సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. కేవలం క్షేత్ర స్థాయి పరిస్థితులకే పరిమితం కాకుండా ఎన్నికల సన్నద్ధతలో భాగంగా పార్టీ మేనిఫెస్టో, ప్రచార వ్యూహం ఖరారు వంటి అంశాలపై కూడా కేసీఆర్ దృష్టి సారించారు. మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలపై మంత్రుల నుంచి సీఎం అభిప్రాయాలు కోరుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, వాటి ప్రభావం, చేపట్టాల్సిన మార్పులు చేర్పులు తదితర అంశాలపై తన అభిప్రాయాలను కూడా ఈ భేటీల్లో కేసీఆర్ వెల్లడిస్తున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి.

ఎమ్మెల్యేలు, కీలక నేతలకు కేటీఆర్ క్లాస్

సీఎం కేసీఆర్ ఇలా మంత్రులతో వరుస భేటీలు జరుపుతుండగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు.. పలువురు ఎమ్మెల్యేలు, కీలక నేతలతో సమావేశమవుతున్నారు. పలువురు ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు అందుతుండటం, టికెట్‌ను ఆశిస్తున్న నేతల నడుమ ఆధిపత్య పోరుపై ఆయన దృష్టి సారించారు. వివాదాస్పద ప్రకటనలు, పనులతో తరచూ వార్తలకెక్కుతున్న ఎమ్మెల్యేలు, ఇతర నేతలకు కేటీఆర్ తరఫున ఫోన్లు వెళ్తున్నాయి. ఈ మేరకు ప్రగతిభవన్‌కు వస్తున్న పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కేటీఆర్ సీరియస్‌గా క్లాస్ తీసుకుంటున్నారు. ఎమ్మెల్యేలు రాజయ్య, శంకర్ నాయక్, రెడ్యా నాయక్, రోహిత్‌రెడ్డి, చెన్నమనేని రమేశ్ తదితరులు ప్రగతిభవన్‌లో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. టికెట్ల కేటాయింపు అంశం అధినేత కేసీఆర్ చూసుకుంటారని, వివాదాస్పద ప్రకటనలకు దూరంగా ఉండాలని కేటీఆర్ స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. కాగా ఈ నెల 20 నుంచి జరిగే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీ అనుసరించే వ్యూహంపై చర్చించేందుకు కేసీఆర్ మంగళవారం లేదా బుధవారం పార్టీ ఎంపీలతో సమావేశం కానున్నారు.

విద్యుత్ ప్లాంట్లలో రూ.15 వేల కోట్ల అవినీతి

- నిర్మాణ అంచనాలను పెంచి కమీషన్లు నొక్కారు: రేవంత్‌రెడ్డి
- ఉచిత కరెంటు పేరుతో బీఆర్ఎస్ సర్కారు అవినీతికి పాల్పడుతోంది
- నేను ఈ వాస్తవం చెప్పినందుకే కేటీఆర్ గంతులు వేస్తున్నారు
- కరెంట్ అంశంపై తాను ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్



సాక్షి, హైదరాబాద్: ''రాష్ట్రంలో రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలంటే 20 వేల మిలియన్ యూనిట్లు కావాలి. ఈ మేరకు విద్యుత్ కొనేందుకు ఏటా రూ.16,500 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు ప్రభుత్వం లెక్కలు చూపెడుతోంది. కానీ రైతులకు ఇస్తున్నది 8–10 గంటలే. ఇందుకు అయ్యే ఖర్చు రూ.8వేల కోట్లు మాత్రమే. మరి మిగతా రూ.8,500 కోట్లు ఎక్కడికి వెళుతున్నాయి? దానిపై బీఆర్ఎస్ సర్కారు విచారణకు సిద్ధమా?'' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. రాష్ట్రంలో చేపట్టిన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణ అంచనాలను పెంచేసి కమీషన్లు తీసుకున్నారని, ఈ వ్యవహారంలో రూ.15 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పేరుతో జరుగుతున్న దుర్వినియోగాన్ని తాను ప్రస్తావిస్తే బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మంత్రి కేటీఆర్ గంతులు వేస్తున్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. విద్యుత్ అంశంపై సిరిసిల్ల, సిద్దిపేట, చింతమడక, గజ్వేల్‌లలో రైతు వేదికలు సహా ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని, దమ్ముంటే రావాలని కేటీఆర్‌కు సవాల్ చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించ తలపెట్టిన మూడు పవర్ ప్రాజెక్టులకు రూ.45,730 కోట్లతో టెండర్లు పిలిస్తే అందులో రూ.15వేల కోట్లు అవినీతి జరిగిందని, కేసీఆర్ ప్రభుత్వం 30% కమీషన్లు తీసుకుందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టుల పేరిట తీసుకున్న రుణాలతో జెన్‌కో, ట్రాన్స్‌కో అప్పుల పాలయ్యాయని.. ఆ భారం విద్యుత్ వినియోగదారులపై పడుతోందని చెప్పారు. బందిపోటు దొంగలు, దండుపాళ్యం ముఠాలు కూడా బీఆర్ఎస్‌లా దోపిడీకి పాల్పడలేవని విమర్శించారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తే మహిళల మెడలోని తాళిబొట్లనూ అమ్మేస్తుందని వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్ నేతలను నిలదీయండి

విద్యుత్ రంగంలో ప్రభుత్వ అవినీతి, రైతాంగ సమస్యలపై బీఆర్ఎస్ నేతలను నిలదీయాలని, వారు రైతు వేదికల వద్దకు వచ్చినప్పుడు నిరసన తెలపాలని కాంగ్రెస్ శ్రేణులకు రేవంత్ పిలుపునిచ్చారు. రుణమాఫీ చేసే వరకు రైతు వేదికలకు తాళాలు వేయాలని, పేదల నుంచి లాక్కున్న అసైన్డ్ భూములను తిరిగి ఇచ్చే వరకు నేతలను నిర్బంధించాలని సూచించారు. ఎమ్మెల్యేలను కూడా చెట్లకు కట్టేయాలని వ్యాఖ్యానించారు.

కేటీఆర్‌కు ఆ స్థాయి ఉందా?

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్‌కు ఉందా అని రేవంత్ మండిపడ్డారు. ఏది కావాలనుకున్నా తన ముందుకు తెచ్చుకోగలిగిన స్థాయి ఉన్న, చదువుకున్న రాహుల్ వంటి నేత.. పేదలు, రైతుల కష్టాలను తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. కేటీఆర్‌కు వ్యవసాయం అంటే ఏమిటో తెలుసా, దుక్కి దున్నడం, సాలు కొట్టడమంటే ఏంటో తెలుసా అని ప్రశ్నించారు.

మోదీని ఓడించడం పిల్లలాట కాదు

- ప్రతిపక్షాలన్నీ ఏకమైనా ఆయన్ను ఏమీ చేయలేవు
- కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే
- తెలంగాణలో అట్రాసిటీ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన



సాక్షి, హైదరాబాద్: 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ స్థాయిలో నంబర్‌వన్ నాయకుడిగా అవతరించారు, ఆయన్ను ఓడించడం పిల్లలాట కాదు. కేంద్రంలో అధికారం చేపట్టిన మోదీ.. దేశాభివృద్ధికి ఎన్నో రకాలుగా సేవ చేసి ప్రజల మదిలో నిలిచిపోయారు. అలాంటి మహోన్నత వ్యక్తిపై ప్రతిపక్ష పార్టీలు ఎన్ని అపవాదులు సృష్టించినా ఏమీ కాదు. మళ్లీ మోదీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి రామ్‌దాస్ అథ వాలే వ్యాఖ్యానించారు. సోమవారం బేగంపేటలో రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరును శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

అట్రాసిటీ కేసులపై కేసీఆర్ సమీక్షించాలి

రాష్ట్రంలో అట్రాసిటీ కేసులు పెరుగుతున్నాయని కేంద్రమంత్రి అథవాలే అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై సీఎం కె.చంద్రశేఖర్‌రావు సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం అమలు చేసే కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వకపోయినప్పటికీ ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే విధంగా తాము చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవుతున్నాయని, తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాయని ఆరోపించారు. అయితే వీటిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, తిరిగి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీనే కొనసాగుతారని అథవాలే ధీమా వ్యక్తం చేశారు.

రాహుల్‌కు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

- పబ్‌లు, క్లబ్‌ల వెంట తిరిగే కేటీఆర్‌కు పొలాలు, మెకానిక్ షాపులు కూడా అలానే కనిపిస్తాయి
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



ఎర్రుపాలెంలో నిర్వహించిన మోటారు సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీఎల్పీ నేత భట్టి, నాయకులు

ఎర్రుపాలెం: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం, మధిరల్లో సోమవారం జరిగిన మోటారు సైకిల్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రధాని పదవినే త్యాగం చేసిన రాహుల్‌పై సభ్యత, సంస్కారం మరిచి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఎప్పుడూ పబ్‌లు, క్లబ్‌ల వెంట తిరిగే కేటీఆర్‌కు పొలాలు పబ్‌లలా, మెకానిక్ షాపులు క్లబ్‌లలా కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. అవినీతిలో కూరుకున్న కేటీఆర్ వెంట ఈడీ, సీబీఐ పడుతుండటంతో బీజేపీ నాయకులతో అంటకాగుతూ వారి డైలాగ్‌లను వల్లె వేస్తున్నారని విమర్శించారు.

రేవంత్ వ్యాఖ్యలను వక్రీకరించారు..

ఉచిత విద్యుత్ విషయంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేకూరుస్తాయా అన్న ప్రశ్నకు భట్టి సమాధానం ఇస్తూ ఆయన వ్యాఖ్యలను కట్ చేసి చూపించారని ఆరోపించారు. ఉచిత విద్యుత్ అనేది కాంగ్రెస్ పేటెంట్ అని, తాము అధికారంలోకి రాగానే నూటికి నూరు శాతం రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని భట్టి స్పష్టం చేశారు.

19 నుంచి జిల్లాల వారీగా సమావేశాలు

- బీసీ గర్జన సభకు కాంగ్రెస్ సన్నాహాలు
- ఇదే సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటన
- రాహుల్, సిద్ధరామయ్యలకు ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఓబీసీ ఓటర్లను తన వైపు తిప్పుకోవాలనే వ్యూహంలో భాగంగా త్వరలో బీసీ గర్జన సభ నిర్వహణకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మాజీ ఎంపీ వి.హనుమంతరావు నేతృత్వంలో ఈ సభ నిర్వహణ కోసం ఈనెల 19న సంగారెడ్డి, 21న కరీంనగర్, 23న నిజామాబాద్, 24న ఆదిలాబాద్‌లో సమావేశాలు నిర్వహించనుంది. రాష్ట్రంలోని బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో కల్పించాల్సిన ప్రాధాన్యత, కులాల వారీగా రాష్ట్రంలోని బీసీల పరిస్థితులు, వచ్చే ఎన్నికల్లో వారికి ఇవ్వాల్సిన హామీలు, బీసీ గర్జన సభ ఎక్కడ, ఎప్పుడు నిర్వహించాలనే అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించనున్నారు. బీసీలకు రిజర్వేషన్ల పెంపు, ఓబీసీ కులాల గణన కోరుతూ.. కుల గణన చేపట్టాలన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి కాంగ్రెస్ పార్టీ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానాలు చేయనున్నారు. కాగా ఆయా భేటీల్లో వ్యక్తమైన క్షేత్రస్థాయి నాయకుల అభిప్రాయాలు, వారు చేసినసూచనలకు అనుగుణంగా బీసీ గర్జన సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామని ఆ పార్టీ నేతలు చెపుతున్నారు. ఈ సభకు రాహుల్‌గాంధీతో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆహ్వానించనున్నారు. కాగా రాష్ట్రంలోని బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో, ఏం చేయబోతోందో బీసీ గర్జన సభలో చెప్తామని వీహెచ్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. పార్టీలోని బీసీ నేతలకు టికెట్ల పంపిణీలో ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా

- కరెంటు ఇచ్చేది ఎన్నిగంటలు అన్నది ముఖ్యం కాదు..
- పంటలు ఎండినట్లు ఎక్కడా ఫిర్యాదు రాలేదు
- ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు



రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు దంపతులు

వేములవాడ: రాష్ట్రంలో నాణ్యమై న విద్యుత్‌ను సర ఫరా చేస్తున్నా మని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు తెలిపారు. సోమవారం ఆయన వేముల వాడ రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరెంటు విషయంలో జరు గుతున్న రాద్ధాంతంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించారు. కరెంటు సరఫరా ఎన్ని గంటలు అన్నది ముఖ్యం కాదని, పంటలు ఎండినట్లు ఎక్కడా ఫిర్యాదులు రాలేదని అన్నారు. విద్యుత్‌కు, రాజకీయాలకు సంబంధం లేదని చెప్పారు.


రాజన్నకు కోడె మొక్కు

ప్రభాకర్‌రావు దంపతులకు వేములవాడ రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకుల బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. ప్రభాకర్‌రావు దంపతులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. తర్వాత కోడె మొక్కు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వారికి అర్చకులు స్వామివారి ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ ఎండీ రామకృష్ణ, ఆలయ ఏఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయం అంటే అంట్లు తోమడం కాదు

కేటీఆర్‌పై రేవంత్ ట్వీట్

ఎడ్లు, వడ్ల గురించి రాహుల్ గాంధీకి తెలియదన్న మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై రేవంత్‌రెడ్డి స్పందించారు. వ్యవసాయమంటే అమెరికాలో అంట్లు తోమడం కాదని, ఎడ్లు, వడ్లు అని ప్రాస కోసం పాకులాడే గాడిదలకు గంధపు చెక్కల వాసన ఏం తెలుస్తుందని సోమవారం ట్విట్టర్ వేదికగా ఎద్దేవా చేశారు. 'ఎవుసం అంటే గెస్ట్‌హౌస్‌లలో సేదతీరడం కాదు. సినిమా వాళ్లతో పార్టీలు చేసుకోవడం కాదు. అది మట్టి మనసుల పరిమళం. మట్టి మనుషుల ప్రేమ' అని పేర్కొన్నారు. తన ట్వీట్‌కు రాహుల్ దుక్కి దున్ని నాట్లు పెడుతున్న ఫొటోలను జత చేశారు.





కన్నుల పండువగా అమ్మవారి ఘటాల ఊరేగింపు

భాగ్యనగరంలోని పాతబస్తీలో సోమవారం బోనాల వేడుకల్లో భాగంగా అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం అమ్మవారి ఘటాన్ని అంబారీపై ఉంచి ఊరేగింపులో ముందు వరుసలో నడవగా.. మిగిలిన ప్రధాన దేవాలయాల ఘటాలు వెనుక అనుసరించాయి. ఈ ఊరేగింపు వివిధ ప్రాంతాల నుంచి చార్మినార్ మీదుగా నయాపూల్‌లోని మూసీ నది వరకు కొనసాగింది. - చార్మినార్

ఎస్‌సీ రైల్వే ఐజీగా అరోమా సింగ్



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ఇన్‌స్పెక్టర్ జనరల్–కమ్–ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా అరోమా సింగ్ ఠాకూర్ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌సర్వీస్ 1993 బ్యాచ్‌కు చెందిన ఆమె ఇంతకుముందు వాయువ్య జోన్‌లో ఇదే బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై దక్షిణ మధ్య రైల్వేకు వచ్చారు. తూర్పు రైల్వే పరిధిలోని హౌరా డివిజన్, జైపూర్ డివిజన్, వడోదర రైల్వే స్టాఫ్ కాలేజీ, జబల్పూర్, ఝాన్సీ, దక్షిణ రైల్వే, పెరంబూర్ ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలోని వివిధ పోస్టుల్లో పనిచేశారు. ఆమె పని తీరుకుగాను మూడు పర్యాయాలు ఇండియన్ పోలీసు సేవా పతకాలు దక్కాయి.

వృత్తి విద్యా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వృత్తి విద్యా ఉపాధ్యాయ సంఘం సోమవారం హైదరాబాద్ పీఆర్‌టీయూటీఎస్ కార్యాలయంలో సమావేశమై, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. రాష్ట్ర అధ్యక్షుడిగా గాడిశల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పోతిగంటి వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో పీఆర్‌టీ యూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి వృత్తి విద్యా ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ

- ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రత్యేక కార్యక్రమం
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులలో మానసిక ఉల్లాసం, నైపుణ్యాలను పెంపొందించే ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. ఉన్నతాధికారులతో కలసి సోమవారం ఆమె విద్యాశాఖ పనితీరుపై సమీక్ష జరిపారు. ఢిల్లీ తరహాలో మన రాష్ట్రంలోని విద్యార్థులకు ఆత్మ విశ్వాసం, మానసిక ధృఢత్వం పెంపొందించేలా మనోస్థైర్యం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాకు ఒక పాఠశాల చొప్పున 6, 7వ తరగతి విద్యార్థులను ఎంపిక చేసి ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇద్దరేసి ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. అలాగే విద్యార్థి దశలోనే వ్యాపార ఆవిష్కరణలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. మొదటి దశలో 8 జిల్లాల్లోని 24 మోడల్ స్కూళ్లను ఎంపికచేసి అందులో ఇంటర్ మొదటి సంవత్సరం చదివే 2,500 మంది విద్యార్థులను వ్యాపార ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఇందులో మెరుగైన 1,500 ఆవిష్కరణలను ఎంపిక చేసి ఒక్కో ఆవిష్కరణకు ప్రభుత్వం రెండు వేల రూపాయలను అందజేస్తుందని వివరించారు. వీరితో ప్రత్యేక ఎగ్జిబిషన్లు ఏర్పాటుచేసి, భవిష్యత్తులో ఉత్తమ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు.

వారంలోగా ఎస్సై పరీక్షల ఫలితాలు?

ఆగస్టులో శిక్షణ ప్రారంభించే విధంగా కసరత్తు

సాక్షి, హైదరాబాద్: పోలీస్ ఉద్యోగార్థుల ఎంపిక ప్రక్రియపై కసరత్తు తుదిదశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తి కావడంతో తుదిజాబితా ప్రకటించడమే మిగిలి ఉంది. పోలీస్ కొలువుల భర్తీ ప్రక్రియలో భాగంగా తొలుత సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటించేందుకు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి సన్నద్ధమవుతోంది. వారం రోజుల్లోనే ఎస్సై తుదిఎంపిక జాబితా విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ విభాగాల్లోని ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు కలిపి మొత్తం 97,175 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. ఈ ప్రక్రియ సైతం గత నెల 26వ తేదీనే పూర్తి చేసినట్టు బోర్డు అధికారులు ప్రకటించారు. ఆయా రిజర్వేషన్ కేటగిరీ, రోస్టర్ పాయింట్లు, మల్టీ జోన్లు... ఇలా మొత్తం 180 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎస్సై పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుదిజాబితా విడుదల చేయాల్సి ఉంటుంది. ఏ చిన్న పొరపాటు జరిగినా న్యాయపరమైన చిక్కులతో మొత్తం ప్రక్రియ ఆలస్యమయ్యే ప్రమాదముండటంతో బోర్డు ఉన్నతాధికారులు అన్ని అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

వివిధ విభాగాల్లో పోస్టులు ఇవీ...

పోలీస్ నియామక మండలి తొలుత విడుదల చేయనున్న ఫలితాల్లో సివిల్ ఎస్సై పోస్టులు 414, ఏఆర్ రిజర్వ్ ఎస్సై 66, రిజర్వ్ ఎస్సై (ఎస్‌ఏఆర్ సీపీఎల్) 5, టీఎస్‌ఎస్పీ రిజర్వ్ ఎస్సై 23, ఎస్‌పీఎఫ్ ఎస్సై 12, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 26, డిప్యూటీ జైలర్ ఎనిమిది, ఐటీ కమ్యూనికేషన్ ఎస్సై 22, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎస్సై పోస్టులు మూడు కలిపి మొత్తం 579 ఖాళీలు ఉన్నాయి. వీటన్నింటికీ వారం రోజుల్లో తుదిఎంపిక అభ్యర్థుల జాబితా విడుదల కానున్నట్టు సమాచారం. ఎస్సై తుదిఎంపిక అభ్యర్థుల జాబితా విడుదలైన తర్వాత వారి వ్యక్తిగత ప్రవర్తన, నేరచరిత్రపై వారి స్వస్థలాల్లోని పోలీస్‌స్టేషన్ల నుంచి వివరాలు సేకరించి పరిశీలించాల్సి ఉంటుంది. అన్నీ సరిగా ఉన్నవారికి ఉద్యోగ నియామకపత్రం అందుతుంది. వారినే శిక్షణకు పంపుతారు. ఎంక్వైరీ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులు యోచిస్తున్నారు. అన్ని సకాలంలో పూర్తి చేసి ఆగస్టు నుంచి ఎస్సైల శిక్షణ ప్రారంభించేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

道

సౌందర్యం సౌందర్య ప్రదర్శనకు దిగితే వికారంగా ఉంటుంది.
మంచితనం మంచితన ప్రదర్శనకు దిగితే చెడ్డతనం అవుతుంది.
– తావోయిజం

సాక్షి

మంగళవారం, 18 జూలై 2023

ఈ విస్తరణ మంచిదేనా?

అనేక సందర్భాల్లో ఆగి ఆలోచించడం, జరిగిన కథను సింహావలోకనం చేసుకోవడం అత్యవసరం. వివిధ దేశాల అంతర్ ప్రభుత్వ సైనిక కూటమి 'నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్' (నాటో) సభ్యులు గత వారం లిథువేనియాలో ఆ పనే చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడికి 500 రోజులు పూర్తయిన వేళ బాధితదేశానికి తామిస్తున్న ఆర్థిక, సైనిక సహకారాలను పరిశీలించడానికి సమావేశ మయ్యారు. 'నాటో'లో స్వీడన్ చేరేందుకు టర్కీ, ఆ వెంటనే హంగరీ అంగీకరించడం తాజా సమావేశంలోని కీలక పరిణామం. అదే సమయంలో ఉక్రెయిన్ చేరికపై మాత్రం నిర్ణీత కాలవ్యవధి ఏదీ ఈ కూటమి ప్రతిపాదించ లేదు. అమెరికా అధ్యక్షుడు సాంత్వన వచనాలు పలికినా, ఇది ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీలో నిరుత్సాహం రేపింది. వెరసి, యుద్ధక్షేత్రంలో ఉక్రెయిన్ ఎదురుదాడి నిదానించిందేమో కానీ, ఆ దేశానికి వెన్నుదన్నుగా నిలిచిన పాశ్చాత్య కూటమి బలోపేతమవుతోంది. రష్యాను చక్రబంధంలో ఇరికించే ప్రయత్నం నిరంతరాయంగా సాగుతోంది.

మొన్నటి దాకా స్వీడన్ చేరికను వీటో చేస్తూ టర్కీ అడ్డుకుంటోంది. ఇప్పుడు ఎత్తివేతతో స్వీడన్‌కు ఇక అన్ని అవరోధాలూ తొలగిపోయినట్లే! అటు రష్యాతో సుదీర్ఘమైన సరిహద్దున్న ఫిన్లాండ్, అలాగే ఇటు బాల్టిక్ సముద్రంలోని కీలకమైన గాట్లాండ్ తన చేతుల్లో ఉన్న స్వీడన్... రెండూ నాటో వైపు మొగ్గడం రష్యాకు చీకాకు పెంచే విషయమే. అసలైతే... ఫిన్లాండ్, స్వీడన్లు సాంప్రదాయికంగా సైనిక వ్యవహారాల్లో ఏ కూటమి వైపూ మొగ్గకుండా అలీన విధానాన్ని అనుసరించినవే. గత ఏడాది ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దిగడంతో అవి తమ వైఖరిని మార్చుకోవాల్సి వచ్చింది. 2022 మేలోనే ఫిన్లాండ్‌తో పాటు స్వీడన్ కూడా సభ్యత్వానికి దరఖాస్తు చేసుకుంది. మొన్న ఏప్రిల్‌లో ఫిన్లాండ్ 'నాటో'లో 31వ దేశ సభ్యదేశం కాగా, త్వరలోనే స్వీడన్ 32వది కానుందన్న మాట.

తాజా పరిణామాలతో ఒక విషయం అర్థమవుతోంది. బెలారుస్, ఉక్రెయిన్, జార్జియా మినహా పడమటి సరిహద్దులంతా ఇక నాటో బలగాల ఉనికితో రష్యా సర్దుకుపోక తప్పదు. అంతా అనుకున్నట్టు జరిగి నాటో ఇలాగే విస్తరిస్తూపోతే, యూరోపియన్ ప్రపంచ భద్రతా వలయంలోనూ మరిన్ని మార్పులు తథ్యం. దశాబ్దాలుగా రక్షణ వ్యయంపై వైముఖ్యం ప్రదర్శించిన దేశాలు సైతం ఇప్పటికే తమ సైనిక సన్నద్ధతకు పదును పెట్టుకుంటున్నాయి. 'నాటో'ను విస్తరించబోమంటూ సోవియట్ పతనకాలంలో వాగ్దానం చేసిన అమెరికా ఆ మాట తప్పి, ఉక్రెయిన్‌ను చేర్చుకొనేందుకు ఉత్సాహపడడమే సమస్యకు మూలమనేది రష్యా ఆరోపణ. నాటో విస్తరణతో తనకు భౌగోళిక, వ్యూహాత్మక ప్రమాదాలున్నాయనేది దాని వాదన. అందుకే కీవ్‌పై దాడికి తెగబడింది. ఈ రష్యా దురాక్రమణ వైఖరిని అటుంచితే దాని భయసందేహాలు సమంజసమే. ఆ సంగతి పాశ్చాత్యప్రపంచానికీ తెలుసు.


ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఇటు పాశ్చాత్య ప్రపంచ 'నాటో' ఏర్పాటు, అటు దానికి ప్రతిగా సోవియట్ యూనియన్ కూటమి 'వార్సా' ఒప్పందం గత చరిత్ర. సోవియట్ యూనియన్ విచ్ఛిత్తితో 'వార్సా'నే రద్దయ్యాక, ఇప్పుడు నాటో ప్రాసంగికత, దాన్ని విస్తరించాలనే అమెరికా ఆకాంక్ష దేనికి చిహ్నమనేది కొందరి ప్రశ్న. అయితే, రష్యాతో యుద్ధం ముగిసేవరకు 'నాటో'లో ఉక్రెయిన్ చేరిక అసాధ్యమే. స్వీయభద్రత సాకుతో రష్యా దండెత్తిన ప్రస్తుత పరిస్థితుల్లో ఉక్రెయిన్‌కు అధికారికంగా సభ్యత్వమిచ్చి, మరింత కోపం తెప్పించడం తెలివైన పని కాదు. అది పూర్తిస్థాయి యుద్ధానికి దారి తీయవచ్చు. అందుకే పాశ్చాత్య లోకం కీవ్‌కు కావాల్సిన ఆర్థిక, సైనిక సహకారమిస్తూనే సాంకేతికంగా కూటమిలో చేర్చుకోకుండానే కథ నడిపించే పనిలో ఉంది. నాటో భేటీ అదే ధ్రువీకరించింది.

మరోపక్క ఉక్రెయిన్‌పై దాడితో... నాటో వైపు చూస్తున్న పొరుగు దేశాలను దారికి తేవచ్చనుకున్న రష్యా అధినేత పుతిన్ అంచనాలూ తప్పాయి. నాటోలో సంఘీభావాన్ని బలహీనపరచడం, రష్యా సరిహద్దుల వైపు నాటో మరింత విస్తరించకుండా ఆపడమనే లక్ష్యంలో ఆయన విఫలమయ్యారు. ఉక్రెయిన్ యుద్ధానికి ముందు నాటోతో రష్యా భూ సరిహద్దు 754 మైళ్ళే. ఇవాళ అది 1584 మైళ్ళయింది. రేపు ఉక్రెయిన్ కూడా ఆ కూటమిలో చేరితే, అది మరింత పెరుగుతుంది. పెనునష్టం తెచ్చిపెట్టిన యుద్ధంతో ఉక్రెయిన్ భూభాగంలో 17 నుంచి 18 శాతం రష్యా కలుపుకోగలిగింది. ఈ కలుపుకొన్న కొద్ది ప్రాంతం సాంకేతికంగా లాభదాయకమే కానీ, అంతకన్నా విశ్వవేదికపై వ్యూహపరంగా రష్యాకు జరిగిన నష్టమే అధికం. ఒక్కమాటలో పుతిన్ సెల్ఫ్ గోల్ చేసుకున్నారు. నాటోలో చేరితే తీవ్ర పరిణామాలు తప్పవని తీవ్రంగా హెచ్చరించినా, ఇప్పటికే ఫిన్లాండ్, త్వరలోనే స్వీడన్ నాటోతో జట్టు కడుతున్నాయి. ఇక పుతిన్ ఏం చేస్తారో?

వాస్తవానికి, ఉక్రెయిన్ యుద్ధంతో నిరంతర నాటో విస్తరణ రాజకీయ వ్యూహ అనివార్యతగా తయారైంది. కానీ, ఇది రెండంచులా పదునైన కత్తి. ఈ చర్య రష్యా పొరుగుదేశాలకే చేటు తేవచ్చు. నిత్యం సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, వివాదాలు ఏదో ఒక సమయంలో యుద్ధానికి దారి తీయ వచ్చు. పొరపాటున అది ప్రపంచ యుద్ధమైనా ఆశ్చర్యం లేదు. నిర్ణీత ప్రాంతంలో భద్రత, సుస్థిరత కోసమంటూ సైనిక కూటములలో చేరుతున్నామంటారు. తీరా ఆ కూటములు మరింత అస్థిరతకూ, భావి యుద్ధాలకు పునాదులు వేస్తున్నాయనిపిస్తుంది. నాటో విస్తరణతో ఎవరి ప్రయోజనాలు ఎలా ఉన్నా, ఐరోపా మాత్రం వ్యూహాత్మక సుస్థిరతను అందుకుంటున్న దాఖలాలైతే లేవు. పైపెచ్చు, అది దీర్ఘకాలిక అస్థిరత, నిరంతర అభద్రత వైపు అడుగులేస్తున్నట్టు కనిపిస్తోంది. ఆ అనుమానాల రీత్యా చూస్తే, నాటో సభ్య దేశాలు పెరగడం పాశ్చాత్య ప్రపంచానికి నిజంగా శుభప్రదమేనా అన్నది ప్రశ్న.

మద్దతు ధరతోనే వైవిధ్యం సాధ్యం

విశ్లేషణ



అరుణ్ సిన్హా

అవసరానికి మించి ఎరువులను వాడడం వల్ల నేలలోని పోషకాలు క్షీణిస్తున్నాయి. వృద్ధులైన వాళ్లు ప్రమాదకరమైన స్టెరాయిడ్లపై బతుకుతున్నట్లు ఉందిప్పుడు నేల పరిస్థితి. దేశంలో హరిత విప్లవం మొదలైన రాష్ట్రాల్లో రైతులు పంట మార్పిడి పద్ధతిని వదిలేశారు. ఈ పద్ధతి నేల, నీరు, ఎరువులను సమతుల పద్ధతిలో ఉపయోగించుకునేందుకు ఉద్దేశించినది. దాన్ని వదిలి, వరి లేదా గోధుమ పంటలకే పరిమితమయ్యారు. వైవిధ్యభరితమైన ఇతర పంటలను సాగు చేయకపోతే రసాయన ఎరువులు, నీటిపై మరింత ఎక్కువ ఆధారపడాల్సిన పరిస్థితులు వస్తాయి. రైతులు మారాలంటే వారి పంటలకు కనీస మద్దతు ధర లభించాలి. రసాయనిక ఎరువులకు దీటుగా దిగుబడి ఇవ్వగల సమర్థమైన సహజ ఎరువుల ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలి.

కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పీఎం–ప్రణామ్ పేరుతో ఓ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. వ్యవసాయం కోసం ప్రత్యామ్నాయ పోషకాల వాడకాన్ని ప్రోత్సహించడం దీని లక్ష్యం. పర్యావరణానికి హాని కలిగిస్తున్న రసాయన ఎరువుల స్థానంలో సేంద్రీయ, జీవ సంబంధిత ఎరువులను వాడే మంచి ఉద్దేశంతో మొదలైందీ పథకం. అవసరానికి మించి ఎరువులను వాడటం వల్ల నేలలోని పోషకాలు క్షీణిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం హరిత విప్లవం మొదలైన పంజాబ్, హరియాణా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లోనే తీవ్రంగా ఉండటం గమనార్హం. వృద్ధులైన వాళ్లు ప్రమాదకరమైన స్టెరాయిడ్లపై బతుకుతున్నట్లు ఉందిప్పుడు ఈ రాష్ట్రాల్లోని నేల పరిస్థితి. పని జరుగుతూంటుంది కానీ, నేల డొల్లగా మారిపోతూ ఉంటుంది. నేల సామర్థ్యం, పంట దిగుబడులు క్రమేపీ తగ్గిపోతాయి. మిగిలిన రాష్ట్రాల్లోనూ నేల పరిస్థితి ఇలాగే ఉందనడంలో సందేహం ఏమీ లేదు.

ప్రమాదకరమైన రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ, జీవ సంబంధిత ఎరువులను వాడేందుకు ప్రభుత్వం పీఎం–ప్రణామ్ పథకాన్ని ప్రారంభించడం ఆహ్వానిందగ్గ పరిణామమే. కానీ, అమలుకు ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. మొదటిది, ఈ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం. ప్రస్తుతం రైతులకు అందించే ఎరువుల సబ్సిడీలోంచే ఈ పథకానికి కావాల్సిన మొత్తాలను సర్దుకోవాలి. ఇందుకు తగ్గట్టుగా సహజసిద్ధమైన ఎరువులను వాడేలా రైతులను ప్రోత్సహించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని కేంద్రం ఆశిస్తోంది. ఇలా మిగిల్చిన ఎరువుల సబ్సిడీ మొత్తంలో యాభై శాతాన్ని కేంద్రం రాష్ట్రాలకు అందివ్వనుంది. ఈ మొత్తాలతో సహజ ఎరువులపై అవగాహన పెంచడం, ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు చేపట్టాలి.

రాష్ట్రాలకు ఈ మార్పును సమర్థంగా అమలుచేయగల సత్తా ఉందా? భారీ స్థాయిలో సహజ ఎరువులు వాడేలా చేయగలదా? అలాంటి సూచనలు ఇప్పటికైతే ఏమీ కనిపించలేదు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' గత ఏడాది విడుదల చేసిన నివేదిక ప్రకారం, సహజ ఎరువుల రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. నియంత్రణల్లేవు. అసంఘటితంగా ఉంది. కేంద్రం సహజ ఎరువులను ప్రోత్సహించేందుకు అందిస్తున్న నిధులు చాలావరకూ మురిగిపోతున్నాయి. సహజ ఎరువుల ఉత్పత్తి కూడా తక్కువగా ఉంది. పైగా ఉత్పత్తి అవుతున్న వాటి నాణ్యత కూడా నాసిగా ఉంది. చాలా రాష్ట్రాల్లో తగిన పరిశోధనాశాలలూ లేవు.

ప్రాంతీయ స్థాయిలోని ఆర్గానిక్ ఫార్మింగ్ లాబొరేటరీలను కూడా 2019–20 సంవత్సరంలో వాటి సామర్థ్యంలో మూడో వంతు మాత్రమే వినియోగించుకున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. బయో ఫర్టిలైజర్ నమూనాల పరీక్షలు ఏటికేడాదీ పెరగాల్సింది పోయి



తగ్గిపోతున్నాయి. 2013–14లో ఏడాదికి 654 నమూనాలు పరీక్షిస్తే, 2019–20లో ఈ సంఖ్య 483కు పడిపోయింది. అదే సమయంలో ఈ పరీక్షలను తట్టుకుని వాడకానికి సిద్ధమైన ఎరువుల శాతం ఒకటి నుంచి 44 శాతం కావడం గమనార్హం. అంటే నకిలీ బయో ఫర్టిలైజర్లు పెరిగిపోయాయన్నమాట.

పీఎం – ప్రమాణ్ పథకం మొత్తం రైతులు సహజ ఎరువుల వాడకానికి మొగ్గ చూపుతారన్న అంచనాపై మొదలైంది. లాభాలు లేని పక్షంలో రైతులు వీటి వాడకానికి ఎందుకు మొగ్గు చూపుతారన్న ప్రశ్నకు సమాధానం లేదు. సహజ ఎరువుల వాడకం వల్ల మట్టి ఆరోగ్యం పెరగాలి. సాగు, పంట ఖర్చులు తగ్గాలి. దిగుబడులు పెరగాలి. తద్వారా ఆదాయమూ ఎక్కువ కావాలి. ఇప్పటివరకూ ఒక స్థాయి జీవనశైలిని అలవర్చుకున్న రైతులు ఇప్పుడు తక్కువ ఆదాయం, దిగుబడి వస్తుందంటే సహజ ఎరువులవైపు మళ్లే అవకాశాలుండవు. అందుకే ప్రభుత్వం సహజ ఎరువుల లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. ఉత్పత్తి, సరఫరాల సామర్థ్యాలను కూడా పెంచుకోవాలి. రసాయనిక ఎరువులకు దీటుగా దిగుబడి ఇవ్వగల సమర్థమైన, నాణ్యమైన సహజ ఎరువుల ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాలి.

ఇవన్నీ చేసినప్పటికీ నేల సారాన్ని పెంచేందుకు, పునరుజ్జీవింపచేసేందుకు పీఎం – ప్రణామ్ సరిపోదు. ఎందుకంటే దేశంలో మట్టి సారం అంతగా దిగజారిపోయింది. రసాయనిక ఎరువుల వాడకంతో పాటు, అతిగా సాగు చేయడమూ దీనికి కారణం. దేశంలో హరిత విప్లవం మొదలైన రాష్ట్రాల్లో రైతులు పంట మార్పిడి పద్ధతిని ఎప్పుడో వదిలేశారు. ఈ పంట మార్పిడి పద్ధతి నేల, నీరు, ఎరువులను సమతుల పద్ధతిలో ఉపయోగించుకునేందుకు ఉద్దేశించినది. దాన్ని వదిలేసుకుని వరి లేదా గోధుమ పంటలకు మాత్రమే పరిమితమయ్యారు! అప్పట్లో ప్రభుత్వానికి ఈ రెండు ధాన్యాల అవసరం ఎక్కువగా ఉండింది కాబట్టి ఆ పంటలు ఎక్కువ పండించేలా రైతులను ప్రోత్సహించింది. మొక్కజొన్న, చిరుధాన్యాలతో పోలిస్తే ఈ రెండు పంటలకూ నీటి అవసరం చాలా ఎక్కువ. వరి, గోధుమలను ఎక్కువగా ఉత్పత్తి చేయడమంటే నదీ, భూగర్భ జలాలను అతిగా వాడుకోవడమే. దీనివల్ల నీటి లవణత కూడా పెరిగి పోషకాలు తగ్గిపోతాయి. అంటే ఈ సమస్య మూలం వరి, గోధుమల సాగులోనే ఉందన్నమాట. నైట్రోజన్ , ఫాస్ఫరస్, పొటాషియం, సేంద్రీయ కర్బనం, జింక్, ఐరన్, మాంగనీస్ వంటి పోషకాలన్నీ కూడా తుడిచి పెట్టుకుపోతున్నాయి. రైతులు వరి, గోధుమ పంటల సాగును తగ్గించుకుని వైవిధ్యభరితమైన ఇతర పంటలను సాగు చేయకపోతే రసాయన ఎరువులు, నీటిపై వారు మరింత ఎక్కువ ఆధారపడాల్సిన పరిస్థితులు వస్తాయి. రైతులు మారాలంటే వారి పంటలకు కనీస మద్దతు ధర లభించాలి. ఏడు రకాల ధాన్యాలు, ఐదు పప్పులు, ఏడు నూనె గింజలు, నాలుగు వాణిజ్యం పంటలకు కేంద్రం ఏటా కనీస ధరను నిర్ణయిస్తూంటుంది. ఈ పంటలన్నింటినీ ప్రభుత్వమే కొనుగోలు చేయనవసరం లేనప్పటికీ వాటికి కనీస మద్దతు ధరను నిర్ణయించడం అవసరం.

హరియాణాలో ఇటీవల పొద్దుతిరుగుడు సాగు చేసే రైతులు ఆందోళనకు దిగారు. కేంద్రం క్వింటాల్‌కు రూ.6,400 కనీస మద్దతు ధర నిర్ణయించినా, ప్రైవేట్ వ్యాపారులు రూ.4,200కు మించి చెల్లించడం లేదన్నది రైతుల ఆరోపణ. ఇంకోపక్క రాష్ట్ర ప్రభుత్వం ఈ పంటలు కొనుగోలు చేయడం నిలిపివేసింది. ఈ విషయమై రైతులు ఆందోళనకు దిగడంతో రాష్ట్ర ప్రభుత్వం పొద్దుతిరుగుడు పంటను క్వింటాల్‌కు రూ.4,800 ధర చెల్లించేందుకు ఒప్పుకుంది. కనీస మద్దతు ధరకు, ఈ మొత్తానికి ఉన్న తేడాను తగ్గించేందుకు ప్రతి క్వింటాల్‌కు అదనంగా ఇంకో వెయ్యి రూపాయలు చెల్లించేందుకు సరేనంది. అయినప్పటికీ ఈ మొత్తం కనీస మద్దతు ధర కంటే ఆరు వందల రూపాయలు తక్కువగా ఉండటం గమనార్హం. రైతులు దీనికీ ఒప్పుకోకుండా చండీగఢ్ –ఢిల్లీ రోడ్డుపై ధర్నాకు దిగారు. ఆఖరుకు ప్రభుత్వం ధర ఇంకో రెండు వందల రూపాయలు పెంచింది.

ఈ విషయంలో రైతులను తప్పుపట్టాల్సిన అవసరం లేదు. వారు తమ పొలాల్లో వేర్వేరు పంటలు వేసేందుకు సిద్ధంగానే ఉన్నారు. పొద్దు తిరుగుడు పంటనే తీసుకుంటే, 2018–19లో కేవలం 9,440 హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతూండగా, 2020–21కి ఇది 12,290 హెక్టార్లకు పెరిగింది. ఆ తరువాతి సంవత్సరం 13,020 హెక్టార్లకు, 2022–23 నాటికి 14,160 హెక్టార్లకు పెరగడం గమనార్హం. ప్రభుత్వం కనీస మద్దతు ధరను రైతులకు ఆకర్షణీయంగా ప్రకటించగలిగితే పొద్దుతిరుగుడు సాగు మరింత ఎక్కువగా జరిగేందుకు అవకాశముంది. అలాగే మొక్కజొన్న, చిరుధాన్యాల సాగు కూడా ఊపందుకుంటుంది.

వ్యాసకర్త 'ఎగైనెస్ట్ ద ఫ్యూ: స్ట్రగుల్స్ ఆఫ్ ఇండియాస్ రూరల్‌పూర్' గ్రంథ రచయిత
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నిజంగా ఒక్కడేనా?



ఒకవైపేమో ఆప్, కాంగ్రెస్, జేడీయూ, తృణమూల్, ఆర్జేడీ, ఇంకా ఇతర పార్టీలున్నాయి. ఇవన్నీ నరేంద్ర దామోదరదాస్ మోదీ అనే మనిషిని ఓడించడమే లక్ష్యంగా ఏకమయ్యాయి. ఒక్క నిమిషం ఆగండి: మోదీ+ఎన్సీపీ(అజిత్ పవార్)+ ఓపీ రాజ్‌భర్+ ముఖ్తార్ అన్సారీ అబ్బాయి+ ఏఐఏడీఎంకే+ అప్నాదళ్+శివసేన (ఏక్‌నాథ్ శిందే)+ ఆర్ఎల్‌పీ+ ఇంకా 22 పార్టీలు. అంటే మోదీ వర్సెస్ అన్ని పార్టీలు అనే కథనం ఎప్పుడు పనిచేస్తుందంటే, బీజేపీ ఎవరినీ కలుపుకోక, ఐక్య ప్రతిపక్షంతో ఒంటరిగా పోరాడినప్పుడు మాత్రమే! మోదీ ఒంటరిగానే పోరాడి, దాన్ని మోదీ వర్సెస్ అందరూ చేయాలని ఆశిద్దాం.

– రోషన్ రాయ్, వ్యాఖ్యాత

సగానికి సగం



ఇవ్వాళ నేను 5,000 రూపాయలు సంపాదించాను. ఇందులో ప్రభుత్వానికి 30 శాతం పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన డబ్బుతో ఏమైనా కాఫీ తాగుదామా అనుకున్నాను. దీనికి నేను 28 శాతం పన్నుగా చెల్లించాలి. అంటే రోజుకు 12 గంటలు నేను పనిచేస్తున్నది కేవలం నా ఆదాయంలో 50 శాతం ప్రభుత్వానికి చెల్లించడానికే అని గ్రహించాను.

– సంచిత్ గోయెల్, మేనేజర్

పట్టించుకోవాల్సిన అంశం



విభజనప్పుడు కరాచీలో ఎక్కువగా ఉండిపోయిన హిందువులు ఎస్సీలు, ఎస్టీలు. నౌకర్లుగా పని చేస్తుండటంతో 'అత్యవసర సేవల చట్టం' వారిని దేశం విడిచి వెళ్లడానికి అనుమతించక బలవంతంగా ఆపింది. ఆ చారిత్రక తప్పిదాన్ని 'పౌరసత్వ సవరణ చట్టం' (సీఏఏ) పట్టించుకుంటుంది. ఇది అర్థంకాని ఇక్కడి కులీనులు గోలపెడుతుంటారు.

– సజ్జన్ కుమార్ సింగ్, పొలిటికల్ ఎనలిస్ట్

హింస కనబడదా?



మణిపూర్ ఇప్పటికీ ఉద్రిక్తంగానే ఉంది. ఆ ప్రాంతం నుంచి మీ దృష్టి మరల్చకండి. చావులు, హింస ఇంకా అధికంగానే ఉన్నాయి. కానీ చూస్తుంటే మీడియా ఈ పరిణామాలను విస్మరిస్తున్నట్టు కనబడుతోంది.

– పమేలా ఫిలిపోస్, జర్నలిస్ట్

చెయ్యాల్సింది వదిలి ఇంకేదో చేస్తున్నారు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''భారత రాజ్యాంగంలో కీలకమైన 44వ అధికరణ ప్రకారం దేశానికంతటికూ కలిపి ఒకే ఒక పౌర స్మృతి అమలులో ఉండాలి. ఇది లేనందునసే దేశంలోని సామాజికులలో ఐక్యత, అమలు జరగాల్సిన ఆర్థిక న్యాయం కుంటుపడి పోతున్నాయి''

– ఎం. వెంకయ్య నాయుడు, భారత మాజీ ఉపరాష్ట్రపతి ప్రకటన (7.7.2023)

వెనకటికొకడు 'తాడి చెట్టు ఎందుకెక్కావురా' అంటే, కల్లు కోసమనే రీతిగా సమాధానం చెప్పకుండా 'దూడ మేత కోసం' అని సమాధానం చెప్పాడట. 'ఒకే దేశం ఒకే జాతి' అనే బీజేపీ ఎజెండాను అమలు చేయడంలో భాగంగా 'ఉమ్మడి పౌర స్మృతి'ని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిందనేది బహిరంగ రహస్యమే. అసమానతలను రూపుమాపుకునే హక్కు రాజ్యాంగం ప్రసాదించింది. కానీ ఆ విషయాన్ని మరచి అందుకు పూర్తిగా భిన్నమైన భూస్వామ్య, పెట్టు బడిదారీ వ్యవస్థల మూలాలు చెక్కు చెదరకుండా భారత కాంగ్రెస్, బీజేపీ పాలకులు సంపూర్ణ మంత్రి వర్గాల పేరుతోనో, సంకీర్ణ ప్రభుత్వాల నాటకంతోనో ఇంతకాలం కాలక్షేపం చేస్తూ వచ్చారు. కుల, మత, వర్గ విభేదాలు ప్రజల మధ్య పెరగడానికి, పాక్షిక రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకుని తాత్కాలికంగా గట్టెక్కడానికి ఎత్తులు, పైఎత్తులతో కాలక్షేపం చేస్తూ వస్తున్నారు. అటువంటి ఒక ఎత్తుగడే 'ఉమ్మడి పౌర స్మృతి.'

తమ స్వార్థ రాజకీయాలను వివిధ అణగారిన ప్రజా శక్తులు ఆందోళనల ద్వారా, సమ్మెల ద్వారా, ఉధృత స్థాయిలో ఉద్యమాల ద్వారా ఎదుర్కొంటూ వస్తూండటంతో పాలక వర్గాలు అరెస్టులు, కాల్పులు, నిర్బంధ విధానాల ద్వారా ప్రజా శక్తుల్ని అణచ జూస్తు న్నారు. ఈ సందర్భంగా, ప్రజలపై నిర్బంధ విధానాన్ని అమలు జరపడం ద్వారా పాలకులు అనుసరించే ఎత్తుగడలకు విచిత్రమైన రెండు ఘటనలను చరిత్రనుంచి ఉదహరించుకుందాం: ముందుగా పాత సోవియెట్ యూనియన్‌లో చోటుచేసుకున్న సంఘటన. పంటలు పండించడంలో ఆరితేరిన ఒక రైతు ఒక మార్కెట్ స్క్వేర్‌లో నిలబడి, 'మన వ్యవసాయ మంత్రి ఒక తెలివితక్కువ దద్దమ్మ (ఫూల్) అని అరిచాడట. అంతే ఆ రైతును అరెస్టు చేసి 10 సంవత్సరాల ఒక మాసం పాటు జైల్లో నిర్బంధించారు. అందులో ఆ రైతు, మంత్రి గారిని 'ఫూల్' అని అగౌరవ పరచినందుకు ఒక మాసం పాటు, ప్రభుత్వ గుట్టును రట్టు చేసినందుకు 10 ఏళ్ళు శిక్ష విధించారు. ఇంతకూ అసలు రహస్యం – ఆ రైతు పెద్ద మంత్రిని ఎద్దేవా చేసినందుకు విధించిన జరిమానా చిన్నదే, కానీ మంత్రిని 'పనికిమాలిన దద్దమ్మ' అన్న విమర్శ ప్రజల మనస్సుల్ని బాగా ప్రభావితం చేసినందుకు భారీ పెనాల్టీ విధించడం జరిగిందట!

అలాగే మన దేశంలో జరిగిన మరో సంఘటన చూద్దాం. 'నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ... వీళ్లందరి ఇంటిపేర్లుగా మోదీ ఎలా వచ్చింది? దొంగలందరి ఇంటిపేరుగా మోదీ ఎలా వచ్చింది' అన్న రాహుల్ గాంధీ 'జోక్' కూడా క్రిమినల్ కేసులో చేరిపోయింది. దీనిపైన సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్ సంజయ్ హెగ్డే వ్యాఖ్యా నిస్తూ 'జోక్‌ను, విమర్శను పరువు నష్టం కింద భావించి ఒక వ్యక్తిని అమెరికాలో జైలులో నిర్బంధించరు. 'ఏలిననాటి శని' లాంటి వలస చట్టం వల్ల ఇది ఇక్కడ సాధ్యమయింద'న్నారు. 'ఏదో ఒక మోదీని అవమానించారని కాదు, మోదీలందరినీ ఉద్దేశించి అన్న సాధారణ అర్థంలో రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని కోర్ట్ శిక్ష విధించింది' అని ఆయన వివరించారు. పలువురు వ్యక్తులను సంబోధించే క్రమంలో ఇంటి పేర్లు, వంశనామాలు పెట్టి పిలిచినంత మాత్రాన 'పరువు నష్టం' కింద జమ కట్టడానికి వీలు కాదన్నారు. ఈ సందర్భంగా ఆయన హోమీ మోదీ, లాలా మోదీ, సయెద్ మోదీ, పూర్ణేందు మోదీ వంటి పేర్లను ప్రస్తావించారు.

రెండో మాట



భారత రాజ్యాంగానికి విశిష్టమైన వ్యాఖ్యాన పరంపర అందించిన సుప్రసిద్ధ మానవ హక్కుల పరిరక్షణా ఉద్యమ నేతల్లో అగ్రగణ్యుడైన ఉన్నత న్యాయవాది కేజీ కన్నాభిరాన్ దేశంలోని పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తల్ని భూస్వామ్య పెట్టుబడిదారీ ప్రభుత్వం అన్యాయంగా అరెస్టులు చేసి, నిరాధారమైన ఆరో పణలతో జైళ్లపాలు చేసినప్పుడు నిద్రాహారాలు లెక్క చేయకుండా వారికి లీగల్ సహాయం అందించి విడుదలయ్యేటట్టు చేశారు. నక్సలైట్ ఖైదీల విడుదల కోసం ఏర్పడిన రక్షణ కమిటీకి కన్వీనర్‌గా పనిచేశారు. దేశంలో న్యాయ వ్యవస్థ పనితీరును ప్రస్తావిస్తూ కన్నాభిరాన్, న్యాయ వ్యవస్థ పనిచేస్తున్న తీరును ప్రస్తావించి ఇలా వ్యాఖ్యానించారు: ''దేశంలోని కోర్టులు అధికార, అనధికార స్థానాల్లో ఆధిపత్య స్థానాల్లో ఉన్న బలవంతులైన వారిని దుర్మార్గపు పరిణామాలకు బాధ్యుల్ని చేసి శిక్షించలేక పోతున్నాయి. చివరికి అణగారిన కార్మికులు ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న సందర్భాల్లో కూడా అలాంటి వారి రక్షణకు కొన్ని కోర్టులు ముందుకు రావడం లేదు''!

చివరగా... చరిత్రలో కొందరు పాలకులు ప్రజలపైన, చివరికి, ప్రసిద్ధ చరిత్రకారులపైన ఎన్ని కిరాతకమైన ఆంక్ష లు విధిస్తారో, దుర్మార్గాలకు పాల్పడుతుంటారో తెలియచేసే ఉదాహరణ ఒకటి చూద్దాం. చైనా చరిత్రలో 'సీమా కియాన్' అనే ప్రసిద్ధ చరిత్రకారుడు చక్రవర్తిని విమర్శించి ప్రజల ముందు అభాసుపాలు చేశాడు. అందుకు ఆ చక్రవర్తి ఒక దుర్మార్గమైన 'ఆఫర్' ఇచ్చాడు. చేసిన నేరానికి 'ఉరిశిక్ష కావాలా లేక ఆ స్థానంలో నపుంసకుడిగా మారి పోతావా' అని అడిగాడు. మరి తాను చరిత్రకారుడు కాబట్టి నపుంసకుడిగా ఉండిపోయి అయినా తాను ప్రారంభించిన చరిత్ర రచనను పూర్తిచేయాలనుకున్న కియాన్ నపుంసకునిగా మారడానికే మొగ్గాడు. (సైమన్ సీబాగ్ మాంటిఫియోర్ 'ది వరల్డ్: ఎ ఫ్యామిలీ హిస్టరీ ఆఫ్ హ్యుమానిటీ'). బహుశా కారల్ మార్క్స్ మహనీయుడు అందుకే అని ఉంటాడు: ''మనుషులు తమ చరిత్రను తామే లిఖించుకుంటారు. కానీ, తమ ఇష్టా ఇష్టానుసారంగా రాసుకుంటూ పోలేరు. ఎవరికి వారు తమకు తామై ఎంచుకునే సందర్భాల ప్రకారమూ రాసుకోలేరు. మరి ఏ పునాది ఆధారంగా రాస్తారు – సిద్ధాన్నంలాగా అప్ప టికే ఉన్న పరిస్థితులు ఆధారంగా, గతం నుంచి సంక్రమించిన పరిస్థితులు ఆసరాగా తప్ప మరొక మార్గం లేదు''!

అవును కదా మరి –

''భూమిలోన పుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వంబు తానేను''!

abkprasad2006@yahoo.co.in


మూడు జెన్ కథలు

1. చంద్రుణ్ణి దొంగిలించలేము

ర్యోకన్ అనే జెన్ గురువు కొండ దిగువన ఓ చిన్న పూరి గుడిసెలో ఉంటూ అతి సాధారణ జీవితం గడిపేవాడు. ఓనాడు పొద్దు పోయాక ఓ దొంగ గుడిసెలో దూరాడు. పరికిస్తే అక్కడ దొంగిలించడానికి ఏ వస్తువూ కనబడలేదు.

ఈలోపు గుడిసెకు తిరిగి వచ్చిన ర్యోకన్ కంట పడ్డాడు దొంగ. ర్యోకన్ అతనితో అన్నాడు: ''నన్ను చూడటానికి నువ్వు చాలా దూరం నుంచి వచ్చి ఉంటావు. వట్టి చేతుల్తో నీవు తిరిగి పోకూడదు. బహుమానంగా నా బట్టలు పట్టుకెళ్ళు.''

దొంగ గాబరా పడిపోయాడు. బట్టలు పుచ్చుకొని అక్కడి నుండి మెల్లగా జారుకొన్నాడు. ఆ రాత్రి ర్యోకన్ నగ్నంగా కూర్చొని చంద్రుణ్ణి చూస్తూ అనుకొన్నాడు: ''అందంగా ఉన్న ఈ చంద్రుణ్ణి అతడికి ఇచ్చి ఉంటే ఎంత బాగుండేది!''



జ్యోతిర్మయం

2. బురద రోడ్డు

ఓ రోజు టాన్‌జన్, ఎకిడొ ఇద్దరూ కలిసి ఓ మట్టి రోడ్డు మీద నడుచుకొంటూ వెళ్తున్నారు. పెద్ద వర్షం ఆగకుండా ఇంకా పడుతూనే ఉంది. రోడ్డంతా బురద బురదగా ఉంది.

ఓ మలుపు దగ్గర వాళ్లకు సిల్కు బట్టల్లో ఓ అందమైన యువతి రోడ్డు దాటలేక ఇబ్బంది పడుతూ కనిపించింది.

టాన్‌జన్ ఆ అమ్మాయిని రమ్మని పిలిచి, రాంగానే ఆమెను చేతుల్లోకి ఎత్తుకొని రోడ్డు దాటించాడు.

ఆ రాత్రి వాళ్ళు విశ్రాంతి గదికి జేరుకునేంత వరకు ఎకిడొ నోరు విప్పలేదు. జేరుకున్నాక మాట్లాడకుండా ఉండలేకపోయాడు. టాన్‌జన్‌తో అన్నాడు: ''భిక్షు కులం. ఆడవాళ్ళ దగ్గరకు కూడా మనం పోము. ముఖ్యంగా అందంగా యౌవనంలో ఉన్న ఆడవాళ్ళ దగ్గరకు. అది చాలా ప్రమాదం. నువ్వెందుకా పని చేశావు?''

టాన్‌జన్ అన్నాడు: ''ఆ అమ్మాయిని నేను అక్కడే వదిలేశాను. నువ్వింకా ఆమెను మోస్తున్నావా?''

3. మోసుకు తిరుగు

జోషు అనే ఆయన తన అరవయ్యో ఏట 'జెన్'ను అభ్యసించటం మొదలెట్టి, ఎనభయ్యో ఏడు వచ్చేంత వరకు అభ్యసనం కొనసాగించాడు. ఆ యేడు అతనికి జెన్ ఒంటబట్టింది. ఎనభయ్యో ఏట నుండి నూట ఇరవయ్యో ఏడు వచ్చేదాకా అతడు జెన్ పాఠాలు శిష్యులకు నూరిపోస్తుండేవాడు.

ఓ రోజు ఓ శిష్యుడు అడిగాడు: ''నా మెదడులో ఏమీ లేకపోతే నేనేం చెయ్యాలి?''

జోషు సమాధానం చెప్పాడు: ''దాన్ని తీసి బైట పడెయ్యి.''

''ఏమీ లేకపోతే నా మెదడులో, నేను దాన్నెలా తీసి బైట పడెయ్యగలను?'' శిష్యుడు ప్రశ్నను కొనసాగించాడు.

జోషు అన్నాడు: ''అయితే దాన్ని మోసుకు తిరుగు.''

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.పాడ్యమి రా.12.19 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** పుష్యమి పూర్తి (24గంటలు), **వర్జ్యం:** ప.1.31 నుండి 3.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.12 నుండి 9.05 వరకు తదుపరి రా.10.58 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** రా.12.01 నుండి 1.47 వరకు: **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.37, **సూర్యాస్తమయం:** 6.34.

‘కరువు’కు ప్రత్యామ్నాయం!

- ప్రత్యేక పంటల ప్రణాళిక రూపొందించిన వ్యవసాయ వర్సిటీ
- జిల్లాల వారీగా వివిధ రకాల పంటల సాగు
- తక్కువ కాల పరిమితి ఉండే రకాలపై దృష్టి
- ఈసారి వానాకాలం సీజన్ కష్టాల్లో ఉందంటున్న శాస్త్రవేత్తలు
- ఇప్పటికే అదను గడువు ముగిసిన పత్తి..
- వర్షాభావం కొనసాగితే ప్రత్యామ్నాయ ప్రణాళికే దిక్కు అని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత సీజన్ కష్టాల్లో పడినట్టేనని.. ఈ పరిస్థితి కొనసాగితే ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు కంటింజెన్సీ ప్రణాళికపై ఒక నివేదికను అందజేసింది. కరువు పరిస్థితులు నెలకొంటే.. ఏయే జిల్లాల్లో, ఏయే పంటల సాగు చేపట్టాలి, ఏమేం జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్న వివరాలను అందులో పేర్కొంది.

పంటలు వేసే సమయం దాటి..

సాధారణంగా రాష్ట్రంలో జూలై 15వ తేదీ వరకు పత్తి, మొక్కజొన్న, నువ్వులు, కంది, జొన్న, సోయాబీన్ వంటి పంటలు సాగు చేస్తారు. కొన్నిచోట్ల అంతర పంటలుగానూ వేస్తారు. ఈ గడువులో ఆయా పంటల సాగు మొదలుకాకుంటే ఇబ్బందేనని వ్యవసాయ వర్సిటీ నివేదికలో పేర్కొంది. జూలై 15 నుంచి పత్తి వేయడానికి వీలుండదని.. ఈ సమయంలో పొద్దుతిరుగుడు, కంది, ఆముదం, తక్కువ కాలపరిమితి గల కూరగాయలు, పశుగ్రాస జొన్న, మొక్కజొన్న+కంది, జొన్న+కంది కలిపి వేయాలని సూచించింది. అదే ఆగస్టు ఒకటో తేదీ నుంచి అయితే.. పొద్దుతిరుగుడు, ఆముదం, తక్కువ కాలపరిమితి కలిగిన కంది, పశుగ్రాస జొన్న, బొబ్బర్లు వంటివి మాత్రమే వేసుకోవాలని స్పష్టం చేసింది. ఒక్కో జిల్లాలో ఒక్కో రకమైన పంటలు వేసుకోవాలని సూచించింది.

పత్తి సాగుకు అదను ముగిసి..

రాష్ట్రంలో ఈ ఏడాది 60- 65 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. కానీ వర్షాభావం నేపథ్యంలో ఇప్పటివరకు 36.73 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఇందులోనూ సుమారు 10 లక్షల ఎకరాల్లో పత్తి మొలకెత్తక రెండోసారి వేసినట్టు అంచనా. అయితే ప్రస్తుతం పత్తి వేసుకోవడానికి అదను తీరిపోయిందని.. ఒకవేళ వేసినా దిగుబడి తగ్గుతుందని, చీడపీడల సమస్య ఎక్కువగా ఉంటుందని వ్యవసాయశాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

కరువు పరిస్థితి ఏర్పడితే.. ఆగస్టు 15 వరకు వేయాల్సిన పంటలివే..

- మెదక్ జిల్లాలో కంది, ఆముదం, కొర్ర, సజ్జలు, పశుగ్రాస జొన్న, ఉలవలు, పొద్దుతిరుగుడు, తక్కువ కాలపరిమితి గల కూరగాయలు.
- సంగారెడ్డి జిల్లాలో కంది, ఆముదం, బొబ్బర్లు, మినుములు, పొద్దుతిరుగుడు, కొర్రలు, తక్కువ కాలపరిమితిగల కంది, ఉలవలు.
- సిద్దిపేట జిల్లాలో పొద్దు తిరుగుడు, కంది, ఆముదం, నువ్వులు, రాగి, పశుగ్రాస జొన్న, ఉలవలు.
- మహబూబాబాద్ జిల్లాలో కంది, పొద్దు తిరుగుడు, ఆముదం, తక్కువ కాలపరిమితి కలిగిన కూరగాయలు, సజ్జలు, పశుగ్రాస జొన్న, బొబ్బర్లు, రాగులు.
- జనగామ జిల్లాలో కంది, పొద్దుతిరుగుడు, ఆముదం, సజ్జలు, రాగి, పశుగ్రాస జొన్న, తక్కువ కాలపరిమితి కలిగిన కూరగాయలు.
- ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న, తక్కువ కాలపరిమితి కలిగిన కంది, మొక్కజొన్న+కంది, పశుగ్రాస జొన్న, జొన్న.
- భూపాలపల్లి జిల్లాలో కంది, వేరుశనగ, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, ఆముదం, సజ్జలు, రాగి, పశుగ్రాస జొన్న, తక్కువ కాలపరిమితి కలిగిన కూరగాయలు.
- ములుగు జిల్లాలో తక్కువ కాలపరిమితి కలిగిన కంది, వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయలు, బొబ్బర్లు, పొద్దుతిరుగుడు, తక్కువ కాలపరిమితి కలిగిన కూరగాయలు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తక్కువ కాలపరిమితి కలిగిన కంది, నువ్వులు, పొద్దుతిరుగుడు, పశుగ్రాస జొన్న, మొక్కజొన్న, మొక్కజొన్న+కంది, జొన్న.
- నిజామాబాద్ జిల్లాలో కంది.. కామారెడ్డి జిల్లాలో కందితోపాటు స్వల్పకాలిక కూరగాయలు.
- కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కంది, తక్కువ కాలపరిమితి కలిగిన మొక్కజొన్న.
- రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో కంది, తక్కువ కాలపరిమితి కలిగిన మొక్కజొన్న, చెరుకు.
- వికారాబాద్ జిల్లాలో కంది, ఆముదం, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, తక్కువ కాలపరిమితి కలిగిన కూరగాయలు.
- మహబూబ్‌నగర్ జిల్లాలో కంది, ఆముదం, రాగులు.
- జోగులాంబ గద్వాల జిల్లాలో పత్తి, కంది, వేరుశనగ, పొద్దు తిరుగుడు, చెరుకు.
- నల్లగొండ జిల్లాలో కంది, ఆముదం.. సూర్యాపేట జిల్లాలో కంది.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో కంది, మొక్కజొన్న, ఆముదం, స్వల్పకాలిక కూరగాయలు.

రైతులను కోటీశ్వరులను ఎందుకు చేయలేదు?

- రాహుల్ గురించి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదం
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి
- వీహెచ్‌తో మర్యాదపూర్వక భేటీ



సాక్షి, హైదరాబాద్: ఎకరం క్యాప్సికం సాగు చేసి ఎకరానికి రూ.10 కోట్లు సంపాదించానని చెప్పిన సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని రైతులందరినీ కోటీశ్వరులను ఎందుకు చేయలేకపోయారని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. వ్యవసాయం మీద అంత పట్టు ఉంటే రాష్ట్ర రైతాంగాన్ని ఎందుకు బాగు చేయలేకపోయారో కేసీఆర్ చెప్పాలన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి ఆయన సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావును హైదరాబాద్‌లో కలిశారు. అంబర్‌పేటలోని వీహెచ్ నివాసంలో మర్యాద పూర్వక భేటీ అనంతరం విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్ పార్టీదేనన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోను ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పెట్టి పబ్బం గడుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాహుల్‌గాంధీకి ఎడ్లు, వడ్లు తెలియదని మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ ఏనాడైనా వ్యవసాయం చేశారా అని ప్రశ్నించారు. సోనియా, రాహుల్‌గాంధీలు పెట్టిన భిక్షతో పదవులు అనుభవిస్తూ వారిని కించపరిచేలా మాట్లాడడం తగదన్నారు. తనపై నమ్మకంతో టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పదవిని ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానానికి పొంగులేటి కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతిరెడ్డి ఆచూకీ లభ్యం

కుటుంబ సభ్యులతో ఫోన్ మాట్లాడించిన పోలీసులు




తిరుపతిరెడ్డి

బచ్చన్నపేట/అల్వాల్: ఆరు రోజుల కిందట అదృశ్యమైన బీజేపీ నాయకుడు, రియల్టర్ ముక్కెర తిరుపతిరెడ్డి ఆచూకీ లభించినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని ఓటీఎస్ పోలీసులు సోమవారం తిరుపతిరెడ్డిని భార్య సుజాతతో ఫోన్‌లో మాట్లాడించినట్లు తెలిసింది. ఈ నెల 13న అల్వాల్ మండల కార్యాలయానికి కారులో వచ్చిన తిరుపతిరెడ్డి హఠాత్తుగా అదృశ్యమైన విషయం తెలిసిందే. అయితే తిరుపతిరెడ్డిని ఎవరో కిడ్నాప్ చేశారంటూ కుటుంబ సభ్యులు అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అల్వాల్‌లోని తమ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, ఈ క్రమంలోనే తిరుపతిరెడ్డికి బెదిరింపు ఫోన్‌లు వచ్చాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని, సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. తిరుపతిరెడ్డి కిడ్నాప్ కాలేదని తానే అజ్ఞాతంలోకి వెళ్లి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, తిరుపతిరెడ్డి పోలీసుల అదుపులోనే ఉండి ఉంటాడని, తమకు సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. ఇంతలో తిరుపతిరెడ్డిని భార్యతో ఫోన్‌లో మాట్లాడించడంతో కుటుంబసభ్యులు కుదుటపడ్డారు.

కాలం కలిసి రాకున్నా కాళేశ్వరం ఉంది

- మిడ్, లోయర్ మానేరు ఆయకట్టుకు నీరు అందిస్తాం
- మంత్రి గంగుల కమలాకర్



మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి తరలివెళ్తున్న నీరు (ఇన్‌సెట్‌లో) స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి గంగుల. చిత్రంలో వినోద్‌కుమార్, రసమయి

బోయినపల్లి(చొప్పదండి): ‘కాలం పోయింది.. రైతులు లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేయకుండా వానల కోసం మొగులు వైపు ఎదురుచూస్తున్నారు. కాలం కలిసి రాకున్నా.. సీఎం కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఉంది. కాళేశ్వరం జలాలతో ఎల్‌ఎండీ, మిడ్‌మానేరు ప్రాజెక్టుల పరిసరాల్లో రైతుల భూములకు సాగు నీరు అందిస్తాం’ అని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి రాజన్న సిరిసిల్ల బోయినపల్లి మండలం మాన్వాడ మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి నీటిని సోమవారం సాయంత్రం విడుదల చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లతో గోదావరి జలాలను ఎత్తిపోసి వరద కాల్వ ద్వారా మిడ్‌మానేరుకు తరలిస్తామన్నారు. 50 టీఎంసీల మేర నీరు ఎత్తిపోయాలని అంచనాలు వేసినట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి ఎల్‌ఎండీ ఆయకట్టు, సూర్యాపేట వరకు నీరు అందిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకుంటే వానాకాలంలో సైతం మిడ్‌మానేరు, ఎల్‌ఎండీ నెర్రెలు బారి.. పంటలు వేయక రైతులు ఇబ్బందులు పడేవారని చెప్పారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ, మేడిగడ్డ నుంచి ఎత్తిపోతలకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టకుంటే ఇప్పుడు తెలంగాణ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించలేమన్నారు. నీళ్లిచ్చి, ఉచిత విద్యుత్ ఇచ్చే ప్రభుత్వం కావాలా? మోసపూరిత మాటల పార్టీలు కావాలా? ప్రజలు ఆలోచించాలని సూచించారు.

పల్లెవెలుగు బస్సుల్లో టౌన్ బస్‌పాస్‌లు: సజ్జనార్



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో కొత్తగా టౌన్ బస్ పాస్‌లు అందుబాటులోకి రాబోతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ సిటీ, వరంగల్ నగరంలో జనరల్ బస్‌పాస్‌లు అందుబాటులో ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు జిల్లా వాసులకు కూడా అర్బన్ ప్రాంతాల్లో బస్‌పాస్ వసతి కల్పించే ఉద్దేశంతో పల్లె వెలుగు బస్సుల్లో టౌన్ బస్‌పాస్‌లు ఇవ్వాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఆ బస్సుల్లో నిర్ధారిత పట్టణ పరిధిలో ఈ పాస్ చెల్లుబాటవుతుంది.

10 కి.మీ.లకు రూ.800

మొదట కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా కేంద్రాల్లో అమలు చేసి ఆ తర్వాత మిగతా ప్రాంతాలకు విస్తరించనున్నారు. కరీంనగర్, మహబూబ్‌నగర్‌లలో 10 కి.మీ., నిజామాబాద్, నల్గొండల్లో 5 కి.మీ. పరిధిలో ఈ పాస్‌ను వినియోగించుకోవచ్చు. 10 కి.మీ. పరిధికి నెలకు రూ.800, 5 కి.మీ.పరిధికి రూ.500 చొప్పున పాస్ ధరలుగా నిర్ణయించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం బస్‌భవన్‌లో ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, వినోద్, విజిలెన్స్ జేడీ సంగ్రామ్ సింగ్, సీటీఓ రవీందర్‌లతో కలిసి ఎండీ సజ్జనార్ ఆవిష్కరించారు. త్వరలో మిగతా ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పారు.

ఎస్‌ఆర్ గార్డెన్స్‌కు మార్కింగ్

- ఆ పరిధిలో ఎన్‌ఎస్‌పీ భూమి ఉందన్న అధికారులు
- ఇదంతా కక్ష సాధింపేనని పొంగులేటి వర్గీయుల ఆగ్రహం



ఎస్ఆర్ గార్డెన్స్ వద్ద సర్వే చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మం అర్బన్: ఖమ్మం శివారు వెలుగుమట్లలో మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఎన్‌ఎస్‌పీ(నాగార్జునసాగర్ ప్రాజెక్టు)కు చెందిన భూమి ఉందని అధికారులు నిర్ధారించారు. ఈమేరకు సోమవారం సర్వే చేసి 21.5 గుంటల భూమికి మార్కింగ్ ఇచ్చారు. ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఎన్‌ఎస్‌పీ కాల్వ కోసం సేకరించిన భూమి ఉందంటూ ఈనెల 14న వాట్సాప్ నోటీసు జారీ చేసి జాయింట్ సర్వేకు 15న ఉదయం రావాలని కోరారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి తాను జ్వరంతో బాధపడుతున్నందున రాలేనని సమాధానం ఇచ్చారు. దీంతో సోమవారం ఉదయమే ఖమ్మం అర్బన్ తహసీల్దార్ ఎం.శైలజ, జలవనరులశాఖ అధికారుల ఆధ్వర్యంలో పోలీసుల సమక్షంలో సర్వే పూర్తి చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేత తుంబూరి దయాకర్‌రెడ్డితో పాటు పొంగులేటి అనుచరులు భారీగా చేరుకుని తమ తరఫున ఎవరూ రాకుండా సర్వే చేయడమేమిటని ప్రశ్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఇదంతా కక్షసాధింపేనని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, తహసీల్దార్ శైలజ మాట్లాడుతూ ఎన్‌టీసీ కోసం ప్రసాద్‌రెడ్డి గతేడాది చేసుకున్న దరఖాస్తు ప్రకారమే హైకోర్టు ఆదేశాల మేరకు సర్వే చేశామన్నారు.

ఆత్మహత్య చేసుకుంటానని మాజీ సర్పంచ్ సెల్ఫీ వీడియో

- సూసైడ్ నోట్ రాసి అదృశ్యం
- బిల్లులు ఇవ్వడం లేదని మనస్తాపం
- తన చావుకు నలుగురు వ్యక్తులు, ముగ్గురు అధికారులు కారణమంటూ నోట్



ఆత్మహత్య చేసుకుంటానని మాజీ సర్పంచ్ సెల్ఫీ వీడియో పెట్టడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కుటుంబ సభ్యులు

కామారెడ్డి క్రైం: తనకు రావాల్సిన కాంట్రాక్ట్ పనుల బిల్లులకు నలుగురు వ్యక్తులు, ముగ్గురు అధికారులు అడ్డుపడుతున్నారని వారి కారణంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ మాజీ సర్పంచ్ సెల్ఫీ వీడియో తీసి సూసైడ్ నోట్ రాసి అదృశ్యమయ్యారు. కామారెడ్డి జిల్లాల్లో కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించి సూసైడ్ నోటు, సెల్ఫీ వీడియోలు సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఉదంతం పూర్వాపరాలిలా..జిల్లాలోని పాల్వంచ మండలం సింగరాయిపల్లి గ్రామానికి చెందిన అధికం సత్యాగౌడ్ గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ కామారెడ్డిలోని రాజీవ్‌నగర్‌లో నివాసముంటున్నారు. కాగా, ఇటీవల సింగరాయిపల్లి సర్పంచ్ మహేశ్వరి భర్త అధికం నర్సాగౌడ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు కారణమయ్యారంటూ కొందరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిలో ఒకడైన సత్యాగౌడ్ ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు.

నిధులు వచ్చినప్పటికీ ఇవ్వడం లేదంటూ

ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.సెల్ఫీ వీడియోలో సత్యాగౌడ్ మాట్లాడుతూ...15 నెలలుగా గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్లకు సంబంధించి రూ.7.50 లక్షలు బిల్లులు రావాల్సి ఉందన్నారు. మే నెలలో ఎమ్మెల్యే ఫండ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు విడుదలైనప్పటికీ తనకు బిల్లులు ఇవ్వకుండా తోట భూమయ్య, అధికం రాజేందర్‌గౌడ్, గొల్ల అంజయ్య, ఇసాయిపేట సర్పంచ్ బాలాగౌడ్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. జీపీ సెక్రటరీ బాల్‌రాజు, ఎంపీవో సరిత, డీఎల్‌పీవో సాయిబాబా బిల్లులు ఇవ్వకుండా వేధిస్తున్నారని నిందించారు. వారి కారణంగానే చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురై తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని వీడియోలో మాట్లాడారు. సెల్‌ఫోన్, బైక్‌లను ఇంట్లోనే పెట్టి బయటకు వెళ్లిపోయాడు. దీంతో సత్యాగౌడ్ ఆచూకీ కనిపెట్టాలని కోరుతూ అతని భార్య, పిల్లలు పట్టణ పోలీసులను ఆశ్రయించారు.

జనగణనలో బీసీ కులగణన చేపట్టాలి

కేంద్రమంత్రి రామ్‌దాస్‌తో ఆర్.కృష్ణయ్య, బీసీ నేతల భేటీ



కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలేకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, బీసీ నేతలు

కాచిగూడ: జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని, వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల డిమాండ్లపై ప్రధానమంత్రితో చర్చించాలని కోరుతూ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, నందగోపాల్, సుధాకర్, వేముల రామకృష్ణ, రాజ్‌కుమార్ సోమవారం నగరంలో కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలేను కలసి చర్చలు జరిపారు. బీసీల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.

బీసీల డిమాండ్లు న్యాయమైనవేనన్న కేంద్ర మంత్రి

కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలే మాట్లాడుతూ.. బీసీలకు అన్ని రంగాలలో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. స్వయానా ప్రధానమంత్రే బీసీ అని, కేంద్ర మంత్రివర్గంలో 27 మంది మంత్రులు బీసీ వర్గానికి చెందిన వారున్నారని గుర్తు చేశారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవేనని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసేందుకు, బీసీల బడ్జెట్ పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

28 నుంచి అమరుల సంస్మరణ వారోత్సవాలు

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్

చర్ల: ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక లేఖ విడుదల చేశారు. ప్రజల కోసం మరణించడం హిమాలయ పర్వతాల కన్నా గొప్పది కాగా.. దోపిడీదారుల కోసం మరణించడం కోడి ఈక కన్నా హీనమైనదని ఆయన పేర్కొన్నారు. కుటుంబాన్ని, బంధుమిత్రులను వదిలేసి జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. 2022 జూలై 28 నుంచి 2023 జూలై 28 వరకు వంద మందికి పైగా విప్లవకారులు అమరత్వం పొందారని, అంతకు ముందు కూడా ప్రజల కోసం పోరాడి అమరులైన వారికి నివాళులర్పించాలని ఆజాద్ ప్రజలను కోరారు.

నాగర్‌కర్నూలు వాసికి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు

రెడ్‌క్రాస్ ద్వారా సేవలు అందిస్తున్నందుకు పురస్కారం



అంబటి నటరాజ్‌కు పతకాన్ని ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని నాగర్‌కర్నూలుకు చెందిన లయన్ డాక్టర్ అంబటి నటరాజ్, రాష్ట్రపతి చేతులమీదుగా బంగారు పతకం అందుకున్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన రెడ్‌క్రాస్ సొసైటీ ఏజీఎం సెరిమోనియల్ సెషన్‌కు హాజరైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. సమాజానికి విశిష్ట సేవలందించిన పలువురుకి అవార్డులు అందజేశారు. రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను కొనియాడారు. నటరాజ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డాక్టర్ గోపరాజు సమరం కూడా బంగారు పతకం అందుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నాగర్‌కర్నూలుకు చెందిన నటరాజ్ 1990 నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. 2002 నుంచి పలు రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆయన ఇప్పటివరకు 1.91 లక్షల బ్లడ్ యూనిట్లు సేకరించారు. స్వయంగా 154 సార్లు రక్తదానం చేశారు. పలుమార్లు అవసరమైన వ్యక్తులకు ప్లాస్మా, ప్లేట్‌లెట్లు ఇచ్చారు. నేత్రదానంపై విస్తృత ప్రచారం చేయడంతోపాటు సుమారు 280 మందికి కంటిచూపు వచ్చేలా కృషి చేశారు. మూడేళ్లుగా నీట్‌లో ర్యాంకులు వచ్చిన పేద విద్యార్థులకు పూర్తి ఆర్థికసాయం అందజేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా పేద విద్యార్థులతోపాటు దివ్యాంగులకు అవసరమైన సాయం అందజేస్తున్నారు. అవార్డుల కార్యక్రమంలో కేంద్ర వైద్య శాఖ మంత్రి మాన్సుఖ్ మాండవీయ, తెలంగాణ, హరియాణా గవర్నర్లు తమిళిసై, బండారు దత్తాత్రేయ, రెడ్‌క్రాస్ తెలంగాణ చైర్మన్ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

28న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని సాంకేతిక విద్యా విభాగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆఖరి దశలో మిగిలిపోయిన సీట్లను ఆయా కాలేజీలు స్పాట్‌లో హాజరైన విద్యార్థులకు ర్యాంకు ప్రకారం కేటాయిస్తాయని పేర్కొంది.

తక్షణమే పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి: జాక్టో

సాక్షి, హైదరాబాద్: వేతన సవరణ సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) డిమాండ్ చేసింది. జాక్టో సమావేశం సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు.

ఆ 290 మిల్లుల బియ్యం వద్దు!

- రూ.150 కోట్ల విలువైన బలవర్థక బియ్యాన్ని తిరస్కరించిన ఎఫ్‌సీఐ
- బియ్యం నాణ్యత పట్ల అసంతృప్తి.. బీఆర్ఎల్ దాటి ఉన్నట్లు నిర్ధారణ
- ఎఫ్ఆర్‌కే నాణ్యతలో తేడానే కారణమా?
- కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారానే ఎఫ్ఆర్‌కే సరఫరా
- ఎఫ్‌సీఐ నిర్ణయంతో ఆందోళనలో మిల్లర్లు



సాక్షి, హైదరాబాద్: మిల్లర్లు సరఫరా చేసిన బలవర్థక బియ్యం(ఫోర్టిఫైడ్ రైస్) నాణ్యత పట్ల ఎఫ్‌సీఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో భాగంగా 2021–22కు సంబంధించి ఎఫ్‌సీఐకి ఇచ్చిన సుమారు 40వేల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రైస్ కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా లేవని నిర్ధారించింది. రాష్ట్రంలో చాలా జిల్లాల నుంచి వచ్చిన సీఎంఆర్ ‘తిరస్కరణ పరిమితి స్థాయి’ (బియాండ్ రిజక్షన్ లెవల్ – బీఆర్ఎల్) దాటి ఉన్నట్లు ఎఫ్‌సీఐ స్పష్టం చేస్తూ ఆ బియ్యాన్ని వెనక్కు తీసుకొని, తిరిగి నాణ్యమైన బియ్యాన్ని ఇవ్వాలని మిల్లర్లకు స్పష్టం చేసింది. ఎఫ్‌సీఐ వెనక్కు పంపిన బియ్యం విలువ రూ.150 కోట్లపైనే ఉంటుంది.

మిల్లుల్లోనే ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ మిక్సింగ్

కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించే బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కే) కలిపి ఈఏడాది ఏప్రిల్ నుంచి సరఫరా చేస్తోంది. దీని ప్రకారం 100 కిలోల బియ్యానికి కిలో ఎఫ్ఆర్‌కే మిక్సింగ్ చేస్తారు. 10 గ్రాముల ఎఫ్ఆర్‌కే కోసం 28 మిల్లీ గ్రాముల నుంచి 48 మిల్లీ గ్రాముల ఐరన్, 75 మైక్రో గ్రాముల నుంచి 125 మైక్రో గ్రాముల ఫోలిక్ యాసిడ్(బీ–9 విటమిన్), 0.75 మైక్రో గ్రాముల నుంచి 1.25 మైక్రో గ్రాముల బీ–12 విటమిన్ (కొబలమైన్)ను కలుపుతారు. ఇవి సాధారణ బియ్యంలో కలిసిపోతాయి. ఈ ఎఫ్ఆర్‌కే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు నేషనల్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ (నాఫెడ్), నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్(ఎన్‌సీసీఎఫ్) ద్వారా పౌరసరఫరాల సంస్థకు చేరి అక్కడి నుంచి మిల్లులకు వెళతాయి.

ఆ బియ్యం తిరస్కరణ ఎందుకంటే


ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ తనిఖీల్లో రాష్ట్రంలోని మిల్లుల నుంచి వచ్చిన బియ్యంలో 290 మిల్లులకు చెందిన 202 స్టాక్స్‌లో ఎఫ్ఆర్‌కే స్థాయి బీఆర్ఎల్ స్థాయిని దాటినట్లు నిర్ధారించారు. మొత్తంగా ఆ మిల్లుల నుంచి 40వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తీసుకొనేందుకు తిరస్కరించింది. రూ.150 కోట్ల విలువైన ఈ బియ్యాన్ని మిల్లర్లు వెనక్కు తీసుకొని, నాణ్యతతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్ ఇవ్వాలని నిర్దేశించింది. 15 రోజుల క్రితమే ఈ మేరకు ఎఫ్‌సీఐ నుంచి తాఖీదులు వెళ్లినా, మిల్లర్లు ప్రభుత్వం ద్వారా చేసిన రాజీయత్నాలు ఫలించలేదని సమాచారం.

ఇప్పుడు వెనక్కి ఇస్తే మేమేం చేసుకోవాలంటున్న మిల్లర్లు

మూడు నెలల క్రితం ఎఫ్‌సీఐకి అప్పగించిన ఈ బియ్యాన్ని వెనక్కు పంపిస్తే , వాటిని తామేం చేసుకోవాలని కొందరు మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాన్ని ఎదుర్కొనేందుకు మిల్లర్లంతా ఏకమై , తమకు సీఎంఆర్ అప్పగించవద్దని ప్రభుత్వాన్ని కోరడం ద్వారా ఒత్తిడి పెంచాలని భావిస్తున్నట్లు తెలిసింది. కేంద్రం పంపించిన ఎఫ్ఆర్‌కేనే తాము మిక్సింగ్ చేసినప్పుడు బీఆర్ఎల్ స్థాయి కన్నా ఎక్కువ ఎందుకుంటుందని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. కాగా మిల్లర్లు ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యం నాణ్యతనే బీఆర్ఎల్ స్థాయి దాటి ఉంటుందని, అందుకే తిరస్కరణకు గురైందని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

మరోసారి చంద్రయాన్-3 కక్ష్య దూరం పెంపు



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈనెల 13న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు సోమవారం వేకువజామున రెండోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు. ఎల్‌వీఎం3-ఎం4 ఉపగ్రహ వాహక నౌక ద్వారా చంద్రయాన్-3 మిషన్‌ను భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, భూమికి దూరంగా 36,500 కిలోమీటర్లు ఎత్తులో భూమధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మొదటి విడతలో భూమికి దగ్గరగా 173 కిలోమీటర్లు ఎత్తుకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్లు ఎత్తుకు పెంచిన విషయం తెలిసిందే. ప్రపొల్షన్ మాడ్యూల్‌లో ఉన్న అపాజి ఇంధనాన్ని సోమవారం నిమిషం పాటు మండించి రెండోసారి కక్ష్య దూరాన్ని పెంచడంలో భాగంగా భూమికి దగ్గరగా 173 కిలోమీటర్ల ఎత్తును 223 కిలోమీటర్లకు, భూమికి దూరంగా 41,762 కిలోమీటర్ల ఎత్తును 42,000 కిలోమీటర్లకు విజయవంతంగా పెంచారు. మంగళవారం వేకువ జామున మూడోసారి కక్ష్య దూరాన్ని పెంచేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.కోటి సంపాదించిన యూట్యూబర్ ఇంట్లో ఐటీ సోదాలు

న్యూఢిల్లీ: వీడియోల ద్వారా కోటి రూపాయలు సంపాదించిన యూట్యూబర్‌పై ఆదాయపన్ను(ఐటీ) శాఖ అధికారులు దాడి చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీకి చెందిన తస్లీమ్ ఇంట్లో సోదాల్లో రూ.24 లక్షల నగదు లభించినట్లు అధికారులు తెలిపారు. గత కొన్నేళ్లుగా యూట్యూబ్ చానెల్‌ను నడుపుతున్న అతడు రూ.కోటి వరకు సంపాదించాడన్నారు. ఆ సొమ్మును అక్రమంగా ఆర్జించినట్లు ఆరోపించారు. బరేలీకి చెందిన తస్లీమ్ 'ట్రేడింగ్ హబ్ 3.0' పేరుతో షేర్‌మార్కెట్‌కు సంబంధించిన వీడియోలు చేస్తున్నాడు. ఆదాయ పన్ను కూడా చెల్లిస్తున్నామని తస్లీమ్ సోదరుడు ఫిరోజ్ చెప్పాడు. మొత్తం రూ.1.2 కోట్ల ఆదాయానికి గాను ఇప్పటికే రూ.4 లక్షలను ట్యాక్స్‌లుగా చెల్లించినట్లు తెలిపాడు. తాము ఎలాంటి తప్పూ చేయలేదన్నాడు. ఇదంతా కుట్ర ప్రకారమే జరిగిందని తస్లీమ్ తల్లి కూడా ఆరోపించారు.



ఏమో! కారు ఎగరావచ్చు..

నగరాల్లో విపరీతమైన వాహనాల రద్దీ, అధ్వాన్నమైన రహదారుల వల్ల సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ప్రయాణికులు విసుగెత్తిపోతుంటారు. ట్రాఫిక్ జంఝాటం లేకుండా హాయిగా ఆకాశంలో విహరిస్తూ వేగంగా దూసుకెళ్తే బాగుంటుందని అనుకోనివారు ఉండరు. అలాంటివారి కోసం అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన అలెఫ్ ఏరోనాటిక్స్ సంస్థ ఎగిరే కారును(ఫ్లైయింగ్ కారు) అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. 2015లో మొదలైన ఈ ఆలోచనకు పదునుపెట్టిన అలెఫ్ కంపెనీ 2019 నాటికి ఎగిరే కారును తయారు చేసింది. మోడల్-ఎ ఫ్లైయింగ్ కారును ఆవిష్కరించింది. కొన్ని రకాల పరీక్షల తర్వాత ఈ ఏడాది జూన్ 12న అమెరికా ఫెడరేషన్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) ఈ కారుకు స్పెషల్ ఎయిర్‌వర్తీనెస్ సర్టిఫికెట్ అందజేసింది. అంటే పరిమిత ప్రాంతాల్లో ఫ్లైయింగ్ కారును ప్రదర్శించడానికి, దీనిపై పరిశోధన-అభివృద్ధి వంటి కార్యకలాపాల కోసం అనుమతి మంజూరు చేసింది. ఇదొక టర్నింగ్ పాయింట్ అని చెప్పాలి. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ఎగిరే కారు ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి రావడానికి సాంకేతికపరమైన, చట్టపరమైన ఎన్నో అవరోధాలు, సవాళ్లు ఉన్నాయి. వాటిని అధిగమిస్తేనే కారులో ఆకాశంలో స్వేచ్ఛగా ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కానీ!

అడ్డంకులూ ఉన్నాయ్

- ఫ్లైయింగ్ కారు నడపడానికి రెండు రకాల డ్రైవింగ్ శిక్షణ అవసరం
- నగరాల్లో శబ్ద, వాయు కాలుష్యం మితిమీరే అవకాశం
- గగన తలంలోనూ ప్రమాదాలకు ఆస్కారం
- అవరోధాలు అధిగమిస్తే సులువుగా ఆకాశయానం

విడిభాగాల లభ్యత ఎలా?

ఎక్కువ సంఖ్యలో ఎగిరే కార్లను తయారు చేయడానికి కొన్ని విడిభాగాలు విస్తృతంగా అందుబాటులో లేవని అలెఫ్ ఏరోనాటిక్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జిమ్ డుఖోవ్నీ చెప్పారు. వాటిని సమకూర్చుకోవడం చాలా కష్టమని అన్నారు. ఉదాహరణకు ఫ్లైయింగ్ కారుకు ప్రయాణంలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించడానికి హైలీ స్పెషలైజ్డ్ ప్రొపెల్లర్ మోటార్ సిస్టమ్స్ అవసరమని, అలాంటివి తయారు చేసుకోవడం శ్రమ, ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని తెలిపారు. ఎగిరే కారు ఎంత త్వరగా క్షేత్రస్థాయిలోకి వస్తుందన్నది దాని పరిమాణం, బరువు, ధర, అది ఎంతవరకు సురక్షితం అనేదానిపైనా ఆధారపడి ఉంటుందన్నారు.

సేఫ్టీ ఫీచర్ల మాటేమిటి?

అలెఫ్ కంపెనీ మోడల్-ఎ కార్ల విక్రయాల కోసం ఇప్పటికే ప్రి-ఆర్డర్లను స్వీకరిస్తోంది. ఒక్కో కారు ధరను 3 లక్షల డాలర్లుగా (రూ.2.46 కోట్లు) నిర్ధారించింది. మోడల్-ఎ అనేది అల్ట్రాలైట్, లో స్పీడ్ వెహికల్. చట్టప్రకారం ఈ మోడల్ కారు గోల్ఫ్ కార్ట్‌లు, చిన్నపాటి విద్యుత్ వాహనాల విభాగంలోకి వస్తుంది. ఫ్లైయింగ్ కారు కేవలం గాల్లో ఎగరడమే కాదు, రోడ్లపై కూడా సాధారణ వాహనాల్లాగే ప్రయాణిస్తుంది. దానికి అనుమతి రావాలంటే 'నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్' మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. అంటే సాధారణ కార్లలో ఉండే సేఫ్టీ ఫీచర్లన్నీ ఉండాలి. అలెఫ్ సంస్థ అభివృద్ధి చేసిన మోడల్-ఎ కారు రోడ్లపై ప్రయాణానికి అంతగా సురక్షితం కాదన్న వాదన వినిపిస్తోంది.

నడపడానికి లైసెన్స్ ఎవరిస్తారు?

కార్లు నడపాలన్నా, విమానాలు నడపాలన్నా కచ్చితంగా లైసెన్స్ ఉండాల్సిందే. ఫ్లైయింగ్ కార్లు నడపడానికి కూడా లైసెన్స్ అవసరం. డ్రైవింగ్ శిక్షణ ఎవరిస్తారు? లైసెన్స్‌లు ఎవరు జారీ చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వాలదే తుది నిర్ణయం. నేలపై, గాలిలో నడపడానికి డ్రైవర్లు శిక్షణ తీసుకోవాలి. ఫ్లైయింగ్ కార్ల డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ చేయడానికి రవాణా, పౌర విమానయాన శాఖ సమన్వయంతో పని చేయాల్సి రావొచ్చు.

భారీ శబ్దాలు, కాలుష్యం

ఫ్లైయింగ్ కార్లు పరిమితమైన ఎత్తులోనే ఎగురుతాయి. భారీ శబ్దాలు, కాలుష్యం ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త సమస్యలు తప్పవు. ప్రజల్లో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు. ఏమాత్రం శబ్దం వెలువడని ఫ్లైయింగ్ కార్లు డిజైన్ చేయడం చాలా సంక్లిష్టమైన ప్రక్రియ అం టున్నారు. రోడ్లపై వాహనాలు ఢీకొంటున్నట్లుగానే గగనతలంలో వేగంగా దూసుకెళ్లే ఫ్లైయింగ్ కార్లు పరస్పరం ఢీకొనే అవకాశాన్ని కొట్టిపారేయలేం. ఎగిరే కార్లు భవనాలను ఢీకొని నేలకూలడానికి ఆస్కారం ఉంది. అదే జరిగితే నష్టం భారీగానే ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది. ఆకాశంలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ తరహాలో ఎగిరే కార్ల రాకపోకల కోసం శాస్త్రీయమైన మార్గసూచిని రూపొందించాలి.

ధనవంతులకే సాధ్యమా?

ఇప్పుడున్న పరిస్థితిని బట్టి చూస్తే ఎగిరే కార్ల ధరలను సంపన్నులే భరించగలరు. కోట్లాది రూపాయలు వెచ్చించి ఇలాంటివి కొనేసే స్తోమత కొందరికే ఉంటుంది. నిర్వహణ ఖర్చులు, లైసెన్స్ ఫీజులు కూడా తక్కువేమీ కాదు. విమాన ప్రయాణం ప్రారంభమైన తొలి రోజుల్లో ధనవంతులకే పరిమితం అన్నట్లుగా ఉండేది. కానీ, ఇప్పుడు దిగువ మధ్యతరగతి ప్రజలు కూడా విమానాల్లో ప్రయాణిస్తున్నారు. ఫ్లైయింగ్ కార్ల విషయంలోనూ అలాంటి పరిణామం సాధ్యపడొచ్చు. ప్రభుత్వాలే ప్రజా రవాణా వ్యవస్థలో భాగంగా ఈ కార్లను ప్రవేశపెడితే సామాన్య ప్రజలు సైతం ఆకాశయానం చేయొచ్చు.

క్రిమియా వంతెనపై మళ్లీ పేలుడు



మాస్కో: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా సైనిక సరఫరాలకు కీలకంగా మారిన క్రిమియా వంతెనపై మరోసారి పేలుడు సంభవించింది. సోమవారం జరిగిన డ్రోన్ల దాడితో వంతెనలో కొంతభాగం దెబ్బతింది. ఘటనలో దంపతులు మృతి చెందగా చిన్నారి గాయపడింది. దాడి కారణంగా వంతెనపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రైళ్ల రాకపోకలను మాత్రం ఆరుగంటలపాటు ఆపేశారు. దాడి వెనుక ఉక్రెయిన్ హస్తం ఉందని రష్యా ఆరోపించింది. ఉక్రెయిన్ ప్రయోగించిన రెండు సీ డ్రోన్ల వల్లే పేలుళ్లు జరిగాయని రష్యా దర్యాప్తు విభాగం తెలిపింది. ఉక్రెయిన్‌కు చెందిన క్రిమియా ద్వీపకల్పాన్ని 2014లో ఆక్రమించిన రష్యా తన ప్రధాన భూభాగాన్ని కలుపుతూ యూరప్‌లోనే అత్యంత పొడవైన 19 కిలోమీటర్ల భారీ వంతెనను నిర్మించింది. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా సైనిక సరఫరాలకు ఇది అత్యంత కీలకంగా మారింది. యుద్ధం మొదలయ్యాక ఈ వంతెనపై మొదటిసారిగా గత ఏడాది అక్టోబర్‌లో ట్రక్కు బాంబు పేలుడు సంభవించింది. దీంతో, బ్రిడ్జిపై రాకపోకలకు కొన్ని నెలలపాటు అంతరాయం ఏర్పడింది. తాజాగా జరిగిన పేలుడుతో వంతెనలోని కొంత భాగం వంగి, కిందికి వేలాడుతూ కనిపిస్తున్న దృశ్యాలను స్థానిక వార్తా చానెళ్లు ప్రసారం చేశాయి. దీనిపై ఉక్రెయిన్ ప్రతినిధి అర్టెమ్ డెగ్టియారెంకో మాత్రం.. యుద్ధంలో తాము విజయం సాధించిన తర్వాత పేలుడుకు సంబంధించి వివరాలు వెల్లడిస్తామనడం గమనార్హం.

ఉక్రెయిన్ నుంచి ధాన్యం ఎగుమతులు బంద్!

ఉక్రెయిన్ నుంచి ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, ఆసియాలోని పేద దేశాలకు ఆహార ధాన్యాలను రవాణా చేసేందుకు ఉద్దేశించిన ఒప్పందాన్ని రష్యా నిలిపేసింది. తమ దేశం నుంచి ఆహారం, ఎరువుల ఎగుమతులకు వీలు కల్పించే వరకు నల్ల సముద్రం మీదుగా జరిగే ధాన్యం రవాణాను అడ్డుకుంటామని సోమవారం స్పష్టం చేసింది. నల్లసముద్రం మీదుగా ఉక్రెయిన్ గోధుమలు, ఆహారధాన్యాలతో వెళ్లే ఓడలపై దాడి చేయకూడదనే షరతుతో తుర్కియే మధ్యవర్తిత్వంతో రష్యా, ఉక్రెయిన్ మధ్య ఏడాది క్రితం ఒప్పందం కుదిరింది. 120 రోజులకోసారి దీన్ని పొడిగిస్తూ వస్తున్నారు. మేలో దీనిని 60 రోజులకు మాత్రమే పొడిగించేందుకు రష్యా అంగీకరించింది. తాజాగా ఆ గడువు ముగియడంతో ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పేద దేశాల్లో ఆహార ధరలకు రెక్కలు రావడంతోపాటు, పేదరికం మరింతగా పెరిగే ప్రమాదముందన్న ఆందోళనలున్నాయి.

అమెరికాలో భీకర వర్షాలు.. పిడుగులు

వాషింగ్టన్: అమెరికాలో పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పిడుగులు పడుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కనెక్టికట్, మసాచుసెట్స్, న్యూహ్యాంప్‌షైర్, న్యూయార్క్, రోడ్‌ఐలాండ్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం వాతావరణ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భీకర వర్షాలకుతోడు పిడుగుల ముప్పు కారణంగా అమెరికాలో తాజాగా 2,600కుపైగా విమానాల రాకపోకలను రద్దుచేశారు. మరో 8,000 విమానాలు షెడ్యూల్ కంటే ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. ప్రధానంగా ఈశాన్య అమెరికాలో వాతావరణం ప్రతికూలంగా మారింది. న్యూయార్క్, న్యూజెర్సీ, కనెక్టికట్, పెన్సిల్వేనియా, మసాచుసెట్స్, వెర్మాంట్‌లో వరద హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా, పశ్చిమ, దక్షిణ అమెరికా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ వేడిని తట్టుకోలేక జనం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కాలిఫోర్నియా రాష్ట్రంలోని డెత్ వ్యాలీలో ఏకంగా 52 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయ్యింది.

శరద్ పవార్‌తో మరోసారి అజిత్ సమావేశం

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్‌తో ఆయన సోదరుడి కుమారుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ వరుసగా రెండోరోజు సోమవారం కూడా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అజిత్ వెంట ఆయన వర్గం నేతలు కూడా ఉన్నారు. ఎన్సీపీ ఐక్యంగా ఉండాలని, ఇందుకోసం అందరం ఒక్కటిగా కలిసి ఉందామని శరద్ పవార్ వద్ద వారు ప్రతిపాదించినట్లు సమాచారం. దీనిపై ఆయన ప్రతిస్పందించలేదని తెలిసింది. మహారాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష స్థానాల్లోనే కూర్చోవాలని శరద్ పవార్ వర్గం ఎన్సీపీ ఎమ్మెల్యే నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వారుతీర్మానాన్ని స్పీకర్ ముందుంచారు. మరోవైపు మంగళవారం ఢిల్లీలో జరిగే ఎన్డీయే మిత్రపక్షాల సమావేశానికి ఎన్సీపీ చీలిక వర్గం నేతలు అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ హాజరు కానున్నారు.

పేరులో ఇండియా.. సారథిగా సోనియా!

విపక్షాల ఐక్యతా రాగం

'కలుద్దాం, నిలుద్దాం' నినాదం

- బెంగళూరులో మొదలైన కీలక మేధోమథనం
- కాంగ్రెస్‌తో పాటు పాల్గొంటున్న 26 విపక్షాలు
- బీజేపీకి ముకుతాడే లక్ష్యంగా రెండు రోజులు చర్చలు
- పాల్గొంటున్న సోనియా, రాహుల్, ఖర్గేతో పాటు మమత, నితీశ్, స్టాలిన్ తదితర విపక్ష సీఎంలు, కీలక నేతలు
- సాయంత్రం నుంచి రాత్రి విందు భేటీ దాకా మంతనాలు
- ఉమ్మడి కార్యాచరణ తదితరాలపై నేడు రోజంతా కీలక చర్చలు
- 2024 ఎన్నికలే లక్ష్యంగా రోడ్‌మ్యాప్ రూపకల్పన



బెంగళూరులో విపక్షాల భేటీ జరుగుతున్న హోటల్ వద్ద ఏర్పాటుచేసిన భారీ పోస్టర్. (ఇన్‌సెట్‌లో) ప్రధాన వేదిక వద్ద ఏర్పాటుచేసిన పోస్టర్

బెంగళూరు: 2024 ఎన్నికల్లో కేంద్రంలో అధికార బీజేపీని ఓడించడమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో విపక్షాలు కొంతకాలంగా చేస్తున్న ముమ్మర ప్రయత్నాలు కీలక దశకు చేరుకున్నాయి. ఇందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు తలపెట్టిన రెండు రోజుల సమావేశాలు సోమవారం బెంగళూరులో మొదలయ్యాయి. కాంగ్రెస్ సహా 26 విపక్ష పార్టీల అధినేతలు, అగ్ర నేతలు సాయంత్రానికల్లా సమావేశ వేదిక వద్దకు చేరుకున్నారు. రాత్రి పొద్దుపోయేదాకా చర్చోపచర్చల్లో మునిగి తేలారు. బీజేపీని నిలువరించడమే ఏకైక అజెండాగా ఉమ్మడి కార్యాచరణకు రూపమిచ్చేందుకు మంగళవారం రోజంతా కీలక మేధోమథనం జరపనున్నారు. కాంగ్రెస్ అగ్ర నేత సోనియా సారథ్యంలో కొత్త కూటమి ఆవిర్భావం జరగవచ్చని తెలుస్తోంది. సోనియాతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వద్రా, విపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు నితీశ్‌కుమార్ (జేడీ-యూ), మమతా బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్), ఎంకే స్టాలిన్ (డీఎంకే), అరవింద్ కేజ్రీవాల్ (ఆప్)తో పాటు ఆర్జేడీ చీఫ్ లాలుప్రసాద్, జేఎంఎం నేత హేమంత్ సొరేన్, అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), ఉద్ధవ్ ఠాక్రే (శివసేన-యూబీటీ), ఫరూక్ అబ్దుల్లా (ఎన్సీ), మెహబూబా ముఫ్తీ (పీడీపీ), సీతారాం ఏచూరి (సీపీఎం), డి.రాజా (సీపీఐ), బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, జయంత్‌చదరి (ఆరెల్డీ), వైకో (ఎండీఎంకే) తదితరులు సోమవారం సమావేశంలో పాల్గొన్నారు. బెంగళూరు నగరమంతటా ఎటు చూసినా 'కలుద్దాం, నిలుద్దాం' నినాదంతో విపక్ష కూటమి నేతలందరి ఫొటోలతో కూడిన భారీ బ్యానర్లే కన్పించాయి. ఇక కాంగ్రెస్‌తో చిరకాలంగా ఉప్పూనిప్పుగా ఉన్న మమత విందు భేటీలో సోనియా పక్కనే కూర్చోవడం ప్రధానాకర్షణగా నిలిచింది. ఆ సందర్భంగా వారిరువురూ 20 నిమిషాల పాటు చర్చలు కూడా జరిపారు. పార్టీలో చీలికతో సతమతమవుతున్న ఎన్సీపీ అధినేత శరద్ పవార్ సోమవారం భేటీకి హాజరు కాలేదు. మంగళవారం కుమార్తె సుప్రియా సులేతో పాటు ఆయన చర్చల్లో పాల్గొంటారని విపక్ష వర్గాలు తెలిపాయి. విపక్షాలతో తలపడేందుకు తానొక్కన్నే చాలని గొప్పలకు పోయిన ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు 30కి పైగా పార్టీలతో జట్టు కట్టేందుకు ఎందుకు తహతహలాడుతున్నారని ప్రశ్నించారు. జేడీ(ఎస్)తో పాటు బీజేపీ ఓటమి కోరే భావ సారూప్య పార్టీలన్నింటికీ కూటమిలోకి స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నట్టు కాంగ్రెస్ నేత పవన్ ఖేరా తెలిపారు.

సయోధ్య ఏ మేరకు సాధ్యం?

అయితే పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలు-తృణమూల్ సహా పలు రాష్ట్రాల్లో విపక్షాల మధ్యే సహజ వైరం నెలకొని ఉన్న నేపథ్యంలో వాటి మధ్య సయోధ్య ఏ మేరకు సాధ్యమవుతున్నది ఆసక్తికరం. తృణమూల్‌తో బెంగాల్‌లో ఎలాంటి పొత్తూ ఉండబోదని సమావేశ వేదిక వద్దే సీపీఎం ప్రధాన కార్యదర్శి కుండబద్దలు కొట్టారు. అయితే, విపక్షాల ఓటు బ్యాంకులో చీలికను నివారించేందుకు కలిసి పని చేస్తామంటూ ముక్తాయించారు.

భేటీలో పాల్గొంటున్న పార్టీలు

కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, జేఎంఎం, ఎన్సీపీ, శివసేన (యూబీటీ), ఎస్పీ, జేడీ(యూ), ఎండీఎంకే, కేడీఎంకే, వీసీకే, ఆరెస్పీ, సీపీఐ-ఎంఎల్, ఫార్వర్డ్ బ్లాక్, అప్నాదళ్, మణిథనేయ మక్కల్ కచ్చి (ఎంఎంకే) సహా మొత్తం 26 పార్టీలు. వీటన్నింటికీ కలిపి లోక్‌సభలో 150 మంది దాకా ఎంపీల బలముంది!

కూటమి కన్వీనర్‌గా నితీశ్...?

కొత్త కూటమి పేరు కూడా మంగళవారం నాటి చర్చల అజెండాలో ఉన్నట్టు సమాచారం. ''ఇండియా అని వచ్చేలా కూటమికి ఆకర్షణీయమైన పేరును పార్టీలన్నీ సూచిస్తాయి. 'యునైటెడ్ వుయ్ స్టాండ్' అన్నది ట్యాగ్‌లైన్‌గా ఉండనుంది'' అని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

- అంతేగాక యూపీఏ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన సోనియాగాంధీని కొత్త కూటమి సారథిగా వ్యవహరించే అవకాశముందని చెబుతున్నారు.
- సామాజిక న్యాయం, సమ్మిళిత వృద్ధి, జాతీయ సంక్షేమమే ప్రధాన లక్ష్యాలుగా ఉమ్మడి కార్యాచరణ ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.
- కన్వీనర్‌గా బిహార్ సీఎం నితీశ్ కీలక బాధ్యతలు తీసుకోవచ్చు.
- కీలకమైన రాష్ట్రాలవారీగా పార్టీలవారీగా పోటీ చేయాల్సిన లోక్‌సభ స్థానాల సంఖ్యను ఖరారు చేసుకోవడం వంటివీ చర్చకు వస్తాయంటున్నారు.
- మంగళవారం భేటీ అనంతరం సంయుక్త ప్రకటనతో పాటు ఉమ్మడి ఆందోళన ప్రణాళికను కూడా విపక్ష కూటమి ప్రకటించవచ్చని సమాచారం.
- ఒక కమిటీతో పాటు కనీస ఉమ్మడి ప్రణాళిక, విపక్షాల సంయుక్త నిరసన కార్యక్రమాల ఖరారుకు రెండు సబ్ కమిటీలు కూడా ఏర్పాటు చేసే అవకాశముంది.

ఎన్డీయే బల ప్రదర్శన

విపక్షాల భేటీకి దీటుగా సమావేశం

- కూటమిలోకి ఎల్జేపీ సహా పలు కొత్త ముఖాలు
- నేడు పూర్తిస్థాయి భేటీ... పాల్గొననున్న 38 పార్టీలు!



సోమవారం ఎల్జేపీ నేత చిరాగ్ పాశ్వాన్‌ను ఎన్డీఏలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ చీఫ్ నడ్డా

న్యూఢిల్లీ: బెంగళూరులో జరుగుతున్న విపక్షాల భేటీకి దీటుగా అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) తన బలాన్ని ప్రదర్శించాలని ఉవ్విళ్లూరుతోంది. మంగళవారం ఢిల్లీలో ఎన్డీయే పక్షాల కీలక సమావేశం జరుగనుంది. మరికొన్ని కొత్త పార్టీలు సైతం కూటమిలో చేరనున్నట్లు తెలుస్తోంది. లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్), ఒ.పి.రాజ్‌భర్ నేతృత్వంలోని ఎస్‌బీఎస్పీ, హిందూస్తానీ అవామ్ మోర్చా(సెక్యులర్) వంటి పార్టీలు అధికార కూటమిలో చేరేందుకు రంగం సిద్ధమైంది. కొత్త పార్టీల రాకతో తమ కూటమి మరింత బలోపేతం కావడం ఖాయమని, వచ్చే ఎన్నికల్లో విపక్షాలకు భంగపాటు తప్పదని ఎన్డీయే భాగస్వామ్యపక్షాల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జరిగే భేటీకి 38 పార్టీలు హాజరు కానున్నాయి. ఈ విషయాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా ప్రకటించారు. ఆయా పార్టీలకు ఆహ్వానాలు పంపించామని చెప్పారు. శివసేన(ఏక్‌నాథ్ షిండే), ఎన్సీపీ(అజిత్ పవార్), రాష్ట్రీయ లోక్ జనతాదళ్(ఆర్ఎల్‌జేడీ) తదితర పక్షాలు సైతం తొలిసారిగా ఎన్డీయే సమావేశంలో పాల్గొనబోతున్నాయి. ఇందులో కొన్ని పార్టీలు ఇప్పటికే బీజేపీతో పొత్తు కొనసాగిస్తున్నాయి.

వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా..

వాస్తవానికి కొన్ని పార్టీలు ఎన్డీయే నుంచి బయటకు వెళ్లిపోయాయి. జేడీ(యూ), శివసేన(ఉద్ధవ్ ఠాక్రే), అకాలీదళ్ దూరమయ్యాయి. వీటి స్థానంలో కొత్త పార్టీలు తమ కూటమిలో అడుగు పెతుండడం ఎన్డీయేలో కొత్త ఉత్సాహం నింపుతోంది. తమిళనాడుకు చెందిన ఏఐఏడీఎంకేతోపాటు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొన్ని పార్టీలు కూడా ఎన్డీయే సమావేశానికి హాజరు కానున్నాయి. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రెండోసారి ఏర్పాటైన తర్వాత అధికార కూటమి సమావేశం భారీ స్థాయిలో జరుగుతుండడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఈ భేటీలో వ్యూహ రచన చేయనున్నట్లు తెలుస్తోంది.

తమిళ మంత్రి పొన్ముడి ఇంటిపై ఈడీ దాడి

సాక్షి, చెన్నై: తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి, ఆయన తనయుడు, ఎంపీ గౌతం శిఖామణి నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. చెన్నై, విల్లుపురం, విక్రవాండిలోని 10 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. 2006-2011 మధ్య కాలంలో గనుల మంత్రిగా ఉండగా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు అన్నాడీఎంకే హయాంలో కేసు నమోదైంది. పొన్ముడి, ఆయన తనయుడు గౌతమ్ శిఖామణి, డీఎంకే నేతలు సదానందన్, జయచంద్రన్, రాజమహేంద్రన్, గోపినాథ్‌లపై దాఖలైన ఈ కేసు మద్రాస్ హైకోర్టులో విచారణలో ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కళ్లకురిచ్చి స్థానం నుంచి గౌతమ్ శిఖామణి ఎన్నికయ్యారు. అదే సమయంలో అక్రమార్జన సొమ్ముతో విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్లుగా ఆయనపై ఈడీ మనీలాండరింగ్ కేసును నమోదు చేసింది. 2020లో గౌతమ్ శిఖామణి పేరిట ఉన్న రూ.8 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. 2021లో డీఎంకే ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పొన్ముడి బాధ్యతలు చేపట్టారు. కొంత కాలంగా ఆయన తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు చెన్నై నివాసంలో జరిపిన సోదాల్లో సోదాల్లో రూ.41.9 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు, రూ.70 లక్షల నగదు, సుమారు రూ.10 లక్షల విదేశీ కరెన్సీ లభించింది. అనంతరం పొన్ముడిని రాత్రి 8 గంటల సమయంలో ఈడీ అధికారులు తీసుకెళ్లారు.

సెల్ ఛార్జర్‌లో మంటలు.. వెనక్కి మళ్లిన విమానం

ముంబై: టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే ప్రయాణికుడు సెల్‌ఫోన్ చార్జర్‌లో మంటలు రావడంతో విమానం వెనక్కి మళ్లింది. సోమవారం ఉదయ్‌పూర్- ఢిల్లీ ఎయిరిండియా విమానంలో ఘటన చోటుచేసుకుంది. విమానం టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే ప్రయాణికుడొకరు తన సెల్‌ఫోన్ చార్జర్ బాగా వేడెక్కిందంటూ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీంతో, ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని తిరిగి ఉదయ్‌పూర్‌లో దించారు. కొద్దిసేపటి తర్వాత తిరిగి ఢిల్లీకి బయలుదేరింది. సెల్‌ఫోన్ బ్యాటరీ పేలడం వల్లే ఆ విమానం వెనక్కి మళ్లిందనే వార్తలు కూడా వస్తుండటం గమనార్హం.

రూ.2,381 కోట్ల డ్రగ్స్ ధ్వంసం

డ్రగ్స్ నుంచి యువతను కాపాడటమే లక్ష్యమన్న అమిత్ షా



న్యూఢిల్లీ: మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను కాపాడటమే లక్ష్యంగా డ్రగ్స్‌పై పోరాటం చేస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. సోమవారం ఆయన డ్రగ్స్ స్మగ్లింగ్ అండ్ నేషనల్ సెక్యూరిటీ అంశంపై జరిగిన సదస్సులో ప్రసంగించారు. డ్రగ్స్ అక్రమ రవాణాదారులను ఆర్థికంగా దెబ్బకొట్టే వరకు ఈ పోరాటం పూర్తి కాదని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.2,381 కోట్ల విలువైన 1.40 లక్షల కిలోల డ్రగ్స్ ధ్వంసాన్ని మంత్రి వర్చువల్‌గా వీక్షించారు. ఇందులో హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న సుమారు 6,600 కిలోల డ్రగ్స్ కూడా ఉన్నాయి.

ఎన్డీఏకి జీవం పోసేందుకు బీజేపీ ప్రయత్నం

ప్రతిపక్ష పార్టీలను ఓడించేస్తామ ట ఇంతకాలం ప్రగల్భాలు ప లికిన బీజేపీ ఇప్పుడు, చలనం లేని ఎన్డీఏకి మళ్లీ జీవం పోసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని మోదీకి అకస్మాత్తుగా ఎన్డీఏ గుర్తుకు వచ్చింది. ఇదంతా మా పట్నా భేటీ ప్రభావమే. భవిష్యత్తు కార్యాచరణను, మా కూటమికి గత యూపీఏ పేరునే కొనసాగించాలా లేకుంటే మరో పేరు పెట్టాలా అనేది భేటీలో నిర్ణయిస్తాం.

-కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

ప్రతిపక్షాలది స్వార్థ కూటమి

మంగళవారం ఎన్డీఏ భేటీకి వస్తామని 38 పార్టీలు హామీ ఇచ్చాయి. మోదీ నేతృత్వాన్ని మరోసారి బలపరచాలని ప్రజలను కోరనున్నాం. విపక్షాలకు నాయకుడు లేడు, సిద్ధాంతమూ లేదు. స్వార్థ ప్రయోజనాల కోసమే కలుస్తున్నారు. టీడీపీ, అకాలీదళ్‌లను ఎన్డీఏలోకి మళ్లీ రావాలని అడిగేది లేదు.

-బీజేపీ చీఫ్ జేపీ నడ్డా

సాక్షి కరీంనగర్
మంగళవారం । 18 । జులై । 2023



.. నిండని చెరువులు

చొప్పదండి మండలంలోని పలు గ్రామాల్లో తలాపు నుంచే గోదావరి నీళ్లు పారుతున్నా.. పంటలకు అందడం లేదు. దీంతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. 8లో▸



కొనసాగుతున్న నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి 2,300, కుడి కాల్వకు 200, ఎడమ కాల్వకు 30 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ప్రాజెక్టులోకి వరద కాల్వ ద్వారా 2,530 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

సాధారణ ప్రసవాలపై దృష్టిపెట్టాలి



ఆస్పత్రిలో డీఎంహెచ్‌వో లలితాదేవి

హుజూరాబాద్‌: సాధారణ ప్రసవాలపై వైద్యులు దృష్టిసారించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ వాసుదేవరెడ్డి, డీఎంహెచ్‌వో లలితాదేవి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో గైనకాలజిస్టును నియమిస్తామని తెలిపారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆపరేషన్లు నిర్వహించాలని వైద్యసిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నుంచి వచ్చే గర్భిణులకు సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలని వివరించారు. అత్యవసర కేసులు కరీంనగర్‌ మాతాశిశు కేంద్రానికి రెఫర్‌ చేయాలని పేర్కొన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో డాక్టర్‌ సుధాకర్‌రావు, డాక్టర్‌ నారాయణరెడ్డి, హెల్త్‌ ఆఫీసర్‌ సాజిద్‌ హుస్సేన్‌, జిల్లాహెల్త్‌ ఎడ్యుకేటర్‌ పంజాల ప్రతాప్‌ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో 70శాతం సౌకర్యాలు ఉంటేనే అవార్డు



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న సభ్యులు

తిమ్మాపూర్‌: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జాతీయ నాణ్యత ప్రమాణాల సూచిక బృందం సోమవారం సందర్శించింది. నాలుగు అంశాలను పరిశీలించింది. మండల ఏఎన్‌ఎం సిబ్బందితో ప్రత్యేక మీటింగ్‌ ఏర్పాటు చేశారు. అవుట్‌ పేషెంట్‌ వివరాలు, ఐపీడీ ల్యాబోరేటరీ నేచురల్‌ హెల్త్‌ ప్రోగ్రాం జనరల్‌ ఆడిట్‌లను పాటిస్తున్నారా అని ఆరా తీశారు. బిల్డింగ్‌ నిర్వహణ, రికార్డులు పరిశీలించారు. ఇవన్నీ 70శాతం సరిగా ఉంటే అవార్డుకు ఎంపిక చేస్తారని సభ్యులు తెలిపారు. మెడికల్‌ ఆఫీసర్‌ ప్రణవ్‌, డాక్టర్‌ నాగశేఖర్‌, డీపీవో తులసిరవీందర్‌, జిల్లా క్వాలిటీ మేనేజర్‌ సాగర్‌ పాల్గొన్నారు.

ఉద్యమాలు ఉధృతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్‌: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 23న జరిగే చలో హైదరాబాద్‌ సదస్సును విజయవంతం చేయాలని డీటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి అన్నారు. సోమవారం జీవిత బీమా సంస్థ డివిజన్‌ కార్యాలయంలో జరిగిన పాత పెన్షన్‌ పునరుద్ధరణ ఐక్యవేదిక జిల్లా శాఖ సమావేశంలో మాట్లాడారు. పెన్షన్‌ ఉద్యోగుల హక్కుగా భావిస్తున్న మనం, ఎన్నికల సంవత్సరం మరింత ఉధృతమైన ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాల సమావేశాల ద్వారా ఉద్యోగులను ఏకీకృతం చేసి ఈనెల 23న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎస్‌ వ్యతిరేక సదస్సు, ఢిల్లీలో ఆగస్టు 10న ధర్నాకు ఐక్యవేదిక నిర్ణయించిందని తెలిపారు. జిల్లా నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. బీటీఎఫ్‌ ప్రెసిడెంట్‌ ఎం.రాజయ్య, డీటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి చకినాల రామ్మోహన్‌, టీఆర్‌టీఎఫ్‌ ప్రెసిడెంట్‌ ఎన్‌.విద్యాసాగర్‌, యూటీఎఫ్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌.కుమార్‌, ప్రధాన కార్యదర్శి జావేద్‌, టీపీటీఎఫ్‌ ప్రెసిడెంట్‌ పి.దామోదర్‌ రెడ్డి, ఐసీఈయూ నాయకులు రవీంద్రనాథ్‌, రామ్మోహన్‌రావు, ఆర్వీ రమణ, వామన్‌ రావు తదితరులు పాల్గొన్నారు.


రైతు శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తి కేసీఆర్‌

ఇల్లందకుంట: రైతు శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తి సీఎం కేసీఆర్‌ అని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌ రెడ్డి అన్నారు. ఇల్లందకుంట క్లస్టర్‌ పరిధిలోని టేకుర్తి, గడ్డివానిపల్లి, చిన్నకొమిటిపల్లి, శ్రీరాములపల్లి గ్రామాలకు చెందిన రైతులతో మండలకేంద్రంలో సమావేశం నిర్వహించారు. మూడు పంటలు కావాలా.. మూడు గంటల కరెంట్‌ కావాలో ప్రజలు ఆలోచన చేయాలని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌ జెండా ఎగరేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేడీసీసీ వైస్‌ చైర్మన్‌ పింగిలి రమేశ్‌, నాయకులు సరిగొమ్ముల వెంకటేశ్‌, గణపతి, రామస్వామి, సంజీవరెడ్డి, రఫీఖాన్‌, కొంరెల్లి, ఐలయ్య, రాజు తదితరులు ఉన్నారు.

అదృశ్యం

కరీంనగర్‌ కమిషనరేట్‌ పరిధిలో 215 మిస్సింగ్‌ కేసులు

- వ్యాపారాల్లో నష్టాలతో ఇతర ప్రాంతాలకు కొందరు
- మతిస్థిమితం లేక మరికొందరు
- ప్రేమ పేరిట మోసపోతున్న బాలికలు, యువతులు
- ఎక్కువ శాతం మహిళలే మిస్సింగ్‌



కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌ కమిషనరేట్‌ పరిధిలో మిస్సింగ్‌ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం నగరంలోనే నమోదవుతున్నాయి. బాలికలు, యువతులు ప్రేమ వలలో చిక్కుకొని, కనిపించడం లేదు. దంపతుల మధ్య తలెత్తుతున్న వివాదాలతో కొందరు ఇంటికి దూరమవుతున్నారు. మతిస్థిమితం లేనివారు, వివిధ వ్యాధులకు చికిత్స చేసుకునేవారు కూడా ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రావడం లేదు. కమిషనరేట్‌ పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 215 కేసులు నమోదవగా పోలీసులు 196 కేసులను ఛేదించారు. 19 మిస్సింగ్‌ కేసుల్లో వ్యక్తుల ఆచూకీ ఇంకా తెలియలేదు.

ప్రేమ వ్యవహారానివే 135

ప్రేమపేరుతో మోసపోతున్న యువతులు, బాలికలే ఎక్కువగా అదృశ్యమవుతున్నట్లు పోలీస్‌శాఖ గణాంకాలు చెబుతున్నాయి. బాధితుల కుటుంబసభ్యులు తమ బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికి, చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వారు విచారణ చేపట్టి, యువతులు, బాలికలను గుర్తించి, ప్రేమ వ్యవహారమేనని తేల్చుతున్నారు. ఇప్పటివరకు 135 కేసులు నమోదవగా 126 మంది ఆచూకీ కనిపెట్టి, వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మతిస్థిమితం లేనివారు, కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయినవారిని సీసీ కెమెరాల సహాయంతో పట్టుకుంటున్నారు. కరీంనగర్‌లో పలువురు వ్యాపారులు వ్యాపారంలో నష్టపోయి, అప్పులపాలవడంతో మకాం మారుస్తున్నారు. చిట్టీలు నడిపించి నష్టపోయినవారు, చిట్టీల పేరుతో డబ్బులు దండుకొని, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, వడ్డీ వ్యాపారుల నుంచి డబ్బులు తీసుకొని, చెల్లించలేని పరిస్థితిలో దూర ప్రాంతాలకు వెళ్లిపోయినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మిస్సింగ్‌ కేసులను పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి, ఛేదిస్తున్నారు.

త్వరగా ఛేదిస్తున్నాం



మిస్సింగ్‌ కేసులు నమోదైతే టెక్నాలజీ సహాయంతో త్వరగా ఛేదిస్తున్నాం. ఎక్కువగా బాలికలు, యువతులు అదృశ్యమవుతుండగా 90 శాతానికిపైగా కేసుల్లో బాధితుల ఆచూకీ తెలుసుకొని, వారికి కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నాం.

– ఎల్‌.సుబ్బారాయుడు, పోలీసు కమిషనర్‌, కరీంనగర్‌

మోసపూరిత మ్యారేజ్‌ బ్యూరోలతో జాగ్రత్తగా వ్యవహరించాలి

- అసోసియేషన్‌ రాష్ట్రస్థాయి సమావేశంలో నాయకులు



సమ్మేళనంలో పాల్గొన్న మ్యారేజ్‌బ్యూరో సభ్యులు

కరీంనగర్‌: మా తెలంగాణ ఆల్‌ మ్యారేజ్‌ బ్యూరో ఓనర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. దాదాపు 150మందికి పైగా నిర్వాహకులు హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మ్యారేజ్‌ బ్యూరో అని చెప్పుకుంటూ కొందరు మోసపూరితమైన వాగ్దానాలతో పెళ్లిళ్లు చేయడం జరుగుతుందని, వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మ్యారేజ్‌బ్యూరో నిర్వాహకులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ సమ్మేళనంలో రాష్ట్ర అధ్యక్షుడు రాదండి వెంకటేశ్‌, ప్రధాన కార్యదర్శి సిద్ధి మహేశ్‌, ఉపాధ్యక్షులు జక్కని మచ్చయ్య, తోట సత్యనారాయణ, మియాపురం లక్ష్మీనారాయణ, రాష్ట్ర గౌరవ సలహాదారులు కారంగుల చంద్రశేఖర్‌రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి కంకణాల శ్రీనివాస్‌ రెడ్డి,రాష్ట్ర కోశాధికారి కనపర్తి మురళి, జిల్లా అధ్యక్షుడు బొడ్ల మారుతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ల ముట్టడి.. తాగునీటి కట్టడి

- 21 నుంచి పంచాయతీ సిబ్బంది ఆందోళన తీవ్రతరం
- ఉద్యోగ భద్రత, వేతన స్థిరీకరణ, బకాయిల విడుదలకు డిమాండ్‌
- మల్టీపర్పస్‌ విధానాన్ని రద్దుచేయాల్సిందేనని స్పష్టీకరణ
- వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని వేడుకోలు
- స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఆటంకాలు



జమ్మికుంట ఎంపీడీవో ఆఫీసు ఎదుట అర్ధనగ్న ప్రదర్శనలో పంచాయతీ కార్మికులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్‌:

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రారంభించిన సమ్మె తీవ్రరూపం దాల్చనుంది. ఈనెల 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి కార్మిక, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. ఇదే క్రమంలో అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నాలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులు మాత్రమే పాల్గొంటున్న ఈ సమ్మెలో త్వరలో కారోబార్‌, బిల్‌ కలెక్టర్‌, పంప్‌ డ్రైవర్‌, ట్రాక్టర డ్రైవర్‌, ఎలక్ట్రీషియన్‌ సిబ్బంది పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని కార్మిక, ఉద్యోగ సంఘాల జేఏసీలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లోని దాదాపు 50 వేల మంది సిబ్బంది ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు.

పక్కా ప్రణాళికతో..

చాలాకాలంగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.. ఎలాంటి స్పందన లేకపోవడంతోనే తామునమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని కార్మిక సంఘాల నాయకులు స్పష్టంచేస్తున్నారు. 21న కలెక్టరేట్ల ముట్టడి అనంతరం గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయాలన్న ఆలోచనలో ఉన్నారు. వాస్తవానికి గ్రామ పంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి దాదాపు నాలుగు నెలలుగా వేతనాలు లేక అల్లాడుతున్నారు. దీనికి తోడు 12 రోజులుగా గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పేరుకుపోయి వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. ఇప్పుడే గ్రామపంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌ కింద ఎంపికైన గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. సర్వేకు సహకరించాల్సిన పంచాయతీ సిబ్బంది, జేపీఎస్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటేనే స్వచ్ఛసర్వేక్షణ్‌ సర్వే సజావుగా సాగనుంది. ఈ రెండింటిని దృష్టిలో ఉంచుకొని జిల్లా పంచాయతీ అధికారులు సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని, జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ప్రక్రియ కొనసాగుతుందని డీపీవో వెల్లడిస్తూ వెంటనే విధుల్లోకి చేరేలా ఒత్తిడి తెస్తున్నారు.

ఎందుకు కష్టాలు?

వాస్తవానికి ప్రతీ గ్రామపంచాయతీలో సిబ్బంది విషయంలో రికార్డులో సగం, రికార్డులో లేకుండా సగంమంది పనిచేస్తున్నారు. రికార్డులో ఉన్న వారికి రూ.8,500, లేని వారికి రూ.7,000 లేదా అంతకంటే తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం 2019లో ప్రభుత్వం జీవో నెం.51ని విడుదల చేయడం వీరికష్టాలను మరింత పెంచింది. ఈ జీవో ప్రకారం.. 500 మంది జనాభా ఉన్న గ్రామపంచాయతీకి ఒక ఉద్యోగిని తీసుకోవాలి. వారికి రూ.8,500 వేతనం చెల్లించాలి. అప్పటికి.. ఇప్పటికి జనాభా పెరిగింది. అందుకే, గ్రామపంచాయతీ అదనపు సిబ్బందిని తీసుకుంది. వారికి ఉన్నవారి వేతనాన్ని పంచుతు సర్దుబాటు చేస్తోంది. ఇది ఒకరకంగా వెట్టిచాకిరీ కిందకే వస్తుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. చాలాచోట్ల రూ.4 వేల కంటే తక్కువ వేతనం, సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు 2001 జనాభా లెక్కల ప్రకారం.. 4000 జనాభా ఉన్నచోట ఎనిమిది మంది పనిచేయాలి. కానీ.. ఇపుడు ఆ గ్రామంలో జనాభా పదివేలకు చేరి ఉంటుంది. దీంతో 15 మంది వరకు సిబ్బంది అవసరం. దీంతో ఈ ఎనిమిదిమందికి రూ.8,500 చొప్పున రూ.68,000 వేతనం ఇవ్వాలి. కానీ.. రూ.4 వేల చొప్పున అదేవేతనాన్ని 15 మందికి పంచుతున్నారు. అంతేకాకుండా మల్టీపర్పస్‌ వర్కర్‌ విధానంతో అందరూ అన్నిపనులు చేయాలనడాన్ని కార్మికులు తప్పుబడుతున్నారు. విద్యావంతులు కారోబార్‌లుగా వ్యవహరిస్తున్నారు. కానీ.. వారితో మురికి కాలువలు తీయిస్తున్నారు. చాలాచోట్ల సర్పంచులు తమకునచ్చని కారోబార్లతో రోడ్లు ఊడ్పించడం, కాలువలు తీయించడం చేయిస్తున్నారు. దీంతో డిగ్రీ, పీజీ చదివిన కారోబార్ల ఆత్మగౌరవాన్ని ఇది దెబ్బతీస్తోంది. స్కిల్డ్‌ అన్‌స్కిల్డ్‌ను ఒకే గాటిన కట్టడం సరికాదని వాదిస్తున్నారు. ఆకస్మికంగా మృతిచెందిన వారి కుటుంబాలకు ఎలాంటి పరిహారం అందడం లేదు. మల్టీపర్పస్‌ వర్కర్స్‌ నిరసనలు, దీక్షలు, ఆందోళన కార్యక్రమాలను ఉధృతంచేసి ఇదే సమయంలో డిమాండ్లను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రతరం చేశారు.

డిమాండ్లు ఇవే...

- పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్‌ చేసి ప్రత్యేక బడ్జెట్‌ కేటాయించి వేతనాలు ఇవ్వాలి.
- మినిమం బేసిక్‌ను రూ.19 వేలుగా వేతనంగా చెల్లించాలి. జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15600, పంప్‌ ఆపరేటర్లు, ఎలక్ట్రిషియన్లు, కారోబార్‌, బిల్లు కలెక్టర్లకు రూ.19,500 చెల్లించాలి.
- ప్రమాదంలో మరణించిన సిబ్బందికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.
- ప్రమాదంలో మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ.30 వేల ఆర్థిక సాయం. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇన్సూరెన్స్‌ సౌకర్యం వర్తింపజేయాలి.
- ఎనిమిది గంటల పనిదినాన్ని అమలుచేస్తూ వారంతపు సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలి.
- ఆదాయం ఉన్న పంచాయతీల్లో వేతనాల పెంపునకు అనుమతి ఇవ్వాలి.
- ట్రాక్టర్‌ డ్రైవర్లకు పంచాయతీల ద్వారానే డ్రైవింగ్‌ లైసెన్స్‌లు ఇప్పించాలి.
- అకారణంగా కార్మికులను తొలగించే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు మానుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

జిల్లా	జీపీలు	మల్టీపర్పస్‌ వర్కర్లు
కరీంనగర్‌	313	1397
జగిత్యాల	380	1534
పెద్దపల్లి	266	1108
సిరిసిల్ల	255	1222
మొత్తం	1,214	5,261

ప్రభుత్వం దిగొచ్చేవరకూ ఉద్యమం



జీపీల్లో మల్టీపర్పస్‌ వర్కర్స్‌ విధానాన్ని అమలు చేస్తూ శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే. 12 రోజులుగా సమ్మెచేస్తున్నా.. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి.. బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామికం. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మెను ఉధృతం చేస్తాం.

– కొప్పుల శంకర్‌, జీపీ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్‌

ఉద్యోగులుగా గుర్తించాలి



మానకొండూరు గ్రామపంచాయతీలో 14 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనంతో జీవనం సాగిస్తున్నా.. ఇద్దరు పిల్లలు.. వచ్చే జీతం ఎటు సరిపోవడంలేదు. ప్రభుత్వం మా కష్టానికి తగ్గట్టుగా జీతం పెంచడంతో పాటు మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

– జి.జగదీశ్వర్‌, జీపీ ఎలక్ట్రీషియన్‌, మానకొండూర్‌

జంక్షన్లపై బల్దియా నజర్‌



జంక్షన్ల నమూనా విడుదల చేస్తున్న మంత్రి కమలాకర్‌, మేయర్‌ సునీల్‌రావు, కార్పొరేటర్లు

- రూ.4 కోట్లతో 13 ఐలాండ్‌ల అభివృద్ధి
- నేడు మూడు ప్రాంతాల్లో పనులు షురూ
- ప్రపంచ పర్యాటక క్షేత్రంగా నగరం: మంత్రి గంగుల కమలాకర్‌

కరీంనగర్‌ కార్పొరేషన్‌:

నగరసుందరీకరణలో భాగంగా జంక్షన్‌లపై అభివృద్ధిపై నగరపాలకసంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే పూర్తయిన జంక్షన్లకు అదనంగా 13 జంక్షన్ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటోంది. నగరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ ఐలాండ్స్‌ అభివృద్ధిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మొత్తం 20 జంక్షన్లకు గాను ఇప్పటికే ఏడు జంక్షన్లు పూర్తికాగా, రూ.4 కోట్లతో మిగిలిన 13 జంక్షన్ల ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు. పద్మనగర్‌ , సిక్‌వాడీ, కోతిరాంపూర్‌ చౌరస్తాల పనులను మంగళవారం ప్రారంభించనున్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మిస్తున్న స్థలానికి సమీపంలోని పద్మనగర్‌ జంక్షన్లలో తిరుపతి అలిపిరి తరహా నమూనా ఏర్పాటు చేయనుండడం ఆకర్షణగా నిలవనుంది.

ప్రపంచ పర్యాటక క్షేత్రంగా...

ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా నగరాన్ని తీర్చిదిద్దుతున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్‌ యాదగిరి సునీల్‌ రావు, డిప్యూటీ మేయర్‌ చల్ల స్వరూపారాణి హరిశంకర్‌తో కలిసి అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్లతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగర ప్రజ లకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడం కోసం జంక్షన్లను ఆధునీకరిస్తున్నామన్నారు. అత్యాధునికమైన డిజైన్లు, అందమైన ఆకృతులు, వాటర్‌ఫౌంటేన్‌, డిజిటల్‌ లైటింగ్‌, గ్రీనరీ ల్యాండ్‌ స్కేపింగ్‌లతో జంక్షన్లను సుందరీకరిస్తున్నామన్నారు. మొదట పద్మనగర్‌ జంక్షన్‌, కోతిరాంపూర్‌ జంక్షన్‌, సిక్‌వాడీ జంక్షన్‌ల అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన జంక్షన్ల ఆధునీకరణ పనులు కూడా వారంరోజుల్లో మొదలు పెట్టి నెలరోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన జంక్షన్ల ట్రయల్‌రన్‌ పనులను పరిశీలించామన్నారు. హైదరాబాద్‌ తర్వాత కరీంనగర్‌ రాష్ట్రంలోనే అతిపెద్ద నగరంగా మారుతుందన్నారు. ఇప్పటికే సుమారు రూ.7 కోట్లతో అంబేడ్కర్‌, బాబూజగ్జీవన్‌రాం, గాంధీచౌరస్తా, ఓల్డ్‌పవర్‌హౌస్‌, హెచ్‌కేఆర్‌, సదాశివపల్లి, తెలంగాణ చౌక్‌ జంక్షన్ల ఆధునీకరణ పూర్తయ్యిందన్నారు. పద్మనగర్‌, సిక్‌వాడీ, కోతిరాంపూర్‌ జంక్షన్లలతో పాటు శాతవాహన యూనివర్సిటీ, ఓల్డ్‌ శిశుమందిర్‌, కేసీఆర్‌ సర్క్యూట్‌ హౌస్‌, మారుతినగర్‌ చౌరస్తా, నాఖాచౌరస్తా, నెహ్రూచౌక్‌, సదాశివపల్లి చౌరస్తా, పీవీ నరసింహారావు విగ్రహం,సర్వోదయ పాఠశాల, రేకుర్తి అంబేడ్కర్‌ చౌరస్తాల్లో జంక్షన్లను ఆధునీకరిస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్‌ వ్యవస్థను మెరుగు పరిచేలా చర్యలు చేపడుతామన్నారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన గార్డెన్‌ను పరిశీలించారు. ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రతిబింబిస్తూ ఏ టూ జెడ్‌ పేరిట రూపొందించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు.



పద్మనగర్‌ జంక్షన్‌ నమూనా




సదాశివపల్లి- వరంగల్‌ రోడ్డు జంక్షన్‌ నమూనా



నగరంలోని ఓ జంక్షన్‌ నమూనా

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



నిరసన తెలుపుతున్న యూటీఎఫ్‌ నాయకులు

కరీంనగర్‌: గురుకుల సొసైటీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టి, సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌ యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ ఎదుట నిరసన చేపట్టారు. యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్‌ మాట్లాడుతూ.. అన్ని గురుకులసొసైటీలకు ఏకరూప సమయపాలన వర్తింపజేసి, కేర్‌టేకర్‌ డిప్యూటీ వార్డెన్లను నియమించి, ఉపాధ్యాయులను నైట్‌డ్యూటీల నుంచి మినహాయించాలని కోరారు. ఆదివారం, సెలవురోజుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వీక్లీఆఫ్‌ వర్తింపజేయాలని అన్నారు. హెల్త్‌కార్డులు అందించి, రీయంబర్స్‌మెంట్‌ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. మార్చిలో రావల్సిన ఇంక్రిమెంట్‌ను మంజూరు చేయలని కోరారు. కాంట్రాక్టు, అవుట్‌ సోర్సింగ్‌, గెస్ట్‌, పార్ట్‌టైం ఉపాధ్యాయులకు 12నెలలకు జీతం అందించి, సమాన పనికి సమాన వేతనం వర్తింపజేయాలని సూచించారు. యూటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎఫ్‌ జావేద్‌, కోశాధికారి రాజమౌళి, ఉపాధ్యాయులు కిశోర్‌గుప్తా, దేవయ్య, రమేశ్‌, రవికుమార్‌, సుదాకర్‌, అరుణ, జైసింగ్‌, సారయ్య, మంజుల, సంతోష్‌, కుమారస్వామి, రాణి, జ్యోతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోకాళ్లపై కూర్చుని స్వీపర్ల నిరసన



నిరసన తెలుపుతున్న స్వీపర్లు

కరీంనగర్: మండల, జిల్లా పరిషత్ పాఠశాలల స్వీపర్లను క్రమబద్ధీకరించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పాఠశాలల స్వీపర్లు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలేదీక్షలు ఆరోరోజుకు చేరుకున్నాయి. స్వీపర్లు మోకాళ్ల మీద కూర్చుని నిరసన చేపట్టారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్ల స్వీపర్లను వివిధ సందర్భాల్లో 1983, 1994,2017లో రెగ్యులర్ చేశారని, మిగిలిన వారిని సైతం రెగ్యులర్ చేయాలని ఏపీఎస్‌రెడ్డి కమిటీ సిఫారసు స్పష్టం చేసిందని అన్నారు. రాష్ట్రం ఏర్పడితే బతుకులు బాగుపడతాయని ఆశించిన వారికి మరింత బానిసత్వం ఎదురైందన్నారు. ప్రభుత్వ స్కూల్ స్వీపర్లను వెంటనే రెగ్యులర్ చేయాలి, లేకుంటే అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండ్రాల రమేశ్, నాయకులు ఎస్డీ అలీం, బండారి శంకరయ్య, మొండయ్య, భూమయ్య, కనకవ్వ, రాజమల్లు, లింగయ్య, రాములు, రాజవీరు తదితరులు పాల్గొన్నారు.

ఓసీలకిచ్చిన హామీలు అమలు చేయాలి

- ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు రామారావు



మాట్లాడుతున్న రామారావు

కరీంనగర్: సీఎం కేసీఆర్ ఓసీలకిచ్చిన హామీలు తక్షణమే అమలుచేయాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ.. మరో ఐదునెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు రెడ్డి, వైశ్యకులాల ప్రత్యేక కార్పొరేషన్లు నెలాఖరులోపు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చేనెల అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించి, సెప్టెంబర్‌లో రాష్ట్ర రాజధాని శివార్లలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు పెండ్యాల రాంరెడ్డి, చెన్నమనేని పురుషోత్తమరావు, బుస్సా శ్రీనివాస్, జున్నూతుల రాజిరెడ్డి, జి.స్వామిరెడ్డి, దీపక్‌బాబు పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ

వేములవాడరూరల్: వేములవాడ మండలం మర్రిపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో వాహనాలు దెబ్బతిన్నాయి. రుద్రంగి నుంచి వేములవాడకు వస్తున్న కారు, వేములవాడ నుంచి రుద్రంగి వైపు వెళ్తున్న లారీ బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాలు దెబ్బతినగా ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదు. అసంపూర్తి పనులతో గతంలో కూడా ఈ బ్రిడ్జి వద్ద వేములవాడకు చెందిన ద్విచక్ర వాహనదారుడు కిందపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇప్పటికైనా పనులు వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తలాపున నీళ్లు.. నిండని చెరువులు

- పైన వరద కాలువ.. కింద ఎస్సారెస్పీ కెనాల్
- అయినా మెట్ట గ్రామాలకు అందని ఫలాలు
- పోరుబాటలో చొప్పదండి మండల అన్నదాతలు



గుమ్లాపూర్‌లో నీరు లేక వెలవెలబోతున్న పెద్ద చెరువు



గడ్డి, చెట్లతో నిండుతున్న చిన్న చెరువు

'కాళేశ్వరం నీళ్లు వస్తున్నాయంటే సంబురపడ్డాం. ఊరి తలాపు నుంచే పోతుంటే మాకూ వస్తాయని నమ్మినం. నాలుగేండ్లయినా మా ఊరికి మాత్రం రావడం లేదు. నాయకులందరూ వస్తాయని చెబుతున్నా.. చుక్కనీరందలే. రూ.10 కోట్లు ఖర్చు పెడితే ఊరు మునిగేన్ని నీళ్లు వచ్చే అవకాశం ఉన్నా, కాలువలు, గేట్లు, భూసేకరణ అంటూ జరగని పనులకు కొబ్బరికాయలు కొట్టారు. మాక చెరువులు నింపితే చాలు. ఆరువందల మీటర్ల దాక నీళ్లు ఎత్తిపోత్తున్నమని గొప్పలు చెప్పుకుంటాండ్రు. గీ ఆరు మీటర్ల ఎత్తు మీద గల చెరువులో నింపుడు సాధ్యమైతలేదా..?' అంటూ చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్, పరిసర గ్రామాల అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

– చొప్పదండి

అడియాశలేనా?

చొప్పదండి మండలం గుమ్లాపూర్, కాట్నపల్లి, సాంబయ్యపల్లి, మల్లన్నపల్లి, మంగళపల్లి, చిట్యాలపల్లి గ్రామాల్లో దశాబ్దాలుగా సాగునీటి కొరతకు పరిష్కారం దొరకడం లేదు. కాకతీయ కాలువకు ఎగువన, వరదకాలువకు దిగువన ఉన్న గ్రామాల్లోని రైతులు మెట్ట భూముల్లో వ్యవసాయం చేస్తూ మోడువారిపోయారు. ఏటా అప్పులు తెస్తు బావులను ఆదనపు లోతు తవ్వడం, చివరికి నీరు అడుగంటి పంటలు ఎండిపోవడం, పంటల దిగుబడి తగ్గడం, మధ్యలో ప్రకృతి వైపరీత్యాలు రావడంతో నష్టాల పాలయ్యారు. ఈ క్రమంలో గాయత్రి పంప్‌హౌజ్ ఒక వరంగా కనిపించింది. తమ కష్టాలు తీరుతాయని, చెరువులు నిండుతాయని ఆశించినా, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వారి ఆశలు అడియాశలే అయ్యాయి. గతంలో ఉరు ఉరంతా నాలుగు గంటల పాటు ప్రధాన రహదారిని దిగ్బంధించి, తమ అక్కసును వెల్లగక్కినా సాగునీటి ఆశలు నెరవేరలేదు. మరోసారి గోదావరి జలాల సాధనకు రైతులు ఆందోళన బాటకు సిద్ధం అవుతున్నారు.

లిఫ్ట్‌తో అయిదు గ్రామాలకు లబ్ధి

గుమ్లాపూర్ శివారుకు అనుకుని రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా గాయత్రి పంప్‌హౌజ్‌ను నిర్మించారు. మేడారం నుంచి అండర్ గ్రౌండ్ ద్వారా నంది పంప్‌హౌజ్ ద్వారా వచ్చే నీటిని వరద కాలువలోకి ఎత్తిపోస్తారు. లక్ష్మీపూర్ అండర్ టన్నెల్ నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న గుమ్లాపూర్ శివారు పిల్లగుట్ట వద్ద లిఫ్ట్‌ద్వారా నీటిని ఎత్తిపోస్తే గుమ్లాపూర్‌లోని పెద్ద చెరువు, చిన్న చెరువు, శనక్కుంట, కాట్నపల్లిలోని ఊరచెరువు ఇతర గొలుసుకట్టు చెరువులు నిండేందుకు అవకాశం ఉంది. సుమారు రూ.తొమ్మిది కోట్ల నిధులతో లిఫ్ట్ ఏర్పాటుచేస్తే ఆరు గ్రామాల్లోని వేలాది ఎకరాల సాగుచేస్తున్న రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆరేళ్ల క్రితం సాగునీటి శాఖ ఇంజినీర్లు ప్రతిపాదనలను సీఎంవో కార్యాలయానికి పంపించారు.

కాలువల ద్వారా రావని తెలిసినా

గుమ్లాపూర్, కాట్నపల్లి గ్రామాలకు మోతె కాలువల ద్వారా నీరు రావని తెలిసినా, అధికారులు, ప్రజా ప్రతినిధులు చెరువులు నిండుతాయని చెప్పడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుమ్లాపూర్ పెద్ద చెరువు గాయత్రి పంప్‌హౌజ్ కన్నా ఎత్తులో ఉందని గతంలోనే సర్వేచేసిన ఇంజినీరింగ్ అధికారులు చెప్పారని, ఇప్పుడు గాయత్రి పంప్‌హౌజ్ నుంచి వరదకాలువకు నీరువెళ్లి, మళ్లీ మోతె కాలువల ద్వారా గుమ్లాపూర్ చెరువులోకి నీరు వస్తాయని మభ్యపెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కిలోమీటరు దూరంలోని చెరువు నింపడానికి పది కిలోమీటర్లు నీటిని ముందుకు తీసుకువెళ్లి, పది కిలోమీటర్లు వెనక్కు తీసుకువచ్చే ప్రక్రియను రూపొందించడంపై రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. దశాబ్దాల తరువాత వచ్చే కాలువల కోసం తాము ఎదురుచూడటం లేదని, గ్రామంలోని చెరువులు నింపాలనే నినాదంతోనే ముందుకువెళ్లాలని సిద్ధమవుతున్నారు.

లిఫ్టు ద్వారా నింపాలి



గాయత్రి పంప్‌హౌజ్ ద్వారా లిఫ్టు ఏర్పాటు చేస్తే గుమ్లాపూర్ పెద్ద చెరువు ద్వారా గ్రామంలో మూడు చెరువులు నిండుతాయి. అయిదేళ్ల క్రితమే సర్వే చేసింద్రు. ఆరు గ్రామాల రైతుల ప్రయోజనం కోసం రూ.పది కోట్లు ఖర్చు పెడితే సరిపోతుంది. అవసరమైతే రైతులం ఒక ఏడాది రైతుబంధు కూడా సాయంగా అందిస్తాం. – మండల మల్లేశం, రైతు, గుమ్లాపూర్

మభ్యపెట్టడం తగదు



ఊరి కింది నుంచి, ఊరిపై నుంచి నీళ్లు తరలిపోతున్నాయి. పెద్ద చెరువుకు కిలోమీటరు దూరంలో ఉన్న గాయత్రి పంప్‌హౌజ్ నుంచి షానగర్ వరకు కాళేశ్వరం నీటిని తీసుకెళ్లి, మళ్లీ గుమ్లాపూర్ చెరువులు నింపుతామని చెప్పడం రైతులను మభ్యపెట్టడమే. ఇప్పటికైనా నిధులు కేటాయించి, చెరువులు నింపకపోతే పోరాటాలే శరణ్యం. – బొడిగె శేఖర్, రైతు, గుమ్లాపూర్

24 గంటల విద్యుత్ పేరిట మోసం

- పీసీసీ రాష్ట్ర కార్యదర్శి అంజన్‌కుమార్



లాగ్‌బుక్‌ను పరిశీలిస్తున్న అంజన్‌కుమార్

కరీంనగర్‌రూరల్: వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ మండలం నగునూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. సబ్‌స్టేషన్ లాగ్‌బుక్‌ను పరిశీలించి సిబ్బందితోపాటు రైతులను వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. లాగ్‌బుక్‌లో నమోదు చేసిన వివరాల ప్రకారం కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతోపాటు పలుమార్లు ట్రిప్ అయిందన్నారు. రోజుకు 10నుంచి 12గంటల విద్యుత్‌ను మాత్రమే సరఫరా చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వహయంలోనే సబ్‌స్టేషన్ నిర్మించి నగునూరు, జూబ్లీనగర్, వల్లంపహాడ్‌లకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ రైతు డిక్లరేషన్‌పై ముద్రించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిల్ల రాజు, నాయకులు బత్తిని శ్రీనివాస్, కోట రవి, సతీశ్, వసీం తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలకు ఉచిత విద్యుత్ అందించాలి



మాట్లాడుతున్న పున్నమాచారి

హుజూరాబాద్: కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న విశ్వకర్మలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు రాజమల్ల పున్నమాచారి కోరారు. సోమవారం పట్టణంలో చల్లూరి రఘుచారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విశ్వకర్మల కీలక పాత్ర పోషించారని తెలిపారు. కమ్మరి, వడ్రంగి, కంచరి, జీవశిల్పి, స్వర్ణకార, వెల్డింగ్, కార్పెంటర్, సిల్వర్‌లేత్ మిషన్ రంగాల వారికి ఉచిత విద్యుత్ అందిస్తే ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు. ప్రతీ మంగళవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు రావుల రమణాచారి, మండలాధ్యక్షుడు తాటికొండ శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శి నరసింహచారి, కోశాధికారి వేమునూరి రాజు, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న మహేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: గ్రామ పంచాయతీ కార్మికులు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 12రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర నాయకుడు బేతి మహేందర్ రెడ్డి విమర్శించారు. సోమవారం కరీంనగర్ రూరల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న దీక్షకు సంఘీభావం తెలిపారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ 11వ పీఆర్సీలో నిర్ణయించిన ప్రకారం జీపీ కార్మికులకు రూ.19,000 కనిష్ఠ వేతనంగా చెల్లించాలని, జీవో నంబరు 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంపు ఆపరేటర్లకు, ఎలక్ట్రీషియన్లకు, డ్రైవర్లకు, కారోబార్లకు, బిల్ కలెక్టర్లకు రూ.19,500 నిర్ణయించాలని, కారోబార్లను, బిల్ కలెక్టర్లను పంచాయతీ సహాయ కార్యదర్శిలుగా నియమించాలని డిమాండ్ చేశారు.

సింగరేణి రిటైర్డు ఉద్యోగి ఆత్మహత్య



దయ్యాల ఐలయ్య(ఫైల్)

కరీంనగర్‌రూరల్: ఇంట్లో నుంచి వెళ్లిపోయిన కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌కు చెందిన సింగరేణి రిటైర్డు ఉద్యోగి దయ్యాల ఐలయ్య(75) ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం సాయంత్రం మొగ్దుంపూర్ శివారులోని పూరేన్‌గుట్టప్రాంతంలోని వేపచెట్టుకు ఉరివేసుకున్న ఐలయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్డయిన ఐలయ్య ఈ నెల 9న ఇంటినుంచి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో వెతికినప్పటికీ అచూకీ లభించకపోవడంతో 11న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన కొడుకు కుమారస్వామి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం పూరేన్‌గుట్ట ప్రాంతంలోని వేపచెట్టుకు ఉరివేసుకున్న ఐలయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. బ్లూకోల్ట్స్ పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య కనుకమ్మ, కొడుకు కుమారస్వామి, కూతుర్లు అనిత, రాజేశ్వరి ఉన్నారు.

ఫోన్ చోరీ.. రూ.1.95 లక్షలు స్వాహా

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పాతబస్టాండ్‌లో ఫోన్ చోరీ చేసిన నిందితుడు ఏకంగా రూ.1.95 లక్షలు విత్‌డ్రా చేసుకున్న విషయంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన రత్నాకర్ సిరిసిల్లలో బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని కామారెడ్డి వెళ్లేందుకు సిరిసిల్ల పాతబస్టాండ్‌లో బస్సు ఎక్కాడు. జేబులో చూసుకునే సరికి అతడి ఫోన్ కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో అడిగినా లాభం లేకపోవడంతో ఫోన్ నంబర్ బ్లాక్ చేయడానికి ప్రయత్నించాడు. బ్యాంకు అకౌంట్స్ నిలుపుదల చేయడానికి ప్రయత్నం చేసినా మరుసటి రోజు ఆదివారం కావడంతో కుదరలేదు. మధ్యాహ్నం వరకు కొత్త సిమ్ తీసుకుని యాక్టివేషన్ కాగానే అతడి సెల్‌కు రూ.1.95 లక్షలు విత్‌డ్రా జరిగినట్లు మెస్సేజ్ వచ్చింది. అంతేకాదు గుంటూరు జిల్లాలో నిందితుడు ఓ ఆన్‌లైన్ సెంటర్‌లో రూ.50 వేలు తీసుకునే సమయంలో సెంటర్ నిర్వాహకుడికి అనుమానం వచ్చి ఆధార్ కావాలని అడిగాడు. అదే సమయంలో లింకు ఉన్న రత్నాకర్ నంబర్‌కు కాల్ చేశాడు. దీంతో తన ఫోన్ పోయిందని, అతడికి డబ్బు ఇవ్వవద్దని ప్రాధేయపడడంతో సెంటర్ నిర్వాహకుడు నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యాడు. కాగా బాధితుడు సోమవారం బ్యాంకుకు వెళ్లి ఖాతా నిలుపుదల చేయాలని అధికారులను కోరాడు. కానీ అప్పటికే లక్షల సొమ్ము పోయిందని, దీనిపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందుతానని బాధితుడు ఆవేదనతో తెలిపాడు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



మల్లయ్య మృతదేహం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని గుండన్నపల్లి గ్రామానికి చెందిన మేడుదుల మల్లయ్య (85) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై మహేందర్ సోమవారం రాత్రి తెలిపిన వివరాలు.. మల్లయ్య కాలు విరగడంతో కొంతకాలంగా మంచానికే పరిమితం అయ్యాడు. కాగా ఈ నెల 16న తన తండ్రి వద్దకు వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడని, మృతిపై అనుమానం ఉందని కుమారుడు మేడుదల ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఓ వ్యక్తి వీడియో వైరల్

మేడుదుల మల్లయ్య అనే వృద్ధుడి మృతిపై ఓ వ్యక్తి వీడియో వైరల్‌గా మారింది. రైతు బీమా డబ్బుల కోసమే వృద్ధుడిని హత్య చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో గండన్నపల్లి గ్రామంలో వృద్ధుడి మృతి చర్చనీయాంశంగా మారింది. ఈనేపథ్యంలో వేములవాడ రూరల్ సీఐ బన్సిలాల్ గ్రామంలో విచారణ చేపట్టారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య



పోచయ్య (ఫైల్)

ధర్మారం: మండలంలోని కానంపెల్లి గ్రామానికి చెందిన వేల్పుల పోచయ్య(60) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. పోచయ్య సింగరేణి కార్మికుడిగా పని చేసి, రెండేళ్ల క్రితం రిటైర్మెంట్ పొంది, స్వగ్రామం వచ్చాడు. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా భార్య 16 ఏళ్ల క్రితమే చనిపోయింది. జీవితంపై విరక్తి చెంది, ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోచయ్య చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి...

వేములవాడరూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వేములవాడరూరల్ మండలం జయవరంలో సోమవారం జరిగింది. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన దేవయ్య (48) 30 ఏళ్ల క్రితం అత్తగారిల్లు జయవరానికి ఇల్లరికం వచ్చి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడి ఒక్కగానొక్క కుమారుడు అనారోగ్యంతో మరణించడంతో మరదలి కుమారుడిని దత్తత తీసుకున్నాడు. అతను జల్సాలకు అలవాటుపడ్డాడు. ఎన్నిసార్లు చెప్పినా అతడిలో మార్పు రాకపోవడంతో పాటు నిమ్మపల్లిలో ఉన్న భూమిని అమ్మి డబ్బు తీసుకురావాలని దేవయ్యను వేధించేవాడు. మనోవేదన చెందిన దేవయ్య ఇంటి వద్ద ఉరేసుకున్నాడు. మృతుడి తమ్ముడు దప్పుల నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతుడికి భార్య ఉంది.

రూ.లక్ష అందించడంలో చేతులెత్తిసిన ప్రభుత్వం

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్



మాట్లాడుతున్న డాక్టర్ నగేశ్

వీణవంక: బీసీలకు రూ.లక్ష సాయం అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ ఆరోపించారు. ఈ నెల 15న నియోజకవర్గానికి 300మంది చొప్పున ఇస్తామని మంత్రి గంగుల కమలాకర్ చెప్పారని, ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదో మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. 5.38లక్షల మంది బీసీలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారని, నియోజకవర్గానికి 300మంది చొప్పున ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా దివాలా తీసిందని, అందుకే రూ.లక్ష ఆర్థికసాయం విడతలవారీగా ఇస్తామని చెబుతూ.. ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

జగిత్యాలలో వ్యభిచారం గుట్టు రట్టు

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణ శివారులోని అంతర్గాం రోడ్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరితోపాటు ముగ్గురు యువతులు, ఒక విటున్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నటేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం అంతర్గాం రోడ్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని పోలీసులకు పక్కా సమాచారం వచ్చింది. వెంటనే తనిఖీలు చేపట్టగా వ్యభిచారం నిర్వాహకులు, ముగ్గురు యువతులు, ఒక విటుడు పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెగడపల్లి(ధర్మపురి): వెంగళాయిపేటకు చెందిన ఆత్మకూరి స్వామి(52) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2న రాత్రి వెంగళాయిపేట ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న స్వామిని అదే గ్రామానికి చెందిన చెట్ల శ్రీనివాస్ బైక్‌పై వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడి, చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ స్వామి సోమవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

- ఒకే రోజు మూడిళ్లలో చోరీ



విచారణ చేస్తున్న సీఐ మొగిలి

గంభీరావుపేట(సిరిసిల్ల): తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలకేంద్రంలో సోమవారం ఒకే వీధిలో మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పిట్ల శ్రీమతి, ముత్తయ్యగారి శ్రీనివాస్, మహేష్ ఇళ్లలో చోరీలు జరిగాయి. ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి, ఎస్సై మహేష్ ఘటనా స్థలాలను పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టి, సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. శ్రీనివాస్ ఇంటిలో దాదాపు 13 తులాల బంగారం, 30 తులాల వెండి, శ్రీమతి ఇంటిలో హుండీ డబ్బులు, ఎలక్ట్రిక్ వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. దొంగతనాల నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వారం క్రితమే ప్రముఖ దైవ క్షేత్రం రామాలయం, ఆలయ అర్చకుడి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు.

35 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న బియ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): రేషన్ బియ్యం అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరస దాడులు చేస్తూనే ఉన్నారు. మండలంలోని మోహినికుంట నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రానికి తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ ఎస్సై మారుతి ఆధ్వర్యంలో సోమవారం వేకువజామున పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై తెలిపిన వివరాలు.. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో మోహినికుంట నుంచి సిద్దిపేటకు టీఎస్01యూసీ 0027 నంబర్ గల అశోక్ లెల్యాండ్ వాహనంలో పీడీఎస్ బియ్యం సిద్దిపేటకు తరలిస్తుండగా పట్టుకున్నారు. సిద్దిపేటకు చెందిన కొండాపూర్ శ్రీనివాస్ మోహినికుంటకు చెందిన కడమంచి కనుకయ్య ఇంటి నుంచి 35 క్వింటాళ్ల బియ్యాన్ని వాహనంలో తరలిస్తున్నాడు. బియ్యం అక్రమంగా సేకరించిన కడమంచి కనుకయ్య, కొనుగోలు చేసిన కొండాపూర్ శ్రీనివాస్, డ్రైవర్ ఫరూక్, వాహనం ఓనర్ సిద్దిపేటకు చెందిన సాయి వివరాలను, బియ్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరిగిందని ఎస్సై తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి, పీసీలు శ్రీనివాస్, మహిపాల్, అక్షర్ తదితరులున్నారు.

మృత్యువే గెలిచింది

- 14 రోజులపాటు మృత్యువుతో పోరాటం
- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి 14 రోజులపాటు మృత్యువుతో పోరాడి సోమవారం ప్రాణాలు వదిలాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన పెంజర్ల శంకర్ ఈనెల 4న సొంత పని నిమిత్తం ఎల్లారెడ్డిపేటకు వస్తుండగా, మార్గమధ్యలో గేదె అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తీసుకెళ్లారు. అక్కడి ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు వెంటనే తలకు ఆపరేషన్ చేశారు. 12 రోజులపాటు అక్కడే చికిత్స పొందాడు. అయితే పరిస్థితి విషమంగా మారడంతో రెండు రోజుల క్రితం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీలో చికిత్స పొందుతూ సోమవారం ప్రాణాలు వదిలాడు. కుటుంబ సభ్యులు దాదాపు రూ.7లక్షల వరకు ఖర్చు చేసినా ప్రాణాలు దక్కలేదు. మృతుడి కొడుకు రాకేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు.

క్లుప్తంగా

బావుపేటను మండలంగా ప్రకటించాలి


దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని బావుపేటను మండల కేంద్రంగా ప్రకటించాలని జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం బావుపేటలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ బావుపేటను మండల కేంద్రంగా ప్రకటించాలని అనేక సార్లు డిమాండ్ చేస్తూ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం సమర్పించామన్నారు. కొత్తపల్లి మండలంలో ఆసిఫ్‌నగర్, నాగులమల్యాల, ఖాజీపూర్, ఎలగందల్, కమాన్‌పూర్, మల్కాపూర్, చింతకుంట గ్రామాలు ఉన్నాయన్నారు. కొత్తపల్లి గ్రామం మున్సిపాలిటీగా మారినందున బావుపేట గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలోని మేధావులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు ప్రలజందరి సంపూర్ణ మద్దతు ఉందని తెలిపారు.

బీసీలకు ఎక్కువ టికెట్లు కేటాయించాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నాయకులకు ఎక్కువ శాతం టికెట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాయితోజు బ్రహ్మచారి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎక్కువ శాతం జనాభా ఉన్న బీసీలకు ప్రభుత్వం సీట్లు తక్కువ కేటాయించడం సరైంది కాదని, ఈసారి 60 శాతం సీట్లు కేటాయించాలని పేర్కొన్నారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తే ఓటుతో రాజకీయ నాయకులకు తగిన గుణపాఠం చెప్పడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు బీసీలను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నాయని, అలాంటి ఆలోచనలు మానుకోవాలని, బీసీలకు టికెట్లు కేటాయిస్తే అధిక మెజారిటీతో గెలిచి బంగారు తెలంగాణకు బాటలు వేస్తారని పేర్కొన్నారు.

నూతన నియామకం


నియామకపత్రం అందుకుంటున్న రణధీర్ సింగ్

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఆమ్ ఆద్మీ పార్టీ యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన రణధీర్ సింగ్‌ను నియమించినట్లు రాష్ట్ర ఇన్‌చార్జి కన్వీనర్ దిద్ది సుధాకర్ తెలిపారు. పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రణధీర్ సింగ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము, డాక్టర్ అన్సారీ, స్టేట్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక సలహాదారుగా బాలసురేందర్


నియామక పత్రం అందుకుంటున్న బాలసురేందర్

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర సలహాదారుగా శ్రీరాముల బాలసురేందర్‌ను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానాల కిషన్ నియమించారు. ఐక్యవేదికలో గత కొన్ని సంవత్సరాలుగా నాయీబ్రాహ్మణుల అభివృద్ధి కోసం పనిచేస్తూ రాష్ట్ర సంఘంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నందుకు నియమించినట్లు పేర్కొన్నారు. బాలసురేందర్‌ను సంఘం నాయకులు నర్సయ్య, వెంకటస్వామి, కిషన్, శంకర్, రమేష్, శంకర్, విద్యాసాగర్ తదితరులు అభినందించారు.

సెల్‌ఫోన్లు అందించిన పోలీసులు

కరీంనగర్‌రూరల్: పోయిన రెండు సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కరీంనగర్ రూరల్ పోలీసులు సోమవారం బాధితులకు అప్పగించారు. జగిత్యాల జిల్లా మేడిపల్లికి చెందిన ఆవునూరి ధర్మేందర్, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన షేక్ సలాం రూ.60వేల విలువైన సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించి అందించారు. ఎవరైనా సెల్‌ఫోన్లను పోగొట్టుకుంటే వెంటనే పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సీఐ ప్రదీప్‌కుమార్ సూచించారు.

కదిలిస్తున్న 'ఖరీదైన జైళ్లు'

- అపార్ట్‌మెంట్ జీవితమే ఇతివృత్తం
- 2020లో తొలి ప్రదర్శన
- దూరమవుతున్న అనుబంధాలకు అద్దం పడుతున్న నాటిక
- చైతన్య కళాభారతి, కరీంనగర్ నాటక సమాజం ఆధ్వర్యంలో రూపకల్పన
- వరిస్తున్న అవార్డులు, పురస్కారాలు


నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

కరీంనగర్‌కల్చరల్: వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్మార్ట్‌ఫోన్లు, సోషల్, వెండి తెర, బుల్లి తెర ప్రేక్షకులకు శాసిస్తున్న ఈ నవీనయుగంలో నాటక రంగానికి ఆదరణ ఏ మాత్రం తగ్గలేదని నిరూపిస్తుంది 'ఖరీదైన జైళ్లు' నాటిక. సమాజాన్ని కదిలిస్తూ.. జన జీవన హృదయాలను స్పందింపచేస్తూ.. అపార్ట్‌మెంట్ జీవితాల్లో తగ్గిన మానవ సంబంధాలు, విలువలు నశిస్తున్నాయని, మానవతా విలువలు, సంబంధాల యొక్క ప్రాముఖ్యత వివరిస్తూ అపార్ట్‌మెంట్‌లు కూడా ఒక ఖరీదైన జైళ్ల లాంటివని చక్కని సందేశాత్మకమైన నాటికగా తనదైన ముద్ర వేసుకుంది. చైతన్య కళాభారతి, కరీంనగర్ నాటక సమాజం ఆధ్వర్యంలో 'ఖరీదైన జైళ్లు' నాటికను 2020 ఫిబ్రవరిలో కరీంనగర్‌లోని కళాభారతిలో మొదటి ప్రదర్శన చేశారు. ఇదే నెలలో తిరుపతిలోని అభినయ ఆర్ట్స్ లో ప్రదర్శించగా ఉత్తమ సహాయ నటిగా పురస్కారం అందుకుంది. అపార్ట్‌మెంట్‌లోని జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపిన ఈ నాటిక అందరినీ ఆలోచింపజేసింది. విమర్శకుల చేత కూడా ప్రశంసలు అందుకుంటుంది. ఇప్పటివరకు పలు చోట్ల ప్రదర్శించిన నాటిక పలు పురస్కారాలు, అవార్డులను సొంతం చేసుకుంది.

నాటిక కథా సంగ్రహం

మనిషి అంటే కాళ్లు, చేతులు, కళ్లు, నోరు.. ఇలా అవయవాలు కాదు. అవి జంతువులకు కూడా ఉంటాయి. జంతువుల నుంచి మనిషిని వేరు చేసేది మనస్సు. అది దేవుడు మనిషికి మాత్రమే ఇచ్చాడు. మనిషిగా పుట్టిన కుడా చాలా మంది ఇంకా అవయవాలతోనే బతికేస్తున్నారు అన్న ఇతివృత్తమే 'ఖరీదైన జైళ్లు' నాటిక. ఈ నాటికను మూలకథ పి.వెంకటేశ్వరరావు, నాటకీరణ, రచన పరమాత్ముని శివరాం, దర్శకత్వం మంచాల రమేశ్ వ్యవహరించగా, సంగీతం సురభి నాగరాజు, ఆహార్యం, లైటింగ్, కేదారి నాటు, ఆర్టిస్టులుగా కె.సత్యనారాయణ, పరమాత్ముని శివరాం, మంచాల రమేశ్, శోభారాణి, గద్దె ఉదయ్‌కుమార్, నాగరాణిలు నటించారు.

ప్రదర్శనలు.. పురస్కారాలు

- మొదటి ప్రదర్శన 2020 ఫిబ్రవరిలో కరీంనగర్‌లోని కళాభారతిలో ప్రదర్శించారు.
- 2020 నుంచి 2022 వరకు కరోనా కారణంగా ఉభయ రాష్ట్రాల్లో 25 ప్రదర్శనలు రద్దయ్యాయి.
- 2021 ఏప్రిల్‌లో కళాభారతిలో కీ.శే. పైడా కౌశిక్ జాతీయస్థాయి నాటికల పోటీలు ప్రదర్శించగా నాలుగు బహుమతులు సొంతం చేసుకుంది. ఇందులో ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ రచన, ఉత్తమ సంగీతం, ఉత్తమ సహాయ నటుడు.
- 2023 మేలో తెలంగాణ కళాకారుల ఐక్యవేదిక వరంగల్ ఉభయ రాష్ట్రాల నాటకల పోటీల్లో ఉత్తమ జ్యూరీ ప్రదర్శన అవార్డు అందుకున్నారు.
- 2023 జూలైలో అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ కాకినాడ వారి జాతీయ స్థాయి నాటక పోటీల్లో నాలుగు బహుమతులు అందుకుంది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, ఉత్తమ సహాయనటుడు, ఉత్తమ క్యారెక్టర్ నటి, ఉత్తమ లైటింగ్‌లకు అవార్డు సొంతం చేసుకుంది.
- నాటకం ప్రదర్శించిన ప్రతీ చోట ఆహుతులను ఆలోచింపజేసింది.

ప్రదర్శించిన చోట ప్రశంసలు



ఖరీదైన జైళ్లు నాటిక నా దర్శకత్వంలో 2020లో మొదలు పెట్టా. రెండు ప్రదర్శనలు అయిన తర్వాత కరోనా కారణంగా ఉభయ రాష్ట్రాల్లో 25 ప్రదర్శనలు రద్దయినాయి. ఆ తర్వాత చీకటి పువ్వు నాటికతో ఈ ఖరీదైన జైళ్లు నాటిక ప్రేక్షకులకు దూరమైంది మళ్లీ ఇప్పుడు ఈ నాటిక ఉభయ రాష్ట్రాల్లో ప్రదర్శించబోతున్నాం. ప్రదర్శించిన ప్రతీచోట అద్భుతంగా ఉందని అందరూ అభినందిస్తున్నారు. ఒక దర్శకుడిగా చాలా సంతోషంగా ఉంది.

– మంచాల రమేశ్, దర్శకుడు

ఆదరణ మరిచిపోలేనిది



నేటి సమాజంలో అపార్ట్‌మెంట్ కల్చర్ విస్తరిస్తున్న తీరు, అందులో నివాసముంటున్న వారు పడుతున్న అవస్థలు కళ్లకు కట్టినట్టుగా ఈ నాటికలో ప్రేక్షకులకు చూపించాం. ప్రేక్షకులు ఎంతో ఆదరాభిమానాలతో ఆదరిస్తున్నారు. వారి ఆదరణ ఎప్పటికీ మర్చిపోలేనటువంటిది. నాటిక చూసిన కొంతమంది ప్రేక్షకులు వారు పడుతున్న అవస్థలను తమవిగానే భావించి మాతో కన్నీళ్ల పర్యంతం అయ్యారు. ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు తీసుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చింది.

– కొత్తకొండ సత్యనారాయణ, రంగస్థల నటుడు

నేటి సమాజ స్థితిగతులే..



ఒక్కప్పుడు ఒక్క ఊరే కుటుంబంగా బతికే వారు. కానీ నేటి మనిషి మానవత్వం లేకుండా ఉండటంతో మానవీయ విలువలు నశించిపోయాయి, రాబందులా ఒక్కరిని ఒక్కరు పీక్కతింటున్న నిజమైన దర్పణమే ఈ ఖరీదైన జైళ్లు నాటిక.

– ఉదయ్, రంగస్థల నటుడు

నగరంలో నేడు

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్ స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేకుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో ఆరెపల్లి, రేకుర్తి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్‌రూరల్ ఏడీఈ కె.రాజు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చంద్రపురికాలనీలో డ్రెయినేజీలు నిర్మించాలి


చంద్రపురికాలనీలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: నగరంలోని 1వ డివిజన్ చంద్రపురికాలనీలో సరైన డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. సోమవారం చంద్రపురికాలనీలో పర్యటించి మాట్లాడారు. స్మార్ట్‌సిటీగా ఎంపికైన కరీంనగర్‌లో విలీన గ్రామాలను విస్మరించారని అన్నారు. బడుగు బలహీన వర్గాల పేదలు అధికంగా ఉన్న డివిజన్లను అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ సౌకర్యాల కల్పనలో లేదన్నారు. గతంలో టెంపరరీగా ఉన్న డ్రెయినేజీ నీరు రైల్వే స్థలంలోకి వెళ్లేదని, రైల్వే అధికారులు మురుగు కాలువలకు అడ్డుకట్ట వేయడంతో ఆ నీరంతా పేద ప్రజల ఇళ్లలోకి వచ్చి దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు. దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయని వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని అన్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వీడి రెండు రోజుల్లోగా తాత్కాలికంగా మురుగునీరు బయటకు వెళ్లేలా కృషి చేయాలని, అనంతరం శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు పున్నం రవి, కొంపల్లి సాగర్, చంద్రపురి కాలనీవాసులు జి.సుధీర్, కిషన్, శంకరయ్య, వజ్రమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, రాము, శారద, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కరీంనగర్‌రూరల్: గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు చెల్లించి పర్మినెంట్ చేయాలని తెలంగాణ జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జనగామ నర్సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ పేరిట ఒకే వ్యక్తితో పలు రకాల పనులు చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 12 రోజుల నుంచి డిమాండ్ల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం ప్రతినిధులు అంజిరెడ్డి, సంపత్, శంకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: వైఎస్సార్‌టీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలో ఇంటింటా వైఎస్సార్‌టీపీ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేష్ ఆధ్వర్యంలో టవర్‌సర్కిల్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు శివరాం, సయ్యద్‌రియాజుద్దీన్, సునీత, ఊకంటి రవీందర్ రెడ్డి, కుమారస్వామి, నందిరెడ్డి, ప్రేమలత, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ



షాకొస్తుంది.. స్పందించండి

నగరంలోని 35వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుకొని ఉన్న ఇనుప విద్యుత్ స్తంభంకు కరెంట్ షాక్ కొడుతోంది. స్థానికులు ఎన్నిసార్లు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరగక ముందే ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

సామాజిక ఇంకుడు గుంతలు

- గ్రామానికి ఐదు చొప్పున నిర్మాణం
- స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్‌లో మంజూరు


ఫకీర్‌పేటలో నిర్మించిన కమ్యూనిటీ ఇంకుడుగుంత

కరీంనగర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వానాకాలంలో వరదనీరు రహదారులపై నిల్వ ఉండకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇంకుడుగుంతల నిర్మాణంపై దృష్టి సారించింది. స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా డ్రైనేజీలకు ఇరువైపులా ఇంకుడుగుంతలతో పాటు కమ్యూనిటీ ఇంకుడుగుంతలను గ్రామాల వారీగా మంజూరు చేసింది. ఒక్కో గ్రామానికి ఐదు చొప్పున కమ్యూనిటీ ఇంకుడుగుంతలు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. గతంలో ఇంటి ఆవరణలో ఇంకుడుగుంతలు నిర్మించగా ప్రస్తుతం డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాల్లో నిర్మిస్తున్నారు. స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు కోసం అధికారులు గ్రామాల్లో సర్వే చేస్తున్న దృష్ట్యా ఇంకుడుగుంతల నిర్మాణాన్ని వేగవంతం చేశారు.

గ్రామానికి ఐదు కమ్యూనిటీ ఇంకుడుగుంతలు

గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో మురుగునీరు నిలువకుండా ఉండేందుకు పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో డ్రైనేజీ, కమ్యూనిటీ ఇంకుడుగుంతలు నిర్మిస్తున్నారు. కరీంనగర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో కమ్యూనిటీ ఇంకుడుగుంతలు 42, డ్రైనేజీ ఇంకుడుగుంతలు 36 యుద్ధప్రాతిపదికన నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల్లో స్థలాలు గుర్తించి ఎస్టిమెట్ రూపొందించారు. కమ్యూనిటీ ఇంకుడుగుంత నిర్మాణానికి రూ.15వేలు, డ్రైనేజీ ఇంకుడుగుంతల్లో మొదటిసైజుకు రూ. 40వేలు, రెండో సైజు నిర్మాణానికి రూ.80 వేలు చెల్లిస్తారు. ఇప్పటివరకు డ్రైనేజీ ఇంకుడుగుంతలు మొత్తం 36 మంజూరు కాగా ఫకీర్‌పేట, చెర్లభూత్కూర్, ఇరుకుల్ల గ్రామాల్లో మూడు ఇంకుడు గుంతలు నిర్మించగా ఇంకా 19 గుంతల నిర్మాణం ప్రారంభించారు. కమ్యూనిటీ ఇంకుడుగుంతలు 42 మంజూరు కాగా తాహెర్‌కొండాపూర్, బహదూర్‌ఖాన్‌పేట, ఫకీర్‌పేట, ఎలబోతారంలో నాలుగు పూర్తికాగా ఇంకా 14గుంతల నిర్మాణపు పనులను ప్రారంభించినట్లు ఉపాధిహామీ ఏపీవో శోభారాణి తెలిపారు.

భూగర్భ జలాలు పెరుగుతాయి



ఇంకుడుగుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయి. డ్రైనేజీ, కమ్యూనిటీ ఇంకుడుగుంతల నిర్మాణంతో ఎన్నో లాభాలున్నాయి. ప్రస్తుతం డ్రైనేజీ ఇంకుడుగుంత నిర్మాణం పూర్తిచేశాం, త్వరలో కమ్యూనిటీ ఇంకుడుగుంత నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.

– దబ్బెట రమణారెడ్డి, సర్పంచ్, చెర్లభూత్కూర్

యుద్ధప్రాతిపదికన నిర్మాణం



గ్రామాల్లో డ్రైనేజీ, కమ్యూనిటీ ఇంకుడుగుంతల నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన నడుస్తున్నాయి. ఇప్పటివరకు మొత్తం 7 డ్రైనేజీ, కమ్యూనిటీ గుంతల నిర్మాణం పూర్తికాగా మిగితావి ప్రగతిలో ఉన్నాయి. త్వరలోనే మంజూరైన ఇంకుడుగుంతల నిర్మాణం పూర్తి చేస్తాం. గ్రామీణ ప్రజలకు ఇంకుడుగుంతలపై అవగాహన కల్పించాం.

– సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్

కార్మికుల సమ్మెతో డ్రైవర్‌గా సర్పంచ్


ట్రాక్టర్ నడుపుతున్న సర్పంచ్ రమణారెడ్డి

కరీంనగర్‌రూరల్: పంచాయతీ కార్మికులు గత 12 రోజుల నుంచి సమ్మె చేస్తుండటంతో గ్రామాల్లోని పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాల్లో అత్యవసరమైన తాగునీటి సరఫరా పనులు మాత్రమే కార్మికులు చేస్తుండగా మిగతా పనులను ప్రైవేట్ వ్యక్తులతో చేయిస్తున్నారు. సోమవారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో పంచాయతీ డ్రైవర్ సమ్మెలో పాల్గొనడంతో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా మారాడు. ఉపాధికూలీల సాయంతో నర్సరీలోని హరితహారం మొక్కలను నాటేందుకు తరలించాడు.

పల్లెవెలుగు టౌన్ బస్‌పాస్

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ ప్రయాణికులకు పల్లెవెలుగు టౌన్ బస్‌పాస్ సౌకర్యం కల్పించింది. జిల్లా కేంద్రం పరిధిలోని 10కిలోమీటర్ల వరకు పల్లెవెలుగు టౌన్ బస్‌పాస్ ఉపయోగపడుతుంది. రూ.800 ఈ పాస్‌తో పల్లెవెలుగు బస్సుల్లో 10కిలోమీటర్ల పరిధిలో నెలరోజుల పాటు అపరిమిత ప్రయాణం చేయవచ్చు, కరీంనగర్‌లోని బస్‌పాస్ కౌంట ర్ నుంచి ఈ పాస్ పొందాల్సి ఉంటుంది. వివరాలకు కరీంనగర్ 1, 2 డిపో మేనేజర్లు ప్రణీత్ 9959 225920, మల్లయ్య 9959225921లను సంప్రదించాలని ఆర్ఎం ఎస్.సుచరిత సూచించారు.

రోడ్డుపై వరదనీటితో ప్రమాదం


దుబ్బపల్లి మూలమలుపు వద్ద..


చెర్లభూత్కూర్‌లో మూలమలుపు వద్ద..


సబ్‌స్టేషన్ ఎదుట..

కరీంనగర్ మండలం మొగ్ధుంపూర్–నగునూరు రోడ్డు వరద నీటితో ప్రమాదకరంగా మారింది. రోడ్డు మూలమలుపుల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండటంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు చెర్లభూత్కూర్ మూలమలుపు, సబ్‌స్టేషన్ ఎదుట, దుబ్బపల్లి మూలమలుపువద్ద పెద్ద ఎత్తున నీరు నిలిచింది. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డుపై ఏర్పడిన గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు పడిపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుపై వరదనీటి నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– కరీంనగర్‌రూరల్

కాలేజీల్లో పెరిగిన కటాఫ్

- కొత్తగా అందుబాటులో 14,565 కంప్యూటర్ కోర్సు సీట్లు
- కోరుకున్న కాలేజీలో సీఎస్ఈ సీటు దక్కించుకున్న విద్యార్థులు
- రెండో విడత కౌన్సెలింగ్‌లో జాగ్రత్తగా ఆప్షన్లు ఇస్తే కోరుకున్న సీటు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు పెరగడం ఈసారి విద్యార్థులకు కలిసి వచ్చింది. అన్ని కాలేజీల్లోనూ కటాఫ్ పెరిగింది. చాలామంది కోరుకున్న కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ సీటు దక్కించుకోగలిగారు. మొత్తం భర్తీ అయిన సీట్లలో 62.5% కంప్యూటర్ కోర్సులవే ఉన్నాయి. గత ఏడాది (2022) తొలి విడత కౌన్సెలింగ్‌లో జేఎన్‌టీయూహెచ్ (సీఎస్ఈ)లో బాలికలకు 422 ర్యాంకు వరకే సీటు వచ్చింది. ఈసారి బాలురకు 813వ ర్యాంకు వరకూ, బాలికలకైతే 962 ర్యాంకు వరకూ ఓపెన్ కేటగిరీలో సీటు వచ్చింది. పేరున్న ప్రైవేటు కాలేజీల్లో గత సంవత్సరం గరిష్టంగా 3 వేల లోపు ర్యాంకు వరకే సీటు వస్తే, ఈసారి ర్యాంకు 4 వేలు దాటినా సీట్లు వచ్చాయి. కొత్తగా కంప్యూటర్ కోర్సులు అందుబాటులోకి రావడంతో ఈ ఏడాది అదనంగా 7,635 సీట్లు మంజూరయ్యాయి. కొన్నేళ్లుగా డిమాండ్ లేని సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో 6,930 సీట్లను కాలేజీలు రద్దు చేసుకున్నాయి. వీటి స్థానంలో విద్యార్థుల నుంచి డిమాండ్ ఉన్న కంప్యూటర్ కోర్సు సీట్లు పెంచుకున్నాయి. ఫలితంగా ఈ ఏడాది మొత్తం 14,565 కంప్యూటర్ కోర్సు సీట్లు కొత్తగా అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. కాగా ఇందులో 10 వేలకు పైగా కన్వీనర్ కోటాలో ఉన్నాయి.

రెండో దశలోనూ మంచి చాన్స్!

తొలిదశ కౌన్సెలింగ్‌ను పరిశీలించిన విద్యార్థులు రెండో దశపై ఆశలు పెంచుకుంటున్నారు. ఈ దశలో కూడా కటాఫ్ మరింత పెరిగే వీలుందని భావిస్తున్నారు. ఈ ఏడాది 1,56,879 మంది ఎంసెట్ అర్హత సాధించారు. వీరిలో 76,821 మంది తొలి విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్నా 75,708 మంది మాత్రమే ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 70,665 మందికి సీట్ల కేటాయింపు జరిగింది. నిజానికి ఇందులో వెయ్యి లోపు ర్యాంకర్లు జేఈఈలోనూ ర్యాంకులు పొంది ఉండే వీలుంది. జోసా ఆరవ రౌండ్ కౌన్సెలింగ్ త్వరలో చేపట్టే వీలుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎంసెట్‌లో సీటు వచ్చిన వాళ్లు ఎన్ఐటీల్లో సీట్లు వస్తే వాటిల్లో చేరే వీలుంది. కొంతమంది ఇతర రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్తారు. మరికొంత మంది డీమ్డ్ యూనివర్సిటీల్లో చేరతారు. మొత్తం మీద ఎంసెట్ తొలి రౌండ్‌లో సీట్లు వచ్చిన వారిలో 5 వేల మంది వరకూ రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రెండో రౌండ్‌లో జాగ్రత్తగా ఆప్షన్లు ఇస్తే కోరుకున్న బ్రాంచీలో, కాలేజీలో సీటు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తగా పరిశీలించి ఆప్షన్ ఇవ్వాలి

రెండో దశ ఎంసెట్ కౌన్సెలింగ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలి. విద్యార్థి తనకు వచ్చిన ర్యాంకును దృష్టిలో పెట్టుకుని ఆప్షన్లలో ప్రాధాన్యత నిర్ణయించుకోవాలి. దీనికన్నా ముందు.. తాను కోరుకునే కాలేజీలో తొలిదశలో ఏయే ర్యాంకులకు సీట్లు వచ్చాయి? నిట్ వంటి జాతీయ కాలేజీలకు ఏయే ర్యాంకర్ల వరకూ వెళ్లే చాన్స్ ఉంది? అనే దానిపై కొంత కసరత్తు చేయాలి. గుడ్డిగా ఆప్షన్లు ఇవ్వకుండా, అన్నీ పరిశీలించి ఇస్తే కోరుకున్న బ్రాంచీ, కాలేజీ దక్కడం ఖాయం.

– ఎంఎస్ రావు (గణిత శాస్త్ర అధ్యాపకుడు)

తొలి దశ కౌన్సెలింగ్‌లో ప్రధాన కాలేజీల్లో ఈ ఏడాది కటాఫ్ ర్యాంకులు ఈ విధంగా ఉన్నాయి...

యాజమాన్యం		ఓపెన్	బీసీ-ఏ	బీసీ-బీ	బీసీ-సీ	బీసీ-డీ	బీసీ-ఈ	ఎస్సీ	ఎస్టీ
ఓయూ-సీఎస్ఈ	బాలురు	1391	3918	1804	5687	1912	2788	6101	7349
	బాలికలు	1598	5524	2284	-------	2215	1900	7136	8414
సీఎస్ఈ (ఏఐ)	బాలురు	2848	6195	3798	19380	4842	4790	10923	11076
	బాలికలు	2877	4328	3901	-------	4724	5987	13355	13947
ఈసీఈ	బాలురు	3623	8934	6822	-------	6248	-------	14626	15567
	బాలికలు	4436	10084	6855	-------	6337	5447	15561	18188
జేఎన్‌టీయూ	బాలురు	813	1579	1245	-------	1199	1886	4013	4534
సీఎస్ఈ	బాలికలు	962	2290	1028	-------	1579	-------	6753	6196
సీఎస్ఈ-ఏఐ	బాలురు	1359	3501	2131	-------	2399	4692	8932	8547
	బాలికలు	1915	3975	2232	-------	2885	4478	9572	10293
సీబీఐటీ	బాలురు	1478	4509	2246	6314	2296	3014	861	11217
	బాలికలు	1903	5314	2198	-------	2695	3867	11527	12687
వాసవీ సీఎస్ఈ	బాలురు	2405	7050	3008	12034	3837	6072	12291	15812
	బాలికలు	2266	6968	3907	-------	3648	6916	14525	16040
వీఎన్ఆర్ విజ్ఞాన	బాలురు	1712	4952	2636	3099	2636	4773	11919	14598
జ్యోతి-సీఎస్ఈ	బాలికలు	1935	4309	2683	5242	2755	4924	11642	18027
కేఎంఐటీ-సీఎస్ఈ	బాలురు	5120	16102	7260	20337	7654	10730	32950	30728
	బాలికలు	5682	21945	8948	28661	9125	15978	33023	55150
గోకరాజు-సీఎస్ఈ	బాలురు	4014	11077	7228	25132	6399	9195	22605	26200
	బాలికలు	5015	14331	7789	23320	7589	11614	21286	27220
నారాయణమ్మ-సీఎస్ఈ	బాలికలు	4634	13033	7004	28674	7446	13239	25241	27323

రాష్ట్రంలో తగ్గిన పేదరికం

13.18 % నుంచి 5.88% తగ్గుదల

- 27.61 లక్షల మందికి పేదరికం నుంచి విముక్తి
- కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 16.59% పేదలు
- అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో పేదరికంలో ఉన్నది 2.17% మందే
- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గత కొన్నేళ్లలో పేదరికం రికార్డు స్థాయిలో తగ్గిందని నీతి ఆయోగ్ వెల్లడించింది. 2015–16 నుంచి 2019–21 మధ్య దేశవ్యాప్తంగా 13.5 కోట్ల మంది బహుముఖీయ పేదరికం నుంచి బయటపడ్డట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా పేదల సంఖ్య 24.85% నుంచి 14.96%కి తగ్గిందని పేర్కొంది. ఇదే కాలానికి తెలంగాణలో 27,61,201 మంది, ఏపీలో 30,19,718 మంది ప్రజలు బహుముఖీయ పేదరికం నుంచి బయటపడ్డట్లు వివరించింది. ఈ మేరకు 'నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్: ఎ ప్రోగ్రెస్ రివ్యూ 2023' పేరిట నీతి ఆయోగ్ సోమవారం ఢిల్లీలో నివేదిక విడుదల చేసింది. నీతిఆయోగ్ సభ్యులు డాక్టర్ వి.కె. పాల్, డాక్టర్ అరవింద్ వీరమణి, నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆ సంస్థ వైస్ చైర్మన్ సుమన్ బేరీ నివేదికను విడుదల చేశారు.

గ్రామాల్లో ఎక్కువగా పేదరికం తగ్గుదల

ఈ నివేదిక ప్రకారం తెలంగాణలో 2015–16 నాటికి 13.18 శాతం మంది పేదలు ఉండగా 2019–21 నాటికి వారి సంఖ్య 5.88%కి తగ్గింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 19.51% నుంచి 7.51% మంది, పట్టణ ప్రాంతాల్లో 4.92% నుంచి 2.73% మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. జాతీయ బహుముఖీయ పేదరిక సూచీ (ఎంపీఐ)లోని విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాల వంటి 12 అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు 2019–21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) ఆధారంగా నీతి ఆయోగ్ ఈ నివేదికను రూపొందించింది. తెలంగాణలో అత్యధికంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16.59%, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో 2.17% మంది పేదలు ఉన్నారు.

తెలంగాణలో ఎంపీఐ సూచికలు :

అంశం	2015-16	2019-21
1) పోషకాహారం లభించని వారు	31.09%	28.35%
2) కౌమార, పిల్లల మరణాలు	1.38%	1.15%
3) వైద్యం అందని బాలింతలు	10.87%	13.17%
4) పాఠశాలలకు వెళ్లని విద్యార్థులు	2.10%	1.35%
5) వంటచెరకు దొరకని వారు	31.67%	7.93%
6) మరుగుదొడ్లు లేని వారు	49.01%	24.41%
7) మంచినీరు లభ్యతలేని వారు	10.80%	3.36%
8) విద్యుత్ సదుపాయంలేని వారు	1.23%	0.44%
9) సొంత ఇల్లు లేని వారు	25.54%	20.49%
10) కనీస ఆస్తి లేని వారు	12.79%	8.51%
11) బ్యాంకు ఖాతా లేని వారు	7.46%	2.74%
12) పాఠశాల విద్య అందని వారు	15.83%	14.56%

తెలంగాణ జిల్లాల్లో పేదల జనాభా శాతం పరిస్థితి

జిల్లా	పేదల జనాభా శాతం (2019-21)	(2015-16)
ఆసిఫాబాద్	16.59%	-------
జోగులాంబ గద్వాల్	15.37%	-------
ఆదిలాబాద్	14.21%	27.12%
వికారాబాద్	12.50%	-------
కామారెడ్డి	11.90%	-------
మహబూబ్‌నగర్	10.27%	24.72%
మెదక్	9.34%	17.87%
వనపర్తి	8.86%	-------
నిర్మల్	7.14%	-------
సంగారెడ్డి	7.09%	-------
నిజామాబాద్	6.76%	21.06%
మహబూబాబాద్	6.45%	-------
వరంగల్ రూరల్	6.45%	-------
జయశంకర్ భూపాలపల్లి	6.33%	-------
నాగర్‌కర్నూల్	5.95%	-------
జగిత్యాల	4.77%	-------
మంచిర్యాల	4.43%	-------
నల్గొండ	4.40%	13.35%
భద్రాద్రి కొత్తగూడెం	4.33%	-------
యాదాద్రి భువనగిరి	4.24%	-------
సూర్యాపేట	3.89%	-------
రంగారెడ్డి	3.83%	5.31%
రాజన్న సిరిసిల్ల	3.68%	-------
సిద్దిపేట	3.39%	-------
ఖమ్మం	3.18%	13.75%
మేడ్చల్ మల్కాజ్‌గిరి	3.06%	-------
జనగాం	2.91%	-------
హైదరాబాద్	2.52%	4.21%
కరీంనగర్	2.50%	8.65%
వరంగల్ అర్బన్	2.41%	-------
పెద్దపల్లి	2.17%	-------
వరంగల్	-------	12.12%

విహార యాత్రకు వచ్చి విగత జీవిగా..

- మిత్రులతో కలిసి సదర్మాట్‌కు రాక..
- ఈత కోసం రిజర్వాయర్‌లో దిగిన బాలురు
- సుడిలో చిక్కుకున్న ఓ బాలుడు
- బయటకు తీసిన స్థానికులు
- ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి
- మృతుడు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వాసి



రిహాన్ (ఫైల్)




మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

ఖానాపూర్: సెలవు రోజు కావడంతో మిత్రులతో కలిసి విహార యాత్రకు వచ్చిన ఓ బాలుడు విగత జీవిగా మారాడు. ఈత సరదా అతడి ప్రాణం తీసింది. విహారం.. విషాదంగా మారింది. ఈ ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని ముస్లింపురకు చెందిన షేక్ యూనుస్, ఫిర్‌దోస్ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన రిహాన్(17) మెట్‌పల్లిలోని సూర్యోదయ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం సెలవు కావడంతో తన మిత్రులు ఇమ్రాన్, సులేమాన్, ముతాహార్, అజార్‌తో కలిసి ఓ ఆటోలో సాయంత్రం 5గంటలకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్‌కు చేరుకున్నాడు. హారీస్‌తోపాటు ఇద్దరు యువకులు సరదాగా ఈత కొట్టేందుకు నీటిలోకి దూకారు. ఈ క్రమంలో రిహాన్ నీటి తాకిడికి గేటు వద్ద సుడిగుండంలో చిక్కుకుపోయాడు. అక్కడే ఉన్న మిత్రులు కాపాడే అవకాశం లేకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న స్థానికులు సయ్యద్ ఇమ్రాన్, అంగోతు లింబాజీ ఫైర్ సిబ్బంది సాయంతో నీటిలోకి దిగి తాడు సాయంతో యువకుడిని బయటకు తీశారు. వెంటనే ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలిపారు. ఘటనా స్థలానికి సీఐ రవీందర్‌నాయక్ చేరుకొని ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విహార యాత్రకు వెళ్లి విగతజీవిగా మారడంతో కుటుంబీకులతోపాటు మిత్రులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు.

క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపికలు

- 24 నుంచి విద్యార్థులకు ప్రారంభం కానున్న శారీరక సామర్థ్య పరీక్షలు
- హకీంపేటలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలు
- విద్యార్థుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 2023-24 విద్యాసంవత్సరానికి 4, 5వ తరగతుల్లో ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జిల్లాస్థాయి ఎంపికలు పూర్తి అయ్యాయి. ఈనెల 24నుంచి రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు జరుగనున్నాయి. ఒక్కో జిల్లా నుంచి 20 మంది బాలురు, 20 మంది బాలికలను రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు ఆయా జిల్లాలోని క్రీడాశాఖలు పంపనున్నాయి. హకీంపేటలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జరిగే ఈ పోటీల్లో విద్యార్థులకు ఎలాంటి శారీరక సామర్థ్య పరీక్షలు పెడతారు.. ఏ జిల్లా వారికి ఎప్పుడు తదితర వివరాలతో ప్రత్యేక కథనం.



ఫ్లెక్సిబిలిటీ టెస్ట్

మొత్తం 120 సీట్లు

హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కలిపి 2023–24 విద్యాసంవత్సరంలో 4వ తరగతిలో 60, 5వ తరగతిలో 60 సీట్లు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 4వ తరగతికి 20, 5వ తరగతికి 20 సీట్లు. ఇందులో సగం సీట్లు బాలికలకు కేటాయిస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు సాధించిన పాయింట్ల ఆధారంగా ప్రవేశాలు దక్కుతాయి.

ఏ జిల్లా వారికిఎప్పుడు..

- జూలై 24న జోన్–1లోని పెద్దపల్లి జిల్లా విద్యార్థులకు (23న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేస్తారు).
- జూలై 25న జోన్–2లోని జగిత్యాల జిల్లా విద్యార్థులకు (24న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేస్తారు).
- జూలై 26న జోన్–3 లోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల విద్యార్థులకు (25న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేస్తారు).

నిర్వహించే టెస్ట్‌లు

అంత్రోపోమెట్రిక్ టెస్ట్‌లు: ఎత్తు, బరువు
మోటార్ క్వాలిటీ టెస్ట్‌లు: 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 6గ10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్ వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ (ముందుకు బెండ్ అయి భూమిని తాకడం), మెడిసిన్ బాల్ త్రో (1 కిలో బరువు), 800 మీటర్ల రన్నింగ్
మెడికల్ టెస్ట్‌లు: వయస్సుకు సంబంధించిన టెస్ట్‌లు

విద్యార్థులు తీసుకువెళ్లాల్సిన పత్రాలు

- జన్మదిన సర్టిఫికెట్ (సంబంధింత అధికారి జారీ చేసిన పత్రం)
- పది లేటెస్ట్ పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు
- 4వ తరగతి అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు, 5వ తరగతి అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు 4వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు
- ఆధార్ కార్డు
- కమ్యూనిటీ సర్టిఫికెట్

సువర్ణావకాశం



క్రీడాకారులుగా ఎదగాలనే వారికి ఇది సువర్ణ అవకాశం. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లలో చదివి జాతీయ, అంతర్జాతీయ స్థాయితో పాటు ఒలింపిక్స్ లాంటి మెగా ఈవెంట్‌లో పాల్గొని సత్తా చాటిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. ఉన్నత, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ దొరుకుతుంది. – నాగిరెడ్డి సిద్దారెడ్డి,మాజీ క్రీడా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

శిక్షణతో పాటు చదువు



క్రీడల్లో శిక్షణ నివ్వడమేకాకుండా విద్య సైతం కొనసాగుతుంది. ఉన్నతమైన ప్రమాణాలతో మంచి శిక్షణ దొరుకుతుంది. క్రీడాకారులుగా రాణించాలనుకునే వారు క్రీడా పాఠశాలలో చేరితేనే లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు. – సీహెచ్ సంపత్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు, రాజన్న సిరిసిల్ల జిల్లా

హక్కుల సాధనలో టీబీజీకేఎస్ కీలక పాత్ర



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు

- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకట్రావు

జైపూర్: సింగరేణిలో కార్మికుల హక్కుల సాధనలో టీబీజీకేఎస్ కార్మిక సంఘం కీల భూమిక పోషిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంక్రటావు అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ, ఐకే–ఓసీ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో సుమారు 15వేల మంది యువ కార్మికులు ఉద్యోగాలు పొందారని తెలిపారు. కార్మికులు ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు ద్వారా రుణం తీసుకుంటే వడ్డీ లేని రుణం రూ.10లక్షలు యాజమాన్యం చెల్లిస్తుందని తెలిపారు. సింగరేణి కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. 2022నాటికి ఉద్యోగంలోకి వచ్చిన కార్మికులు 190నుంచి 240మాస్టర్లు నింపిన ప్రతి బదిలీ వర్కర్‌ను జనరల్ మజ్దూర్‌గా ఇప్పిస్తున్నామని తెలిపారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు ఢికొండ అన్నయ్య, మంద మల్లారెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గడ్డం మల్లయ్య పాల్గొన్నారు.

నిండుతున్న సాత్నాల



జైనథ్: వారం క్రితం డెడ్ స్టోరేజీలో ఉన్న ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్ట్ ఇటీవల కురిసిన వర్షాలకు క్రమంగా నిండుతోంది. సాత్నాల వాగు పొంగి ప్రవహించడంతో ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తుతోంది. పూర్తిస్థాయి నీటి మట్టం 1.24 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.33 టీఎంసీకి చేరినట్లు అధికారులు తెలిపారు. 475 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

అక్రమ కేసులు ఎత్తివేయండి


- మంథని ఆర్డీఓకు పౌరహక్కుల సంఘం వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మంథని: ప్రభుత్వం ఉపా కింద నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని, ఆ చట్టాన్ని రద్దు చేయాలని పౌరహక్కుల, విప్లవ రచయితల సంఘం ప్రజాఫ్రంట్ నాయకులు సోమవారం మంథని ఆర్డీఓ వీర బ్రహ్మాచారికి వినతిపత్రం అందించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ప్రశ్నించే మేధావులు, కవులు, కళాకారులు, ప్రజాసంఘాలపై ఉపా వంటి అక్రమ కేసులు బనాయిస్తోందని పేర్కొన్నారు. తాడ్వాయి కేసులో 152మందిపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలన్నారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సీపతి రాజగోపాల్, ఉపాధ్యక్షుడు పుల్లా సుచరిత, నారా వినోద్, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి రవి, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, యాదవనేని పర్వతాలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సినారె వాగ్భూషణ పురస్కారానికి శ్రీలక్ష్మి ఎంపిక



శ్రీలక్ష్మి

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ కళా వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో ఏటా అందజేస్తున్న రాష్ట్రస్థాయి వాగ్భూషణ పురస్కారం 2023కు ప్రముఖ కవయిత్రి, వ్యాఖ్యాత, అనువాదకురాలు అయినంపూడి శ్రీలక్ష్మిని ఎంపిక చేసినట్లు పురస్కార కమిటీ చైర్మన్ దాస్యం సేనాధిపతి, సంస్థ అధ్యక్షుడు అనుముల దయాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న హైదరాబాద్‌లో జరిగే ఓ ప్రత్యేక కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పచ్చళ్లు పెట్టే వనితల ఊరు
ఉసులుమర్రు

గోదావరి జిల్లా వాసులంటే తిండితో చంపేస్తారురా బాబు అంటుంటారు. గోదావరి తీరాన వంటకాలకు ప్రసిద్ధి చెందిన పల్లెలు చాలానే ఉంటాయి. కండ్రిగ పాలకోవా, నగరం గరాజీలు, ఆత్రేయపురం పూతరేకులు, అంబాజీపేట పొట్టిక్కలు... ఉసులుమర్రు పచ్చళ్లు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వశిష్ట గోదావరి గట్టుకు ఆనుకుని తణుకుకు అరగంట ప్రయాణ దూరంలో ఉండే ఆ గ్రామం ఎప్పుడూ సముద్రంలో ఉప్పునూ చెట్టు మీద కాయను కలిపి పచ్చళ్లు పెట్టడంలో నిమగ్నమై ఉంటుంది. వ్యక్తిగతంగా కావచ్చు, యజమాని కింద కావచ్చు ఆ గ్రామంలోని స్త్రీలలో ముప్పై, నలభై శాతం పచ్చళ్లు పెట్టడంలో ఉపాధి పొందుతూ ఉంటారు. వీరితో పాటు ఇరవై శాతం మగవారు ఈ పనిలో ఉంటారు. ఇక్కడి స్త్రీల చేతికి రుచి ఎక్కువ. అందుకే ఉసులుమర్రు పచ్చళ్లకు గిరాకీ ఎక్కువ.

అందరూ ఆవకాయ పెట్టుకోరు. బయటి నుంచి తెచ్చుకునేవారు ఎప్పుడూ ఉంటారు. అలాంటి వారి కోసమే ఆ ఊరి స్త్రీలు ఆవకాయ పెడతారు. మే నుంచి జూన్ వరకూ ఉమ్మడి తూ.గో.జిల్లాలోని ఉసులుమర్రు స్త్రీలు ఆవకాయతో పాటు రకరకాల పచ్చళ్లు పెడుతుంటారు. వాటిని తీసుకుని మగవారు జిల్లాలకు బయలుదేరి నెలల తరబడి అమ్ముతారు. రోజూ ఏదో ఒక పచ్చడి తయారు చేసే ఆ ఊరి స్త్రీలు శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతినిధులు.





40 సంవత్సరాల క్రితం నుంచి

ఉసులుమర్రి జనాభా 2500 మాత్రమే. వీరిలో ఐదు వందల మంది స్త్రీలకు పైగా, మూడు వందల మంది పురుషులకు పైగా అందరూ కలిసి దాదాపు 1000 మంది వరకు సీజన్‌లో పచ్చళ్లు పెట్టడంలో బిజీగా ఉంటారని అంచనా. ఏప్రిల్ నుంచి జూన్ వరకు చిన్న, పెద్ద, ముసలి అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు క్షణం తీరిక లేకుండా రేయింబవళ్లు అనేక రకాల పచ్చళ్లు పెడుతుంటారు. ఊరు ఊరంతా ఏ కంపెనీ కోసం, ఏ యజమాని కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధిని కల్పించుకున్నారు. 40 సంవత్సరాల క్రితం పిళ్లా పెదకాపు కుటుంబం వారు మొదటిసారిగా పచ్చళ్లను తయారు చేయడం మొదలు పెట్టారు. మంచి లాభాలు, మిగులు ఉండడంతో వారిని చూసి వారి బంధువులు మొదలుపెట్టారు. అలా ఒకరిని చూసి మరొకరు అదే పనిని నేర్చుకుని స్వంతంగా తయారు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. 200 కుటుంబాలకు పైగానే ఈ చిరు వ్యాపారాన్ని చేస్తున్నారు. ఇప్పుడు తయారీలో మూడోతరం నిమగ్నమైంది.



ఇవీ ప్రత్యేకం

టమాటా, ఉసిరి, అల్లం, మాగాయి, ఆవకాయ, గోంగూర, కాలీఫ్లవర్, పండుమిరప, నిమ్మ తదితర పచ్చళ్ళకు ఉసులుమర్రు ప్రత్యేకం. పచ్చళ్ల తయారీలో మహిళలకు కనీసం 300 రోజు కూలీ దక్కుతోంది. అన్ని రకాల పచ్చళ్ళు పెట్టాలంటే రూ.5 లక్షలు పెట్టుబడి అవుతుంది. ఖర్చులు పోగా మిగిలే లాభంతో తమకెంతో సంతోషంగా ఉంటుందంటున్నారు. ఈ ఒక్క పల్లెలో అన్ని రకాల పచ్చళ్లూ కలిసి ఏడాదికి 500 టన్నులు పచ్చళ్లు పడుతుంటారని అంచనా. టన్ను పచ్చడి రూ.2.50 లక్షలు వంతున విక్రయిస్తుంటారు. ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే రూ.10 నుంచి రూ.12 కోట్లు. మహిళలు ఇళ్లవద్ద పచ్చళ్లు పెడితే పురుషులు మాత్రం ఏడెనిమిది నెలలపాటు ఊళ్లు తిరుగుతూ చివరిడబ్బా అమ్మే శాక మాత్రమే ఇంటికి తిరిగొస్తారు. కుటుంబాన్ని వదిలి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో, వరంగల్, నల్గొండ, బోధన్, హైదరాబాద్, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, ఖమ్మం, మిరియాలగూడ, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు.

ఏడాది పొడవునా నిల్వ

ఉసులుమర్రు ఆవకాయ అంటే ఏడాది పొడవునా నిల్వకు తిరుగుండదంటారు. ముదురు మామిడికాయలను ముక్కలుగా కోసి ఆరబెట్టి ఆవపిండి, మెంతులు, ఎర్రపచ్చడి కారం, వేరుశెనగ లేదా నువ్వుల నూనె కలిపి మూడు రోజుల తరువాత జాడీలో పెడతారు. ఉప్పు, కారం, ఆవపిండి కలిపిన ముక్కలను డ్రమ్ములో వేసుకుని ఎక్కడ అవసరమైతే అక్కడే వారి కళ్లెదుటే అన్నీ కలిపి ఇవ్వడంతో నమ్మకం రెట్టింపు అయ్యిందంటారు. వేసవిలో పండుమిరప, ఉసిరి, ఆవకాయ, గోంగూర, కాకరకాయ పెడతారు. వానాకాలం బ్రేక్ ఇచ్చి మళ్లీ ఆగస్టు నుంచి అల్లం, వెల్లుల్లి, టొమాటో, కాలీఫ్లవర్, కొత్తిమీరలాంటివి పెడతారు. మిక్స్‌డ్ వెజిటబుల్ అడిగితే పెట్టి ఇస్తారు. నిమ్మకు నిల్వ తక్కువ కాబట్టి తక్కువగా పెడతారు. చికెన్, రొయ్యలతో నాన్‌వెజ్ పచ్చళ్లు కూడా చేసి ఇస్తారు. సరుకును బట్టి లాభం. ఉదాహరణకు డ్రమ్ (200 కిలోలు) పండు మిరప పచ్చడి పట్టడానికి 20 వేలు అవుతుంటే మార్కెట్‌లో కిలో రూ.250కు అమ్ముతుంటారు.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు
సాక్షి, కాకినాడ
ఫొటోలు: పంతం వెంకటేశ్వర్లు, పెరవలి



గెలుపు పాఠం

మనసే గురువై అనుభవమే అపురూప పాఠమై...

– స్టార్ మోడల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ లీనా నాయర్


ఫ్రాన్స్ పర్యటనలో ప్రధాని మోదీని కలుసుకున్న ప్రముఖులలో లీనా నాయర్ ఒకరు. మోదీ ఆమెను ప్రత్యేకంగా ప్రశంసించారు. మేనేజ్‌మెంట్ ట్రైనీ నుంచి గ్లోబల్ బ్రాండ్ చానల్(ఫ్రెంచ్ ఫ్యాషన్ కంపెనీ)కి సీయివో కావడం వరకు ఆమెది స్ఫూర్తిదాయకమైన ప్రయాణం....

లీనా నాయర్ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో పుట్టింది. అక్కడి హోలీ క్రాస్ హైస్కూల్, ది న్యూ కాలేజ్‌లో చదువుకుంది. మహారాష్ట్ర, సంగ్లీ పట్టణంలోని 'వాల్‌చంద్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్'లో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పూర్తి చేసింది.

హిందూస్థాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్)లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టిన లీనా ఫ్యాక్టరీ ఫ్లోర్‌లో పని చేసిన తొలి మహిళ, నైట్ షిఫ్ట్‌లో పనిచేసిన తొలి మహిళ, మేనేజ్‌మెంట్ కమిటీలోని తొలి మహిళగా గుర్తింపు పొందింది. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పట్టా పుచ్చుకున్న లీన 'మేనేజ్‌మెంట్' వైపు రావడానికి కారణం ఏమిటి?

ఆమె మాటల్లోనే...''చిన్న పట్టణంలో పుట్టి పెరిగాను. ఆ రోజుల్లో అమ్మాయిల కోసం సరియైన బడులు ఉండేవి కావు. అమ్మాయిలు ఇవి మాత్రమే చేయాలి....ఇలా రకరకాల ఆంక్షలు ఉండేవి. పెద్దగా నవ్వడం కూడా పెద్ద తప్పయ్యేది! చిన్నప్పటి నుంచి నాకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ అంటే ఇష్టం. అలా ఇంజనీరింగ్ చేశాను. ఇంజనీరింగ్‌లో ఉండే ఇంటలెక్చువల్ చాలెంజ్ అంటే ఇష్టం ఉన్నప్పటికీ ఇంజనీర్‌గా ఉద్యోగజీవితాన్ని మాత్రం ఎంజాయ్ చేయలేకపోయాను.

అదృష్టవశాత్తు ఒక ప్రొఫెసర్ దగ్గర మేనేజ్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్ సబ్జెక్ట్ చదువుకున్నాను. నీలో అరుదైన మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఉన్నాయి అంటూ ఆయనే నన్ను మేనేజ్‌మెంట్ దిశగా ప్రోత్సహించారు.



● ప్రధాని మోదీతో లీనా నాయర్

మేనేజ్‌మెంట్ వైపు వెళ్లాలనుకుంటున్నాను అని నాన్నతో చెబితే ఆయన చాలా నిరాశకు గురయ్యారు. నీలాంటి ప్రతిభ గల ఇంజనీర్ అటు వైపు వెళ్లడం ఏమిటి? అన్నారు. ఆయన అలా అనడంతో నాకు చాలా నిరాశగా అనిపించింది. తరువాత బాగా ఆలోచించాను. అప్పుడు నాకు నేనే గురువుగా మారిపోయాను. 'నీ మనసు చెప్పింది చెయ్. ఎవరో ఏదో అనుకుంటారని సంశయించవద్దు. నీ కంటూ ఒక లక్ష్యంతో బయలుదేరు'... అలాగే చేశాను. నా కలను నిజం చేసుకున్నాను''.

ప్రతి అనుభవం, ప్రతి పని ఒక పాఠం నేర్పుతుంది. ఫ్యాక్టరీ ఫ్లోర్‌లో పనిచేసిన అనుభవం నుంచి లీన నేర్చుకున్న పాఠం ఏమిటి?

తాను ఫ్యాక్టరీ ఫ్లోర్‌లోకి అడుగుపెట్టినప్పుడు అందరూ ఆశ్చర్యంగా చూడడం మొదలుపెట్టారు. ఒక మహిళ తమ ఫ్యాక్టరీలో పనిచేస్తుందని వారు ఊహించలేదు. తన కోసం ఒక టాయిలెట్ నిర్మించేలా చేయడంలో విజయం సాధించింది లీన. 'హెచ్‌యూఎల్'లో పనిచేస్తున్న కాలంలో ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్‌కు సంబంధించి ఎన్నో పాఠాలు నేర్చుకుంది. అవన్నీ తన కెరీర్‌కు పునాది రాళ్లుగా ఉపయోగపడ్డాయి.

ఫ్యాక్టరీలో యంత్రాలలో యంత్రమై పనిచేయలేదు లీన. చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్‌గా ఉద్యోగులను కనిపెట్టుకొని ఉండేది. ఎవరైనా ఒంటరితనంతో బాధపడుతున్నా, పనిఒత్తిడితో సతమతం అవుతున్నా....వారిని ఆ స్థితి నుంచి బయటికి తీసుకువచ్చేది. పాకిస్థాన్‌లో 'హెచ్‌యూఎల్' షాప్ ఫ్లోర్ కోసం కొందరు అమ్మాయిలు ఉద్యోగంలో చేరారు. అయితే వారి తల్లిదండ్రులకు రకరకాల సందేహాలు ఉండేవి. ఇది గమనించిన లీన వారిని కంపెనీ గెస్ట్‌హౌజ్‌లో రెండు వారాల పాటు ఉండేలా చేసింది. తమ పిల్లలు షాప్ ఫ్లోర్‌లో చేస్తున్న పని ఏమిటి? అక్కడ ఎలాంటి సౌకర్యాలు, సదుపాయాలు ఉన్నాయి...మొదలైనవి ప్రత్యక్షంగా చూసుకునే అవకాశం వారికి లభించింది.

'మాకిప్పుడు ఎలాంటి సందేహాలు లేవు. మా పిల్లలు మంచి ఉద్యోగాన్ని ఎంచుకున్నారు' అన్నారు వారు వెళ్లేటప్పుడు.

'ప్రతి సమస్యకు ఒకేఒక పరిష్కారం ఉండదు. సందర్భాలు, దేశాలను బట్టి కొత్త పరిష్కార మార్గాల కోసం ఎప్పటికప్పుడు అన్వేషించాల్సి ఉంటుంది' అంటోంది గ్లోబల్ ఫ్యాషన్ బ్రాండ్ 'చానల్' సీయివో లీనా నాయర్.

రోబీస్...

- సాధారణ తేనెటీగల్లాగే పరపరాగ సంపర్కానికి దోహదం చేస్తున్న రోబో-బీలు (తేనెటీగ యంత్రాలు)
- బ్లూబెర్రీ, అవకాడో తోటల కోసం రూపొందించిన ఇజ్రాయెల్ కంపెనీ



● బ్లూ బెర్రీ తోటలో రోబో యంత్రంతో పాలినేషన్ చేస్తున్న మహిళా రైతు

● పాలినేట్ చేస్తున్న 'రోబీ' చెయ్యి

కొన్ని రకాల పంటలు, పండ్ల తోటల్లో పరపరాగ సంపర్కానికి అత్యవసరమైన తేనెటీగల సంఖ్య ప్రకృతిలో అంతకంతకూ తగ్గిపోతుండడంతో... అగ్రిటెక్ సంస్థలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారం వెతికే ప్రయత్నం చేస్తున్నాయి. ఇజ్రాయెల్‌కి చెందిన 'బ్లూమ్‌ఎక్స్' కంపెనీ తేనెటీగల్లా పనిచేసే రోబో యంత్రాలను రూపొందించింది. పరిశోధనలు, క్షేత్రస్థాయి పరీక్షలను పూర్తిచేసుకున్న రోబో తేనెటీగ యంత్రాలు (రోబో–బీలు/రోబీలు) మెక్సికో, పెరూ తదితర దేశాల్లోని బ్లూబెర్రీ, అవకాడో(వెన్నపండు) పండ్ల తోటల్లో హల్‌చల్ చేస్తున్నాయి. పంటల అవసరాలను బట్టి ప్రత్యేక రోబీలను రూపొందిస్తుండటం విశేషం.

రసాయనిక సాంద్ర వ్యవసాయ ప్రభావం, వాతావరణ మార్పుల వల్ల ప్రకృతిలో తేనెటీగల సంఖ్య తగ్గిపోతోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార–వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) గణాంకాల ప్రకారం.. సాగు భూమి విస్తీర్ణం 1961 తర్వాత 600% పెరిగితే, ఇదే కాలంలో పెట్టెల్లో తేనెటీగల పెంపకం 83% మాత్రమే పెరిగింది. కాలిఫోర్నియా(అమెరికా)లో విస్తారంగా సాగవుతున్న బాదం తోటల్లో పరపరాగ సంపర్కం సజావుగా జరిపించేందుకు విదేశాల నుంచి ఏకంగా ఏడాదికి 4,800 కోట్ల తేనెటీగలను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ పని పూర్తయ్యాక ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే, ప్రయాణంనే కోట్లాది తేనెటీగలు ప్రాణాలు కోల్పోతున్నాయి. దేశ సరిహద్దులు దాటి తేనెటీగల దిగుమతిలో పర్యావరణ సమస్యలున్నాయి. ఈ సమస్యలను అధిగమిస్తూ.. తేనెటీగల కొరతను రోబో తేనెటీగలతో 'బ్లూమ్‌ఎక్స్' తీర్చే ప్రయత్నం చేస్తోంది.

బ్లూబెర్రీ తోటల్లో 'రోబీ' రొద

ఇజ్రాయెల్‌లోని ఓ చిన్న వ్యవసాయ గ్రామం రిష్పన్‌లో బ్లూమ్‌ఎక్స్ 2019లో ఏర్పాటైంది. సీఈఓ థాయ్ సదెది అదే ఊరు. ఇప్పటికైతే బ్లూబెర్రీ, అవకాడో పంటల కోసం వేర్వేరుగా ప్రత్యేక 'రోబో–బీ' యంత్రాలను రూపొందించింది. ఈ రెండూ దిగుబడి పెంచితే రైతుల ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉన్న ఖరీదైన పంటలు. అందుకే వీటిని ఎంపికచేసుకున్నామన్నారు బ్లూమ్‌ఎక్స్ ప్రతినిధి ఎమిలీ స్పెన్సర్.

బ్లూబెర్రీ చెట్ల పూలల్లోనే ఆడ, మగ భాగాలుంటాయి. అయితే, పుప్పొడి ఆడ భాగాలకు చేరాలంటే తేనెటీగలు మగ భాగాలను స్పృశించి మంద్రంగా కదపాల్సి ఉంటుంది. ఈ పని అనేక దఫాలు జరిగితేనే చక్కటి దిగుబడి వస్తుంది. సరిగ్గా జరగకపోతే పండ్ల సంఖ్యతోపాటు సైజు కూడా తగ్గిపోతుంది. కాబట్టి, బ్లూబెర్రీ చెట్ల వరుసల మధ్య నుంచి రోబోను మనిషి నడుపుతూ తీసుకెళ్తుంటే.. రోబో తన చేతులు చాచి పూలను తగుమాత్రంగా చురుగ్గా కదుపుతూ పరపరాగ సంపర్కానికి దోహదం చేస్తుంది. దీన్ని 'రోబీ' అంటున్నారు.

కృత్రిమ మేధ సాయం

ఏయే తోటల్లో పాలినేషన్ సేవలు ఎప్పుడు అవసరమో తెలుసుకోవటం కోసం డేటాబేస్‌లను కృత్రిమ మేధతో మేళవించే మొబైల్ అప్లికేషన్‌ను రైతులకు కంపెనీ అందిస్తోంది. అవకాడోలు, బ్లూబెర్రీలు ఎక్కువగా సాగయ్యే మెక్సికో, పెరూ, కొలంబియా, అమెరికా, దక్షిణాఫ్రికా, ఇజ్రాయెల్ తదితర దేశాల్లో రైతులు ఈ 'రోబీ'లను వాడుతున్నారు. దిగుబడి బ్లూబెర్రీలో 30%, అవకాడోలో 40% పెరిగిందట.

అవకాడో తోటలో 'క్రాస్‌బీ'

అవకాడో ఎత్తు పెరిగే చెట్లు. ఈ చెట్లకు ఆడ, మగ పూలు పూస్తాయి. అయితే, మగ పూలు విచ్చుకున్న కొద్ది గంటల తర్వాత గానీ ఆడ పూలు విచ్చుకోవు. మగ పూలను తాకిన తేనెటీగలకు పుప్పొడి రేణువులు అంటుకుంటాయి. కొన్ని గంటల తర్వాత ఆడ పూలను తేనెటీగలు తాకినప్పుడు ఆ పుప్పొడి ఈ పూలకు అంటడం వల్ల పరపరాగ సంపర్కం సజావుగా సాగుతుంది. ఈ అవసరాలకు అనుగుణంగా పరపరాగ సంపర్కం జరిపేందుకు 'క్రాస్‌బీ' పేరుతో బ్యాడ్మింటన్ బ్యాట్ మాదిరి చేతి రోబో పరికరాన్ని బ్లూమ్‌ఎక్స్ రూపొందించింది. దీనితో పువ్వులపై సున్నితంగా రుద్దితే పుప్పొడి దానికి అంటుతుంది. ఆ పుప్పొడిని సేకరించి భద్రపరుస్తారు. కొన్ని గంటల తర్వాత ఆడ పూలు విచ్చుకున్నప్పుడు రోబో చేతితో ఈ పుప్పొడిని ఆ పూలకు సున్నితంగా రుద్దుతారు. ఈ విధంగా విజయవంతంగా పరపరాగ సంపర్కం జరుగుతున్నట్లు రుజువైందని సంస్థ తెలిపింది. వేర్వేరు రకాల అవకాడో చెట్లను పక్కపక్కనే నాటితే.. అప్పటికప్పుడే పరపరాగ సంపర్కం జరిగిపోతుంది. పుప్పొడిని భద్రపరచి, తర్వాత వినియోగించాల్సిన అవసరం ఉండదని సంస్థ వివరించింది.



● 'క్రాస్‌బీ' రోబోతో అవకాడో తోటలో పాలినేషన్ చేస్తున్న మహిళా రైతు

సాగుబడి

పునర్వసు కార్తె : జూలై 19 వరకు
పుష్యమి కార్తె : జూలై 20 నుంచి



● కొబ్బరి తోటలో మేకల ఫామ్

ఇటు మాంసం.. అటు పాలు!

- వేగంగా పెరిగి అధిక మాంసం ఉత్పత్తికి దోహదపడుతున్న సరికొత్త మేకల జాతి
- దక్షిణాఫ్రికా బోయర్ రకం పొట్టేళ్లతో అనేక దేశీ మేకల జాతులతో క్రాస్ బ్రీడింగ్
- 8 నెలల్లోనే 40 కిలోల బరువు.. రోజుకు రెండు లీటర్ల పాల దిగుబడి
- అమలాపురం ఎన్నారై రైతు ప్రయోగం సక్సెస్

ఓ ప్రవాస భారతీయుడు చొరవతో మేలైన సంకర జాతి మేకల జాతిని ఉత్పత్తి చేశారు. ఇది మాంసోత్పత్తికి, పాల దిగుబడికి రెండు విధాలుగా ఉపయోగపడే మేకల జాతి కావడం విశేషం. వేగంగా పెరగడంతో పాటు రుచికరమైన మాంసాన్ని అందిస్తుంది. ఈ జాతి మేకలు రోజుకు రెండు లీటర్ల వరకు పాలు కూడా ఇస్తుండటంతో రైతుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం చెందిన కె.నాగేశ్వరరావు 21 ఏళ్లుగా సింగపూర్‌లో ఓ నిర్మాణ సంస్థలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. కరోనా సమయంలో స్వస్థలానికి వచ్చిన ఆయన ఇక్కడే వ్యవసాయాన్ని వాణిజ్య స్థాయిలో చేపట్టాలని నిర్ణయించుకున్నారు. కొంత కాలం ఆక్వా సాగు చేసిన తర్వాత మేకల పెంపకంపై దృష్టిసారించారు. మేలైన విదేశీ మేకలను తీసుకువచ్చి స్థానిక మేకలతో క్రాసింగ్ చేయించారు. అమలాపురం సమీపంలోని కామనగరువులోని వ్యవసాయ క్షేత్రంలో వీటిని పెంచుతూ చక్కని ఫలితాలు సాధిస్తున్నారు.

దక్షిణాఫ్రికా బోయర్ రకం

ఇటు మాంసం ఉత్పత్తికి, అటు పాల దిగుబడికి ఉపయోగపడే దక్షిణాఫ్రికాకు చెందిన బోయర్ రకం మేకల మాంసం రుచిగా ఉంటుంది. వేగంగా పెరుగుతుంది. ఒక్కోటి రూ.3 లక్షల వ్యయంతో దక్షిణ ఆఫ్రికా బోయర్ రకం విత్తన పొట్టేళ్లను దిగుమతి చేసుకున్నారు. ఈ పొట్టేలు బరువు ఏకంగా 140 కేజీల వరకు ఉంటుంది. ఆ జాతి విత్తన పొట్టేళ్లను దిగుమతి చేసుకొని స్థానిక జాతులతో సంకరం చేయటం వల్ల ఉత్తమ ఫలితాలు ఉంటాయని భావించారు. ఆ విధంగానే పొట్టేళ్లను దిగుమతి చేసుకొని.. రాజస్థాన్‌కు చెందిన అజ్మీర్, సిరోహి, కేరళకు చెందిన తలచేరి, పంజాబ్‌కు చెందిన బిటిల్ రకాల మేకలతో సంకరం చేయించారు. దీంతో ప్రయోగం విజయవంతమైంది.



● సంకర జాతి మేకలు



● దక్షిణాఫ్రికా బోయర్ జాతి పొట్టేలు

8 నెలల్లోనే 40 కిలోలు..

తమ వ్యవసాయ క్షేత్రంలో ఈ క్రాస్ బ్రీడ్ (సంకర జాతి) మేకల సంతతి స్థానిక రకాల కన్నా వేగంగా బరువు పెరుగుతున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక దేశవాళీ మేక రెండేళ్లలో గరిష్ఠంగా 40 కేజీలు బరువు పెరుగుతుంది. ఈ సంకరజాతి మేక 8 నెలల్లోనే ఈ బరువుకు పెరుగుతోంది. రెండేళ్లలో 70 కేజీలవుతోంది. ఆడ మేక రోజుకు రెండు లీటర్ల వరకు పాలు ఇస్తోందని ఆయన వివరించారు.

ఇంటిగ్రేటెడ్ పద్ధతిలో సంకర జాతి మేకలు పెంచుతున్నారు. ఇది ఖర్చుతో కూడుకున్న వ్యహారమే అయినా మేకలు 2–3 రెట్లు బరువు పెరుగుతాయి. నాణ్యమైన, రుచికరమైన మాంసం ద్వారానే కాకుండా, పాల ద్వారా రోజువారీ ఆదాయాన్ని పొందే అవకాశముంది. బోయర్ జాతి లక్షణాలు 100 శాతం స్థానిక బ్రీడ్‌లో తెప్పించే దిశగా ప్రయత్నిస్తున్నారు. క్రాస్ బ్రీడింగ్ ద్వారా వచ్చే సంతతిని రైతులకు ఒక పొట్టేలుకు 20 మేకలను యూనిట్‌గా విక్రయిస్తున్నారు. మాంసం రిటెయిల్ విక్రయించడానికి అవుట్‌లెట్ ఏర్పాటు చేయబోతున్నామని నాగేశ్వరరావు వివరించారు. వీటికి క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేస్తే జబ్బుల బారినపడే అవకాశం చాలా తక్కువని నాగేశ్వరరావు అన్నారు.

– నిమ్మకాయల సతీష్ బాబు,
సాక్షి, అమలాపురం

నాణ్యమైన బ్రీడ్ అభివృద్ధే లక్ష్యం



మన ప్రాంతంలో దేశవాళీ మేక మాంసం కన్నా నాణ్యమైన, రుచికరమైన మాంసం అందించే సంకర జాతి బ్రీడ్‌ను అందుబాటులోకి తేవాలన్నదే నా కోరిక. విదేశీ బ్రీడ్ మేక పిల్లలను దిగుమతి చేసుకొని ఇక్కడ పెంచితే స్థానిక వాతావరణానికి ఎంతగా తట్టుకుంటాయో చెప్పలేం. అందుకే దక్షిణాఫ్రికా బోయర్ రకంతో స్థానిక రకాలను సంకరం చేసి కొత్త బ్రీడ్‌ను రూపొందిస్తున్నాం. తద్వారా మేలు రకం మాంసం ఉత్పత్తి చేయగలుగుతున్నాం. ఈ సంకర జాతి మేకలు పూర్తిస్థాయిలో బోయర్ గుణగణాలను సంతరించుకునేందుకు మూడు, నాలుగేళ్ల సమయం పడుతుంది. ఈ సంకరజాతి మేకలు స్థానిక వాతావరణాన్ని తట్టుకుంటాయి.

- కె. నాగేశ్వరరావు (99235 44777), కామనగరువు, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

శాస్త్రీయ పద్ధతిలో మేలు జాతి ఉత్పత్తి



స్థానిక దేశవాళీ మేకల పెంపకం కన్నా మేలైన రకాల నుంచి ఉత్పత్తి అయ్యే సంకర జాతి మేకలు త్వరగా ఎదుగుతాయి. నాణ్యమైన మాంసం ఉత్పత్తి అవుతుంది. రైతు నాగేశ్వరరావు శాస్త్రీయ పద్ధతిలో మేలు జాతి మేకలను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ జాతి ద్వారా మేకల పెంపకందారులు అధిక మాంసం, పాల దిగుబడి సాధించే అవకాశముంది.

- విజయ రెడ్డి, సహాయ సంచాలకులు, పశు సంవర్థక శాఖ, అమలాపురం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఐదంచెల ఉద్యాన తోటల సాగుపై శిక్షణా శిబిరం

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఐదంచెల ఉద్యాన తోటల సాగుపై కర్నూలు జిల్లా జూపాడి బంగ్లా మండలం పారుమంచాలలో ఈ నెల 21,22 తేదీల్లో శ్రమదానంతో కూడిన అవగాహన శిబిరాన్ని సేవ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించనుంది. సేవ్ వ్యవస్థాపకులు, ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు విజయ్ రామ్ అవగాహన కల్పిస్తారు. 21న 50 మందికి, 22న మరో 50 మందికి నేర్పిస్తారు. కనీసం 3 గంటల సేపు శ్రమదానం చేయగల సామర్థ్యం వున్న వారు మాత్రమే పేరు నమోదు చేసుకోవాలని విజయరామ్ కోరారు. ప్రవేశం ఉచితం. కర్నూలుకు సమీప జిల్లాల వారికి ప్రాధాన్యం. వివరాలకు.. 63091 11427, 04027654337.

నిర్వహణ: పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్



పారిస్ ఒలింపిక్స్‌కు అవినాశ్ సాబ్లే అర్హత

భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో అర్హత సాధించాడు. పోలాండ్‌లో జరిగిన డైమండ్ లీగ్ మీట్‌లో మహారాష్ట్రకు చెందిన 28 ఏళ్ల అవినాశ్ 8 నిమిషాల 11.63 సెకన్లలో గమ్యానికి చేరి ఆరో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని (8ని:15.00 సెకన్లు) అవినాశ్ అధిగమించాడు. టోక్యో ఒలింపిక్స్‌లో హీట్స్‌లోనే వెనుదిరిగిన అవినాశ్ 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో, 2019 ఆసియా చాంపియన్‌షిప్‌లో రజత పతకాలు గెలిచాడు.

‘యాషెస్’ నాలుగో టెస్టుకు అండర్సన్



ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌లోని మూడో టెస్టులో తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన ఇంగ్లండ్ వెటరన్ పేస్ బౌలర్ జేమ్స్ అండర్సన్‌ను నాలుగో టెస్టుకు ఎంపిక చేశారు. మాంచెస్టర్‌లో బుధవారం ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య నాలుగో టెస్టు మొదలవుతుంది. ఐదు టెస్టుల సిరీస్‌లో ప్రస్తుతం ఇంగ్లండ్ 1–2తో వెనుకంజలో ఉంది. అండర్సన్ తాజా యాషెస్ సిరీస్‌లో తొలి రెండు టెస్టుల్లో కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసి నిరాశపరిచాడు.

బోపన్న ర్యాంక్ 7



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సెమీఫైనల్ ప్రదర్శన భారత స్టార్ రోహన్ బోపన్న ర్యాంకింగ్స్‌లో పురోగతికి దోహదపడింది. సోమవారం విడుదల చేసిన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 43 ఏళ్ల బోపన్న ఐదు స్థానాలు ఎగబాకి 12 నుంచి ఏడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. 2013 తర్వాత బోపన్న ఏడో ర్యాంక్‌ను అందుకోవడం విశేషం. వింబుల్డన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో చివరి నిమిషంలో ఆడే అవకాశం దక్కించుకున్న యూకీ బాంబ్రీ 64వ ర్యాంక్‌లో... సాకేత్ మైనేని 81వ ర్యాంక్‌లో... జీవన్ నెడుంజెళియన్ 93వ ర్యాంక్‌లో... శ్రీరామ్ బాలాజీ 97వ ర్యాంక్‌లో నిలిచారు.

నాపై మానసికంగా ప్రభావం పడింది: సింధు



న్యూఢిల్లీ: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ఈ ఏడాది కలిసి రావడంలేదు. 2023లో సింధు ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోగా, మాడ్రిడ్ మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలవడం ఆమె అత్యుత్తమ ప్రదర్శన. తాజాగా యూఎస్ ఓపెన్‌లో సింధు క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి పాలైంది. దాంతో ఆమె తీవ్ర నిరాశ చెందింది. ఈ ఓటమి అనంతరం సోషల్ మీడియాలో స్పందించింది. ఆశ్చర్యకరంగా గతంలో ఎన్నడూలేని రీతిలో తన భావోద్వేగాలను ప్రదర్శించింది. ‘ఈ ఓటమి మానసికంగా నాపై తీవ్ర ప్రభావం చూపించింది. ముఖ్యంగా అన్ని ప్రతికూలతలు ఎదురవుతున్న ఈ ఏడాదిలో ఇలాంటి ఫలితం రావడం బాగా నిరాశపర్చింది. తాజా పరాజయంతో నేను చాలా బాధపడ్డాను. నా ఈ భావోద్వేగాలను సరైన రీతిలో మలచుకొని నా ఆటను మరింత మెరుగుపర్చుకొనేందుకు, ఎక్కువగా సాధన చేసేందుకు వాడుకుంటా. రాబోయే కొరియా, జపాన్ టోర్నీల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. మీ అభిమానమే నాకు సర్వస్వం. దానికి కృతజ్ఞురాలిని’ అని సింధు పోస్ట్ చేసింది.

ఆసియా క్రీడల్లో ఆడనివ్వండి

- ప్రధాని జోక్యం చేసుకోవాలి
- భారత ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ స్టిమాక్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో భారత ఫుట్‌బాల్ జట్టుకు ఆడే అవకాశం కల్పించాలని కోరుతూ సీనియర్ టీమ్ హెడ్ కోచ్ ఐగర్ స్టిమాక్ దేశ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 23 నుంచి చైనాలోని హాంగ్జూలో ఆసియా క్రీడలు జరగనున్నాయి. ఇందులో ఫుట్‌బాల్ క్రీడాంశంలో వివిధ దేశాలకు చెందిన అండర్–23 స్థాయి టీమ్‌లు పాల్గొంటాయి. ఈ జట్లలో ముగ్గురు సీనియర్ ఆటగాళ్లకు కూడా ఆడే వెసులుబాటు కల్పిస్తారు. అయితే టీమ్ ఈవెంట్లలో ర్యాంకింగ్స్‌లో టాప్–8లో ఉంటేనే మన జట్లను పంపిస్తామని భారత క్రీడా శాఖ మాత్రం విధానం రూపొందించుకుంది. ప్రస్తుతం ఆసియాలో భారత ఫుట్‌బాల్ జట్టు 18వ ర్యాంక్‌లో ఉంది. దాంతో ఫుట్‌బాల్ టీమ్‌ను పంపడానికి అవకాశం లేదు. దీనిపైనే ప్రధాని జోక్యం చేసుకోవాలంటూ స్టిమాక్ సోషల్ మీడియాలో సుదీర్ఘ లేఖ రాస్తూ ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. భారత్ 2017లో అండర్–17 ప్రపంచ కప్‌కు ఆతిథ్యమిచ్చింది. నాటి జట్టులో ఆడినవారే ఇప్పుడు అండర్–23 క్వాలిఫయర్స్‌లో మెరుగ్గా రాణించారు. ఈ కుర్రాళ్లలో మంచి ప్రతిభ ఉంది. కానీ ఇప్పుడు ఆసియా క్రీడల్లో మన జట్టు పాల్గొనకుండా అడ్డు చెబుతున్నారు. ఈ టీమ్‌లో అలాంటి ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో పాల్గొనాలి. జట్టును పంపకుండా ఉండేందుకు చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవు. అందుకే భారత్ కోచ్‌గా ఈ విషయాన్ని మీ దృష్టికి, కేంద్ర క్రీడాశాఖ దృష్టికి తీసుకొస్తున్నాను. కాబట్టి మీరు జోక్యం చేసుకొని జట్టు ఆసియా క్రీడల్లో పాల్గొనేలా చేయాలి అని స్టిమాక్ అన్నారు. ఎలాంటి ప్రత్యర్థినైనా ఓడించే సత్తా మన జట్టుకు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ‘ర్యాంకింగ్ పేరు చెప్పి మన క్రీడా శాఖనే జట్టు పాల్గొనకుండా చేస్తోంది. నిజానికి ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న కొన్ని ఇతర క్రీడల టీమ్‌ల కంటే మన ఫుట్‌బాల్ జట్టు ర్యాంక్ మెరుగ్గానే ఉంది. పైగా తమకంటే బలమైన జట్లపై చిన్న టీమ్‌లు సంచలన విజయాలు సాధించడం ఫుట్‌బాల్‌లో అసాధ్యమేమీ కాదని చరిత్ర చెబుతోంది’ అని స్టిమాక్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా అక్కడి స్టార్ ఆటగాడు కిలియాన్ ఎంబాపె భారత్‌లో సూపర్‌హిట్ అని, అతనికి అక్కడికంటే మన దేశంలోనే ఎక్కువ మంది అభిమానులు ఉన్నారని నరేంద్ర మోదీ చెప్పిన విషయాన్ని స్టిమాక్ గుర్తు చేశారు. ‘ఫ్రాన్స్ పర్యటనలో ఎంబాపె గురించి మీరు చేసిన వ్యాఖ్య భారత ఫుట్‌బాల్‌ను అభిమానించేవారందరికీ సంతోషం కలిగించింది. మన జట్టు ఆసియా క్రీడల్లో పాల్గొనేలా చూడాలని భారత టీమ్ తరఫున మిమ్మల్ని కోరుతున్నా. క్రీడాశాఖ సూచనల్లో ఒక ప్రత్యేక నిబంధన కూడా ఉంది. టాప్–8లో లేకపోయినా సరైన కారణంతో నిపుణుల బృందం సిఫారసు చేస్తే ఆ టీమ్‌ను ఆసియా క్రీడలకు పంపవచ్చు. దీని ప్రకారం అవకాశం కల్పించండి’ అని స్టిమాక్ కోరారు. భారత ఫుట్‌బాల్ జట్టు 1951 న్యూఢిల్లీ, 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు... 1970 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత పలుమార్లు భారత జట్టు ఆసియా క్రీడల్లో పాల్గొన్నా ఆరంభ రౌండ్లలోనే నిష్క్రమించింది.

సెమీఫైనల్లో భారత్ ‘ఎ’

ఎమర్జింగ్ కప్ ఆసియా క్రికెట్ టోర్నీ



అభిషేక్ శర్మ, సాయి సుదర్శన్

కొలంబో: ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఎమర్జింగ్ కప్ క్రికెట్ టోర్నీలో భారత ‘ఎ’ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్ ‘బి’లో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘనవిజయం సాధించింది. మొదట నేపాల్ 39.2 ఓవర్లలో 167 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ రోహిత్ పాడెల్ (65; 7 ఫోర్లు) రాణించాడు. గుల్షన్ ఝా (38; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుగ్గా ఆడాడు. భారత్ ‘ఎ’ బౌలర్లలో నిశాంత్ సింధు 4, రాజ్‌వర్ధన్ 3, హర్షిత్ రాణా 2 వికెట్లు తీశారు. తర్వాత సులువైన లక్ష్యాన్ని భారత జట్టు 22.1 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 172 పరుగులు చేసి ఛేదించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (87; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (58 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలతో జట్టును గెలిపించారు. ధ్రువ్ (21 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా పరుగులు చేశాడు. ఈ గ్రూపులో బుధవారం తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ ‘ఎ’తో తలపడుతుంది.

ప్రపంచ అండర్–21 స్నూకర్‌లో భారత్‌కు మూడు పతకాలు



రియాద్: ప్రపంచ అండర్–21 మహిళల స్నూకర్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణులు అదరగొట్టారు. స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో మెరిశారు. ఫైనల్లో కీర్తన పాండ్యన్ 3–2 (24–50, 72–50, 71–15, 23–82, 79–45)తో భారత్‌కే చెందిన అనుపమ రామచంద్రన్‌ను ఓడించి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. అనుపమ ఖాతాలో రజతం చేరింది. సెమీఫైనల్లో ఓడిపోయిన నటాషా చేతన్‌కు కాంస్య పతకం లభించింది.

అభినవ్‌–గౌతమి జోడీకి స్వర్ణం



చాంగ్వాన్ (కొరియా): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభినవ్ షా–గౌతమి భానోత్ జోడీ పసిడి పతకం సాధించింది. ఫైనల్లో అభినవ్–గౌతమి ద్వయం 17–13తో ఒఫీన్ ముల్లర్–రొమైన్ ఔఫ్రెరి (ఫ్రాన్స్) జంటపై గెలిచింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అభినవ్ చౌధరీ–సంయమ్ ద్వయం కాంస్య పతకం నెగ్గింది. కాంస్య పతక పోరులో అభినవ్–సంయమ్ 17–11తో కిమ్ జూరి–కిమ్ కాంగ్ హున్ (కొరియా)లపై విజయం సాధించారు.

చైనా చేతిలో భారత్ ఓటమి



లింబర్గ్ (జర్మనీ): భారత మహిళల హాకీ జట్టు జర్మనీ పర్యటనను పరాజయంతో ప్రారంభించింది. నాలుగు దేశాల టోర్నమెంట్‌లో చైనాతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2–3 గోల్స్ తేడాతో ఓటమి చవిచూసింది. భారత్ తరఫున నవనీత్ కౌర్ 24, 45వ నిమిషాల్లో రెండు గోల్స్ చేసింది. భారత జట్టు పలు పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసింది. మరోవైపు ప్రత్యర్థి జట్టుకు లభించిన పెనాల్టీ కార్నర్‌లను చెన్ జియలి (9వ ని.లో), జాంగ్ జియకి (45వ ని.లో) గోల్స్‌గా మలిచారు. మూడో క్వార్టర్ ముగిసేసరికి ఇరు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. కానీ ఆఖరి క్వార్టర్‌లో జు యనన్ (51వ ని.లో) ఫీల్డ్ గోల్ చేసి చైనాను గెలిపించింది.

మయామి క్లబ్‌కు మెస్సీ



ఫోర్ట్ లాడెర్‌డేల్ (ఫ్లోరిడా): అర్జెంటీనా ఫుట్‌బాల్ సూపర్‌స్టార్ లయోనల్ మెస్సీ కొత్త గూటికి చేరాడు. అమెరికన్ ప్రొఫెషనల్ సాకర్ క్లబ్ అయిన ‘ఇంటర్ మయామి’ జట్టుతో ఆడేందుకు సోమవారం ఇక్కడికి వచ్చాడు. ఈ క్లబ్‌కు చెందిన స్టేడియంలో అతను ‘10 నంబర్ జెర్సీ’తో ప్రవేశించగానే క్లబ్ సహ యజమాని, ఇంగ్లండ్ సాకర్ స్టార్, మాజీ కెప్టెన్ బెక్‌హామ్ ఆలింగనం చేసుకొని అభిమానుల హర్షధ్వానాల మధ్య స్వాగతం పలికాడు. 2025 సీజన్ పూర్తయ్యే వరకు ఇంటర్ మయామితో ఆడేందుకు మెస్సీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఒప్పందం విలువ సీజన్‌కు రూ. 492 కోట్లు (60 మిలియన్ డాలర్లు) అని క్లబ్ వర్గాలు వెల్లడించాయి.

పాక్‌ను ఆదుకున్న షకీల్, సల్మాన్

- తొలి ఇన్నింగ్స్‌లో 221/5
- లంకతో తొలి టెస్టు



గాలె: శ్రీలంక బౌలర్ ప్రభాత్ జయసూర్య (3/83) స్పిన్ ఉచ్చులో పడిన పాకిస్తాన్ జట్టును మిడిలార్డర్ బ్యాటర్లు సాద్ షకీల్ (69 బ్యాటింగ్; 6 ఫోర్లు), ఆగా సల్మాన్ (61 బ్యాటింగ్; 6 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకున్నారు. దీంతో తొలి టెస్టులో ఆతిథ్య జట్టు స్కోరుకు దీటుగా పాక్ తొలి ఇన్నింగ్స్ సాగుతోంది. 101 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన పాక్‌ను షకీల్, సల్మాన్ గట్టెక్కించారు. ఇద్దరు కలిసి ఆఖరి సెషన్ ఆసాంతం క్రీజును అట్టిపెట్టుకోవడంతో మరో వికెట్ పడలేదు. అబేధ్యమైన ఆరో వికెట్‌కు 120 పరుగులు జోడించి పాక్‌ను ఆదుకున్నారు. ఆట ముగిసే సమయానికి పాక్ 5 వికెట్లు కోల్పోయి 221 పరుగులు సాధించింది. ప్రస్తుతం బాబర్ బృందం 91 పరుగులు వెనుకబడి వుంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 242/6తో రెండో రోజు ఆట కొనసాగించిన శ్రీలంక 95.2 ఓవర్లలో 312 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ ధనంజయ డిసిల్వా (122; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీతో కదంతొక్కాడు. షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, అబ్రార్ తలా 3 వికెట్లు తీశారు.

సినిమా

హార్ట్ ఆఫ్ సైంధవ్



● వెంకటేశ్, సారా

సైంధవ్ హృదయానికి దగ్గరగా ఉన్న వ్యక్తి ఎవరు? ఆ మాటకొస్తే సైంధవ్ హార్ట్ ఎవరు? అంటే... బేబీ గాయత్రి. సైంధవ్, గాయత్రిల అనుబంధం ఎలాంటిదో ‘సైంధవ్’ చిత్రంలో చూడాల్సిందే. వెంకటేశ్ టైటిల్ రోల్‌లో శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో గాయత్రి పాత్ర చేస్తోంది బేబీ సారా. వెంకటేశ్‌తో సారా ఉన్న పోస్టర్‌ని ‘హార్ట్ ఆఫ్ సైంధవ్’ అంటూ సోమవారం విడుదల చేశారు. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికగా, నవాజుద్దీన్ సిద్దిఖీ, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా మూవీగా దక్షిణాది భాషల్లో, హిందీలోనూ డిసెంబర్ 22న రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, కెమెరా: ఎస్. మణికందన్.

తుఫాను ముందు వచ్చే ఉరుము



● నయనతార

‘తుఫాను ముందు వచ్చే ఉరుము ఆమె’ అంటూ ‘జవాన్’లో నయనతార క్యారెక్టర్ లుక్‌ని షారుక్ ఖాన్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. షారుక్ ఖాన్, నయనతార కాంబినేషన్‌లో తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘జవాన్’. హిందీలో నయనతారకు, అట్లీకి ఇది తొలి చిత్రం. ఈ చిత్రంలో నయనతార చేసిన పోలీసాఫీసర్ పాత్ర లుక్‌ని సోమవారం విడుదల చేశారు. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై గౌరీ ఖాన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 7న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది.

ఎమోషన్స్ బాగున్నాయి

– ‘దిల్’ రాజు



సాయికుమార్, ఆదిత్యా ఓం, ఐశ్వర్య, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ సాయి, దీపాలి రాజపుత్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం ‘నాతో నేను’. శాంతి కుమార్ తూర్లపాటి (జబర్దస్త్ ఫేం) దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాత ‘దిల్ రాజు’ రిలీజ్ చేసి, మాట్లాడుతూ – ‘‘ఈ ట్రైలర్‌లో చూపించిన ట్రయాంగిల్ ఎమోషన్స్ బాగున్నాయి. సాయికుమార్ నటన గురించి తెలిసిందే. ఇతర ఆర్టిస్టులూ అద్భుతంగా నటించారు’’ అని అన్నారు.

కుట్రలకీ.. ఆలోచనలకీ మధ్య...

రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ‘వ్యూహం’. అజ్మల్, మానస లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఫస్ట్ ఇంటెన్స్ పోస్టర్ ఆఫ్ ‘వ్యూహం’ అంటూ ఈ మూవీ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. అజ్మల్ ఫొటో ఉన్న ఈ పోస్టర్‌పై కుట్రలకీ, ఆలోచనలకీ మధ్య... అని రాసి ఉంది. ‘‘‘వ్యూహం’ సినిమాని ఎక్కడా రాజీ పడకుండా తెరకెక్కిస్తున్న వర్మ ప్రతిభను చూసి ఆశ్చర్యపోతున్నాను. కుట్రలకీ, ఆలోచనలకీ మధ్యలో అసామాన్యుడిగా ఎదిగిన నాయకుని కథే ‘వ్యూహం’. ఆ నాయకుడే ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 50 శాతం పూర్తయింది’’ అన్నారు దాసరి కిరణ్‌కుమార్. ఈ చిత్రానికి కెమెరా: సుజీష్ రాజేంద్రన్.



● అజ్మల్

డేట్ నైట్



‘‘బాగా నిద్రపోవాలని ఫిక్స్ అయినప్పుడు కడుపులో ఉన్న బిడ్డ డ్యాన్స్ పార్టీ పెట్టుకోవాలని ఫిక్స్ అయితే.. ఇక నిద్ర ఎలా పోతాం’’ అంటూ చిరనవ్వులు చిందిస్తూ తన ప్రెగ్నెన్సీ తాలూకు ఆనందాన్ని ఇటీవల ఇలియానా పంచుకున్న విషయం తెలిసిందే. ‘‘నేను తల్లిని కాబోతున్నా’’ అని ఇలియానా ప్రకటించినప్పటి నుంచి తండ్రి వివరాలు తెలుసుకోవాలని చాలామంది ఆసక్తిగా ఉన్నారు. ఆ మధ్య ఓ వ్యక్తి ముఖాన్ని బ్లర్ చేసి, ఇలియానా ఆ ఫొటోను షేర్ చేశారు. సోమవారం స్పష్టంగా ఉన్న ఫొటోను షేర్ చేసి, ‘డేట్ నైట్’ అంటూ ఆ వ్యక్తితో దిగిన ఫొటోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. అయితే అతని పేరు, ఇతర వివరాలేమీ ఇలియానా బయటపెట్టలేదు. ‘డేట్ నైట్’ అన్నారు కాబట్టి అతను ఇలియానా బాయ్‌ఫ్రెండ్ అని స్పష్టమవుతోంది. మరి.. రహస్య వివాహం ఏమైనా చేసుకున్నారా? అనేది తెలియాల్సి ఉంది.

డిటెక్టివ్ సినిమాలు గుర్తొస్తాయి



● మీనాక్షి, విజయ్ ఆంటోని

‘‘‘హత్య’ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది. ఈ సినిమా మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వింటే హాలీవుడ్ డిటెక్టివ్ చిత్రాలు గుర్తొస్తాయి. గిరీష్ అంత మంచి మ్యూజిక్ ఇచ్చారు. తెలుగు ప్రేక్షకులు ‘హత్య’ చిత్రాన్ని ఆదరించాలి’’ అన్నారు విజయ్ ఆంటోని. బాలాజీ కుమార్ దర్శకత్వంలో విజయ్ ఆంటోని హీరోగా, రితికా సింగ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘హత్య’. ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. గ్లోబల్ సినిమాస్, సురేష్ ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరోలు అడివి శేష్, సందీప్ కిషన్ అతిథులుగా హాజరై, ‘హత్య’ హిట్టవ్వాలన్నారు. ‘‘1923లో జరిగిన ఓ ఘటన ఆధారంగా ఈ చిత్రం తీశాను’’ అన్నారు బాలాజీ కుమార్.

ఫొటో స్టూడియోలో ప్రేమ



● చెందు ముద్దు

‘‘ప్రేక్షకులకు మనం ఎప్పటి కథ చెబుతున్నామన్నది ముఖ్యం కాదు. ఆ కథను ఎలా చెబుతున్నామన్నదే ముఖ్యం. ‘సీతారామం’ సినిమా 1960ల నేపథ్యంలో ఉన్నా ప్రేక్షకులు ఆదరించారు. అందుకే 1980ల నేపథ్యంలో రూపొందిన మా ‘అన్నపూర్ణ ఫోటో స్టూడియో’ కూడా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది’’ అని దర్శకుడు చెందు ముద్దు అన్నారు. చైతన్యా రావ్, లావణ్య జంటగా యష్ రంగినేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు చెందు విలేకరులతో మాట్లాడుతూ– ‘‘నా తొలి చిత్రం ‘ఓ పిట్ట కథ’. ఇప్పుడు ‘అన్నపూర్ణ ఫోటో స్టూడియో’ తీశాను. ఈ చిత్రంలో ఒక స్వచ్ఛమైన ప్రేమ కథను వినోదాత్మకంగా చూపిస్తున్నాం. మాలాంటి కొత్త వాళ్లను ప్రేక్షకులు ప్రోత్సహించినప్పుడే మరిన్ని కొత్త సినిమాలు వస్తాయి’’ అన్నారు.

అందమైన దెయ్యం



● కాజల్

కాజల్ అగర్వాల్, రెజీనా, జనని అయ్యర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘కార్తీక’. డి. కార్తికేయన్ (డీకే) దర్శకత్వం వహించారు. ముత్యాల రామదాసు సమర్పణలో వెంకట సాయి ఫిల్మ్స్‌పై టి. జనార్ధన్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. ‘‘హారర్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘కార్తీక. ఇందులో కాజల్, జనని దెయ్యాలుగా కనిపిస్తారు’’ అన్నారు ముత్యాల రామదాసు. ఈ చిత్రానికి సంగీతం: ప్రసాద్ ఎస్ఎన్.

యాక్షన్ ఎంటర్‌టైనర్

ప్రముఖ దర్శకుడు పి. వాసు తనయుడు శక్తి వాసుదేవన్ హీరోగా రాఘవ ద్వారకి దర్శకత్వం వహించిన చిత్రం ‘అలా ఇలా ఎలా’. బ్రహ్మానందం, అలీ, పూర్ణ, నిషా కొఠారి ప్రధాన పాత్రల్లో నటించారు. కళ మూవీ మేకర్స్ పతాకంపై కొల్లకుంట నాగరాజు నిర్మించిన ఈ చిత్రం ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ సంస్థ ద్వారా ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కొల్లకుంట నాగరాజు మాట్లాడుతూ– ‘‘యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన మా సినిమా ప్రేక్షకులు థ్రిల్ ఫీలయ్యేలా ఉంటుంది’’ అన్నారు. ‘‘కర్ణాటకలో పుట్టిన నేను చిరంజీవి గారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. తెలుగులో నా మొదటి చిత్రం ‘అలా ఇలా ఎలా’’ అన్నారు రాఘవ ద్వారకి.



● పూర్ణ, శక్తి

చరిత్రను వెతుకుతూ...



● అశ్విన్, నందితా శ్వేత

‘‘కథని బలంగా నమ్మి చేసిన చిత్రం ‘హిడింబ’. స్క్రీన్‌ప్లే, విజువల్స్ రెగ్యులర్‌గా కాకుండా మా మూవీలో కొత్తగా ఉంటాయి. సినిమా బాగా వచ్చింది.. ప్రేక్షకులకు మా చిత్రం నచ్చుతుంది’’ అని హీరో అశ్విన్ బాబు అన్నారు. అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో అశ్విన్ బాబు, నందితా శ్వేత జంటగా నటించిన చిత్రం ‘హిడింబ’. అనిల్ సుంకర సమర్పణలో గంగపట్నం శ్రీధర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న రిలీజవుతోంది. ఈ సందర్భంగా సోమవారం ‘హిడింబ’ రివర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అనిల్ కన్నెగంటి మాట్లాడుతూ– ‘‘ఒక చరిత్ర వెతుక్కుంటూ వెనక్కి వెళ్లే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ‘హిడింబ’. నాకు గొప్ప తృప్తి ఇచ్చిన సినిమా ఇది’’ అన్నారు. ‘‘మా సినిమాని థియేటర్‌లో చూసి మమ్మల్ని సపోర్ట్ చేయాలి’’ అన్నారు గంగపట్నం శ్రీధర్. ఈ కార్యక్రమంలో నటులు శ్రీనివాస్ రెడ్డి, రఘు కుంచె పాల్గొన్నారు.

పాత్రను అర్థం చేసుకోవడానికి భగవద్గీత చదివా!

– హాలీవుడ్ నటుడు సిలియన్ మర్ఫీ



అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త జె. రాబర్ట్ ఓపెన్‌హైమర్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం ‘ఓపెన్‌హైమర్’. క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ఓపెన్‌హైమర్ పాత్రను సిలియన్ మర్ఫీ పోషించారు. ఈ పాత్రను అర్థం చేసుకోవడానికి తాను భగవద్గీత చదివానని పేర్కొన్నారు సిలియన్. భగవద్గీతకి, ఈ పాత్రకి లింక్ ఏంటీ? అంటే.. రెండో ప్రపంచ యుద్ధం అప్పుడు అణుబాంబు తయారు చేయడానికి భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన ‘సృష్టించింది నేనే.. నాశనం చేసింది నేనే’ అనే శ్లోకం ప్రేరణగా నిలిచిందని ఓపెన్‌హైమర్ వెల్లడించారు. అందుకే ఆయన పాత్ర చేయడానికి భగవద్గీత చదివానని సిలియన్ మర్ఫీ అన్నారు. ఓపెన్‌హైమర్ జీవితంలో కీలకంగా నిలిచిన అణుబాంబు తయారీ ప్రధానాంశంగా రూపొందిన ‘ఓపెన్‌హైమర్’ యూనివర్సల్ పిక్చర్స్ ద్వారా ఇంగ్లిష్‌లో ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 21న విడుదల కానుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	529	66,590
నిఫ్టీ ▲	147	19,711

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,205	▲	91
డోజోన్స్	34,590	▲	81
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,406	▽	28
డాక్స్	16,069	▽	36
షాంఘై	3,210	▲	28
నికాయ్ (శుక్రవారం ముగింపు)	32,391	▽	28

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	59,270
బంగారం (22 క్యారెట్)	59,033
వెండి (కిలో)	75,066

ప్రాక్సిమస్ గ్రూప్ గూటికి రూట్ మొబైల్

- 58 శాతానికి రూ. 5,922 కోట్లు
- అంతిమంగా 84% వరకు కొనుగోలు



న్యూఢిల్లీ: ఎంటర్‌ప్రైజ్ మెసేజింగ్ సేవల సంస్థ రూట్ మొబైల్‌లో బెల్జియంకు చెందిన ప్రాక్సిమస్ గ్రూప్ 84 శాతం వరకు వాటాలను దక్కించుకోనుంది. ఇందులో భాగంగా ముందు దాదాపు 58 శాతం వాటాలను రూ. 5,922 కోట్లకు కొనుగోలు చేయనుంది. ఈ డీల్‌తో నిబంధనల ప్రకారం.. 26 శాతం ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సి రానుండటంతో, ఆ మేరకు షేర్లన్నింటినీ కొనుగోలు చేస్తే మొత్తం 84 శాతం వరకూ వాటాలను పెంచుకునే అవకాశం ఉంది. అయితే, లిస్టెడ్ కంపెనీల్లో పబ్లిక్ వాటా కనీసం 25 శాతం ఉండాలనే నిబంధన మేరకు 12 నెలల్లోగా కొన్ని షేర్లను విక్రయించి తన వాటాను 75%కి తగ్గించుకోవాల్సి రానుంది. షేరు ఒక్కింటికి రూ. 1,626.40 చొప్పున అనుబంధ సంస్థ ప్రాక్సిమస్ ఓపల్ ద్వారా ప్రాక్సిమస్ గ్రూప్ తమ సంస్థలో 57.56% వాటాలను కొనుగోలు చేయనున్నట్లు రూట్ మొబైల్ తెలిపింది. లావాదేవీ పూర్తయ్యాక రూట్ మొబైల్ సీఈవో రాజ్‌దీప్ గుప్తా తన ప్రస్తుత బాధ్యతల్లో కొనసాగుతూనే.. గ్రూప్ సీపాస్ (కమ్యూనికేషన్స్ ప్లాట్‌ఫాం యాజ్ ఎ సర్వీస్) కార్యకలాపాలకు సారథ్యం వహిస్తారు. రూట్ మొబైల్‌లో వాటాల కొనుగోలుతో అంతర్జాతీయంగా సీపాస్ విభాగంలో తమ స్థానం మరింత పటిష్టం కాగలదని ప్రాక్సిమస్ గ్రూప్ సీఈవో గిలామ్ బూటిన్ తెలిపారు.

ప్రాక్సిమస్ సంస్థలో పెట్టుబడి..

ఒప్పందం ప్రకారం రూట్ మొబైల్ వ్యవస్థాపక వాటాదారుల్లో కొందరు ప్రాక్సిమస్ ఓపల్‌లో అలాగే ప్రాక్సిమస్‌కు చెందిన మరో అనుబంధ సంస్థ టెలీసైన్‌లో మైనారిటీ వాటాలు తీసుకోనున్నారు. ఇందుకోసం 299.6 మిలియన్ యూరోలను వెచ్చించనున్నారు. రూట్ మొబైల్ మరింత ముందుగానే బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యాన్ని సాధించేందుకు టెలీసైన్‌తో భాగస్వామ్యం ఉపయోగపడగలదని గుప్తా ధీమా వ్యక్తం చేశారు.

సోమవారం బీఎస్‌ఈలో రూట్ మొబైల్ షేరు సుమారు 9% క్షీణించి రూ. 1,486 వద్ద క్లోజైంది.

కొనసాగిన రికార్డుల ర్యాలీ..

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్ల దన్ను
- ఇంట్రాడే, ముగింపులో కొత్త గరిష్టాలు
- సెన్సెక్స్ లాభం 529 పాయింట్లు
- 19,700 ఎగువకు నిఫ్టీ



ముంబై: స్టాక్ మార్కెట్లో కొత్త రికార్డుల ర్యాలీ సోమవారం కూడా కొనసాగింది. ఇప్పటి వరకు విడుదలైన కార్పొరేట్ కంపెనీల క్యూ1 ఫలితాలు అంచనాలకు తగ్గట్లు నమోదవడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల నిధుల వెల్లువతో సెంటిమెంట్ బలపడింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 2% రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపులో సరికొత్త గరిష్టాలను నమోదు చేశాయి. ఆసియా మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ స్వల్ప లాభంతో మొదలైంది. ఉదయం సెన్సెక్స్ 87 పాయింట్లు పెరిగి 66,148 వద్ద, నిఫ్టీ 47 పాయింట్లు పెరిగి 19,612 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఆటో, రియల్టీ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆయిల్ రంగాల షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఈ క్రమంలో సెన్సెక్స్ 595 పాయింట్లు ఎగసి 66,656 వద్ద, నిఫ్టీ 167 పాయింట్లు దూసుకెళ్లి 19,732 వద్ద కొత్త జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. రోజంతా సానుకూల ధోరణిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 529 పాయింట్ల లాభంతో 66,590 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 147 పాయింట్లు పెరిగి 19,711 వద్ద నిలిచింది. చిన్న రంగాల షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ ట్రేడింగ్‌లో జీవితకాల గరిష్టాన్ని తాకింది. సెన్సెక్స్ రికార్డుల ర్యాలీ నేపథ్యంలో బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం హై రూ.303.59 లక్షల కోట్లకు చేరింది.

షీలా ఫోమ్ చేతికి కర్లాన్

- 95 శాతం వాటాల కొనుగోలు
- రూ. 2,035 కోట్ల ఒప్పందం



న్యూఢిల్లీ: స్లీప్‌వెల్ పేరిట మ్యాట్రెస్‌లను తయారు చేసే షీలా ఫోమ్ తాజాగా కర్లాన్ ఎంటర్‌ప్రైజెస్‌లో 94.66% వాటాలు కొనుగోలు చేయనుంది. ఇందుకోసం రూ.2,035 కోట్లు వెచ్చించనుంది. అలాగే, ఆన్‌లైన్ ఫర్నిచర్ బ్రాండ్ ఫర్లెంకో మాతృ సంస్థ హౌస్ ఆఫ్ కిరాయా ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ. 300 కోట్లతో 35% వాటాలు కొనుగోలు చేయనుంది. దీనికి సంబంధించిన రెండు ప్రతిపాదనలకు జూలై 17న జరిగిన సమావేశంలో కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసినట్లు షీలా ఫోమ్ తెలిపింది. 'రూ. 2,150 కోట్ల ఈక్విటీ వేల్యుయేషన్‌తో కేఈఎల్ (కర్లాన్ ఎంటర్‌ప్రైజెస్)లో 94.66% వాటాను కొనుగోలు చేయబోతున్నాం' అని వెల్లడించింది. మ్యాట్రెస్‌లు, ఫోమ్ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో తమ స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు ఈ డీల్ ఉపయోగపడగలదని షీలా ఫోమ్ తెలిపింది. కేఈఎల్‌లో 94.66% వాటా కొనుగోలు వ్యయం రూ.2,035 కోట్లుగా ఉండనున్నట్లు పేర్కొంది. దేశీయంగా ఆధునిక మ్యాట్రెస్‌ల విభాగంలో రెండింటి సంయుక్త మార్కెట్ వాటా దాదాపు 21 శాతంగా ఉంటుందని వివరించింది. దక్షిణాదికి చెందిన బిజినెస్ గ్రూప్ పాయ్ కుటుంబం 1962లో కర్ణాటక కాయిర్ ప్రోడక్ట్స్ (ప్రస్తుతం కేఈఎల్)ను ఏర్పాటు చేసింది. 1995లో దాని పేరు కర్లాన్ అని మారగా 2011లో కేఈఎల్ పేరిట అనుబంధ సంస్థ ఏర్పాటైంది. అటు పైన 2014లో వ్యాపారం కేఈఎల్‌కు బదిలీ అయింది. కంపెనీ ప్రస్తుతం ప్రధానంగా కర్లాన్ బ్రాండ్ కింద ఫోమ్, కాయిర్ ఆధారిత మ్యాట్రెస్‌లు మొదలైనవి తయారు చేస్తోంది. కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో రూ.809 కోట్ల టర్నోవరు నమోదు చేసింది. ఫర్నిచర్ రెంటల్ మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఫర్లెంకోలో పెట్టుబడులు ఉపయోగపడగలవని షీలా ఫోమ్ వివరించింది.

జోయాలుక్కాస్ 'అనుగ్రహ బ్రైడల్ ఫెస్ట్'



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ 'అనుగ్రహ బ్రైడల్ ఫెస్ట్' నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా వజ్రాభరణాలపై 25% తగ్గింపు పొందవచ్చు. అన్ని జోయాలుక్కాస్ షోరూంలలో ఈ ఆగస్టు 27 వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ''వివాహ వేడుకలకు సిద్ధమైన కుటుంబాలు ఈ అద్భుతమైన ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలి'' అని గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ కోరారు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-7-2023	
విశాఖ	475-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	470-00
రిటైల్ ధర (డజను)	72.00
17-7-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	455-00
వరంగల్	457-00
రిటైల్ ధర	5.15

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్యూ1 భేష్

- రూ. 12,370 కోట్లకు నికర లాభం
- మొత్తం ఆదాయం రూ. 61,021 కోట్లు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1(ఏప్రిల్-జూన్)లో నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 12,370 కోట్లను అధిగమించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 9,579 కోట్లు మాత్రమే ఆర్జించింది. అయితే గతేడాది (2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో ఆర్జించిన రూ. 12,594 కోట్లతో పోలిస్తే తాజా లాభం స్వల్పంగా తగ్గింది. ఇక మొత్తం ఆదాయం రూ. 44,202 కోట్ల నుంచి రూ. 61,021 కోట్లకు దూసుకెళ్లింది. నిర్వహణ వ్యయాలు 34 శాతం పెరిగి రూ. 15,177 కోట్లకు చేరాయి. ఈ జూలై 1 నుంచి బ్యాంక్ మాతృ సంస్థ, మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌ను విలీనం చేసుకున్న సంగతి తెలిసిందే.

వడ్డీ ఆదాయం అప్

స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.12 శాతం నుంచి 1.17 శాతానికి నామమాత్రంగా పెరిగాయి. గతేడాది క్యూ4లో నమోదైన 1.28 శాతం నుంచి చూస్తే నీరసించాయి. ప్రస్తుత సమీక్షా కాలంలో బ్యాంక్ స్టాండెలోన్ నికర లాభం సైతం 30 శాతం ఎగసి రూ. 11,952 కోట్లను తాకింది. నికర వడ్డీ ఆదాయం 21 శాతం బలపడి రూ. 23,599 కోట్లకు చేరింది. ఇందుకు అడ్వాన్సుల(రుణాలు)లో నమోదైన 15.8 శాతం వృద్ధి, 4.1 శాతానికి బలపడిన నికర వడ్డీ మార్జిన్లు దోహదం చేశాయి. ఈ కాలంలో రూ. 9,230 కోట్ల ఇతర ఆదాయం ఆర్జించింది. ఇందుకు రూ. 552 కోట్లమేర ట్రేడింగ్ లాభాలు సహకరించాయి. గతేడాది క్యూ1లో ఈ పద్దుకింద రూ. 1,077 కోట్ల నష్టం ప్రకటించింది. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ. 3,122 కోట్ల నుంచి రూ. 2,860 కోట్లకు తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 18.9 శాతాన్ని తాకింది.



ఇతర విశేషాలు...

- జూన్‌కల్లా బ్యాంకు మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,81,725కు చేరింది.
- అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ నికర లాభం రూ. 441 కోట్ల నుంచి రూ. 567 కోట్లకు జంప్ చేసింది.
- హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ లాభం దాదాపు యథాతథంగా రూ. 189 కోట్లుగా నమోదైంది.
- బ్యాంక్ మొత్తం బ్రాంచీల సంఖ్య 7,860కు చేరింది. వీటిలో 52 శాతం సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాలలోనే ఉన్నాయి.
- గతేడాది 1,400 బ్రాంచీలను ఏర్పాటు చేయగా.. ఈ ఏడాది సైతం ఈ బాటలో సాగనున్నట్లు బ్యాంక్ వెల్లడించింది.

ప్రపంచ బ్యాంకింగ్‌లో 7వ ర్యాంక్

ర్యాంక్	బ్యాంక్ పేరు	మార్కెట్ క్యాప్
1.	జేపీ మోర్గాన్	438
2.	బ్యాంక్ ఆఫ్ అమెరికా	232
3.	ఐసీబీసీ(చైనా)	224
4.	అగ్రికల్చరల్ బ్యాంక్(చైనా)	171
5.	వెల్స్ ఫార్గో	163
6.	హెచ్ఎస్‌బీసీ	160
7.	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	154

(విలువ బిలియన్ డాలర్లలో- విదేశీ బ్యాంకులు శుక్రవారం(14న) ధరల్లో)

మార్కెట్ క్యాప్ రికార్డ్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 2 శాతం బలపడి రూ. 1,679 వద్ద ముగిసింది. దీంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ. 12.65 లక్షల కోట్లను అధిగమించింది. వెరసి మార్కెట్ విలువరీత్యా రిలయన్స్ ఇండస్ట్రీస్(రూ. 18.91 లక్షల కోట్లు), టీసీఎస్(రూ. 12.77 లక్షల కోట్లు) తర్వాత మూడో ర్యాంకులో నిలిచింది. అంతేకాకుండా డాలర్ల మార్కెట్ విలువలో 154 బిలియన్లకు చేరడం ద్వారా ప్రపంచ బ్యాంకింగ్ దిగ్గజాలు మోర్గాన్ స్టాన్లీ(144 బిలియన్ డాలర్లు), బ్యాంక్ ఆఫ్ చైనా(138 బి.డా.), గోల్డ్‌మన్ శాక్స్(108 బి.డా.)లను దాటేసింది.

సాఫ్రాన్ అతిపెద్ద 'ఎంఆర్‌వో'

- శంషాబాద్ వద్ద ఏర్పాటు
- 2025లో కార్యరూపంలోకి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏరోస్పేస్ రంగంలో ఉన్న ప్యారిస్ కంపెనీ సాఫ్రాన్ తాజాగా శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవరాలింగ్ (ఎంఆర్‌వో) కోసం అతిపెద్ద ఫెసిలిటీ ఏర్పాటు చేస్తోంది. సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్స్ సర్వీసెస్ ఇండియా ఈ మేరకు జీఎంఆర్ హైదరాబాద్ ఏవియేషన్ సెజ్‌తో ఒప్పందం చేసుకుంది. శంషాబాద్‌లోని ఈ సెజ్‌లో లీజు ప్రాతిపదికన 23.5 ఎకరాల్లో లీడింగ్ ఎడ్జ్ ఏవియేషన్ ప్రొపల్షన్ టర్బోఫ్యాన్ ఇంజన్స్ కోసం ఎంఆర్‌వో కేంద్రం రానుంది. ఏటా 100 ఇంజన్లతో ప్రారంభమై 2035 నాటికి 300 ఇంజన్లకు సర్వీస్ చేయగలిగే స్థాయిలో రూపుదిద్దుకోనుంది. 2023 సెప్టెంబరులో నిర్మాణ పనులు మొదలై 2025లో కార్యరూపం దాల్చనుంది. పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకునే నాటికి 1,000 మందికి ఉపాధి కల్పించనుంది. సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్స్ నెట్‌వర్క్‌లో హైదరాబాద్ కేంద్రం అతిపెద్ద ఎంఆర్‌వో ఫెసిలిటీ కానుందని సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్స్ సపోర్ట్, సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ నికోలస్ పాచియే తెలిపారు. జీఎంఆర్ ఏరోస్పేస్, ఇండస్ట్రియల్ పార్క్‌లో ఇప్పటికే సాఫ్రాన్ కేబుల్ హార్నెసింగ్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్ కంపోనెంట్ తయారీ కేంద్రాలను స్థాపించింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ డీఎంఈలో 590 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఏపీ డీఎంఈ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలల్లోని వివిధ స్పెషాలిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 590
» **స్పెషాలిటీలు:** సి.టి.సర్జరీ, కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ, మెడికల్ జీఈ, నియోనాటాలజీ, నెఫ్రాలజీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, సర్జికల్ జీఈ, సర్జికల్ ఆంకాలజీ, యూరాలజీ, వాస్కులర్ సర్జరీ, అనెస్తీషియా, డెర్మటాలజీ, ఎమర్జెన్సీ, మెడిసిన్ జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, న్యూక్లియర్ మెడిసిన్, ఓబీసీ, ఆర్థోపెడిక్స్ తదితరాలు.
» **అర్హత:** మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(డీఎం/ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/డీఎంఏ) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** పోస్టు గ్రాడ్యుయేషన్ ఫైనల్ ఎగ్జామ్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**17.07.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**26.07.2023
» **వెబ్‌సైట్:** dme.ap.nic.in

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో 250 అప్రెంటిస్‌లు

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్(వైజాగ్ స్టీల్).. 2023 ఆగస్టు బ్యాచ్‌కు సంబంధించి అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 250
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్ ట్రైనీ-200,టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్ ట్రైనీ-50
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్/ఐటీ, మెటలర్జీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, కెమికల్, ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్,సెరామిక్స్,మైనింగ్, కెమికల్.
» **స్టైపెండ్:** నెలకు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లకు రూ.9000, డిప్లొమా ఇంజనీరింగ్ అభ్యర్థులకు రూ.8000. **శిక్షణ వ్యవధి:** ఒక సంవత్సరం.
» **అర్హత:** 2021/2022/2023 విద్యా సంవత్సరాల్లో సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** డిప్లొమా, బీఈ/బీటెక్‌లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» గూగుల్‌ఫాం ద్వారా దరఖాస్తులకు చివరితేది: 31.07.2023.
» **వెబ్‌సైట్:** www.vizagsteel.com

తెలంగాణ ఆయుష్ విభాగంలో 156 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్‌బీ).. తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆయుష్ విభాగంలో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 156
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్(ఆయుర్వేదం)-54, మెడికల్ ఆఫీసర్ (హోమియో)-33, మెడికల్ ఆఫీసర్(యునాని)-69.
» **అర్హత:** సంబంధిత విభాగంలో మెడికల్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వేతనం:** నెలకు రూ.54,220 నుంచి రూ.1,33,630 చెల్లిస్తారు.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హత పరీక్షలో సాధించిన మార్కులు, పని అనుభవం ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఆగస్టు 07 నుంచి 22 వరకు.
» **వెబ్‌సైట్:** https://mhsrb.telangana.gov.in

నిమ్స్, హైదరాబాద్‌లో పీజీ డిప్లొమా ప్రవేశాలు

హైదరాబాద్ పంజాగుట్టలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్).. 2023 సంవత్సరానికి సంబంధించి డిప్లొమా ఇన్ న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 04
» **వ్యవధి:** రెండేళ్లు.
» **అర్హత:** బీఎస్సీ(ఏదైనా సైన్స్ సబ్జెక్టులు/లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.12.2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.07.2023.
» **దరఖాస్తు హార్డ్‌కాపీ సమర్పణకు చివరితేది:** 31.07.2023.
» **హాల్ టిక్కెట్ల జారీ తేది:** 18.08.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 23.08.2023.
» **ఫలితాల వెల్లడి తేది:** 25.08.2023.
» **వెబ్‌సైట్:** www.nims.edu.in

కెరీర్ మెరిసే లా

కామన్ లా అడ్మిషన్ టెస్ట్.. సంక్షిప్తంగా క్లాట్! న్యాయ విద్యను అందించడంలో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌గా గుర్తింపు పొందిన నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. ఇంటర్మీడియెట్ అర్హతతో క్లాట్-యూజీ, ఎల్ఎల్‌బీ అర్హతతో క్లాట్-పీజీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ జాతీయ న్యాయవిశ్వ విద్యాలయాల్లో.. బీఏ ఎల్ఎల్‌బీ పూర్తి చేసుకుంటే.. ఇటు లా కెరీర్‌తోపాటు అటు కార్పొరేట్ కొలువులు సైతం సొంతం చేసుకోవచ్చు. తాజాగా 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు సంబంధించి క్లాట్ 2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. క్లాట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..



క్లాట్-2024 ద్వారా మొత్తం 24 నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశం కల్పిస్తారు. గత ఏడాది 22 వర్సిటీలే ఉండగా..ఈ ఏడాది మరో రెండు యూనివర్సిటీలు క్లాట్ స్కోర్‌తో ప్రవేశాలు కల్పించేందుకు సిద్ధమయ్యాయి. క్లాట్ యూజీతో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, క్లాట్ పీజీతో ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ లభిస్తుంది.

అర్హత

క్లాట్-యూజీకి దరఖాస్తు చేసుకునేందుకు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ విద్యార్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. 2023-24లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

తగ్గిన ప్రశ్నల భారం

క్లాట్-యూజీ 2024లో ప్రశ్నల సంఖ్యను తగ్గిస్తూ.. పరీక్ష నిర్వాహక కమిటీ నిర్ణయం తీసుకుంది. గతేడాది వరకు 150 ప్రశ్నలతో ఈ పరీక్ష నిర్వహించగా.. క్లాట్-యూజీ 2024లో 120 ప్రశ్నలే ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష సమయాన్ని మాత్రం గతంలో మాదిరిగానే రెండు గంటలుగా నిర్ణయించారు. అంటే.. గతంలో రెండు గంటల వ్యవధిలో 150 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటే.. ఈ ఏడాది 2 గంటల వ్యవధిలో 120 ప్రశ్నలకు సమాధానం ఇస్తే సరిపోతుంది. దీనివల్ల ఒకవైపు ప్రశ్నల సంఖ్య తగ్గడంతోపాటు ప్రతి ప్రశ్నకు లభించే సగటు సమయం పెరుగుతుంది.

» క్లాట్-2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» డిసెంబర్ 3, 2023న పరీక్ష
» పరీక్ష విధానంలో పలు మార్పులు
» క్లాట్ స్కోర్‌తో 24 నేషనల్ లా వర్సిటీల్లో ప్రవేశం

అయిదు విభాగాలు

క్లాట్-యూజీ 2024 పరీక్షను అయిదు విభాగాలుగా నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 22-26 ప్రశ్నలు, జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 28-32 ప్రశ్నలు, లీగల్ రీజనింగ్ 28-32 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 22-26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ 10-14 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష ప్రశ్నల సంఖ్య తగ్గించిన నేపథ్యంలో ఆయా సబ్జెక్ట్‌లలో ప్రశ్నల సంఖ్యా శ్రేణిని కూడా తగ్గించారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్షకు కేటాయించిన మార్కులు 120. నెగిటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల కోత విధిస్తారు.

ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు

క్లాట్-యూజీలో పేర్కొన్న అయిదు విభాగాల్లో.. నాలుగు విభాగా(ఇంగ్లిష్ లాంగ్వేజ్, కరెంట్ అఫైర్స్, లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్)ల్లో పూర్తిగా ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలే అడుగుతారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగంలో గ్రాఫ్, టేబుల్స్, డయాగ్రమ్స్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి.

ప్రిపరేషన్ పక్కాగా

- **ఇంగ్లిష్ లాంగ్వేజ్:** ఈ విభాగంలో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాన్ని పరిశీలించే ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. ఇందులో రాణించేందుకు కాంప్రహెన్షన్, ప్యాసేజ్ రీడింగ్‌పై పట్టు పెంచుకోవాలి. సునిశిత పరిశీలన నైపుణ్యం, ఇచ్చిన ప్యాసేజ్ సారాంశాన్ని గ్రహించడం, ఈ ప్యాసేజ్ ప్రధాన ఉద్దేశం తెలుసుకోవడం వంటి నైపుణ్యాలు అవసరం. ఇందుకోసం జనరల్ ఎస్సేలు, న్యూస్ పేపర్ ఎడిటోరియల్స్ వంటివి చదవాలి.
- **కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్:** ఈ విభాగంలో సమకాలీన అంశాలు, కళలు, సంస్కృతి, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రాధాన్యత కలిగిన చారిత్రక అంశాలకు సంబంధించిన ప్యాసేజ్‌లు ఇచ్చి.. వీటి నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అన్నీ తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సుల గురించి పూర్తి స్థాయి అవగాహన పొందాలి.
- **లీగల్ రీజనింగ్:** అభ్యర్థుల న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరిశీలించే విభాగం ఇది. ఇందులో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. సంబంధిత ప్యాసేజ్‌ల నుంచి నిబంధనలు, సిద్ధాంతాలు, ఫ్యాక్ట్స్, వాటి ద్వారా చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి ఇటీవల కాలంలో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన పెంచుకోవాలి.
- **లాజికల్ రీజనింగ్:** ఈ విభాగంలోనూ ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇందులో రాణించాలంటే.. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు; అసెర్షన్ అండ్ రీజనింగ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ఇందుకోసం సిలాజిజమ్, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పొందాలి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నల కోసం కంపేరిటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి.
- **క్వాంటిటేటివ్ టెక్నిక్స్:** ఈ విభాగంలో టాప్ స్కోర్ కోసం పదో తరగతి స్థాయిలోని గణిత అంశాలపై గట్టి పట్టు సాధించాలి. గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే అర్థమెటిక్‌కు కొంత ఎక్కువ వెయిటేజీ కనిపిస్తోంది. కాబట్టి పర్సంటేజెస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ స్పీడ్, యావరేజ్, రేషియోస్ తదితర టాపిక్స్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు గ్రాఫ్‌లు, చార్ట్‌లను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

కార్పొరేట్ అవకాశాల లా

నేషనల్ లా యూనివర్సిటీల్లో కోర్సు పూర్తి చేసుకున్న వారికి విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. న్యాయవాద వృత్తి మాత్రమే కాకుండా.. కార్పొరేట్ కొలువులు సైతం సొంతం చేసుకునే వీలుంది. ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య విధానాలు, పలు దేశాల కంపెనీల మధ్య అవగాహన ఒప్పందాలు వంటి వాటి కారణంగా న్యాయ నిపుణులకు డిమాండ్ ఏర్పడింది. క్యాంపస్‌లలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో ఎంపికైన విద్యార్థులకు కన్సల్టింగ్ సంస్థలు, బ్యాంకులు సగటున రూ.10 లక్షల వార్షిక వేతనం ఆఫర్ చేస్తున్నాయి.

క్లాట్-పీజీ.. ఇలా

- నేషనల్ లా యూనివర్సిటీల్లో ఎల్ఎల్ఎం కోర్సులో ప్రవేశాలకు క్లాట్-పీజీ నిర్వహిస్తారు. ఎల్ఎల్‌బీ తత్సమాన ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. అభ్యర్థులు ఎల్ఎల్‌బీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు సాధించాలి. ఈ ఏడాది చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- క్లాట్-పీజీ పరీక్షను 120 ప్రశ్నలు-120 మార్కులకు నిర్వహిస్తారు. ప్యాసేజ్ ఆధారితంగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలుగా అడుగుతారు.
- పరీక్షలో కాన్‌స్టిట్యూషనల్ లా సంబంధిత ప్రశ్నలు, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా,కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- అభ్యర్థులు ముఖ్యమైన తాజా తీర్పులు; రాజ్యాంగ, శాసనపరమైన అంశాలు; చారిత్రాత్మక తీర్పులు, వాటి ప్రభావం వంటి వాటిపై అవగాహన పెంచుకుంటే.. క్లాట్-పీజీలో మెరుగైన మార్కులు సొంతం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతోపాటు తాము ఎంపిక చేసుకోనున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి అకడమిక్‌గా బ్యాచిలర్ స్థాయిలోని అంశాలపై పట్టు సాధించడం కూడా మేలు చేస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జూలై 1 – నవంబర్ 3, 2023
- **క్లాట్ పరీక్ష తేదీ:** డిసెంబర్ 3, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ
- **క్లాట్-పీజీ వెబ్‌సైట్:** https://consortiumofnlus.ac.in/clat2024


ఇంటర్ లెక్కలో.. కాలేజీల మాయ!

పదో తరగతి పాసైనా ఇంకా ఇంటర్మీడియట్‌లో చేరని రెండు లక్షల మంది

ఈసారి టెన్త్ ఉత్తీర్ణులైనవారు **4,76,572** మంది

ఇప్పటివరకు ఇంటర్‌లో చేరినవారు **2,30,141** మందే!

- గత ఏడాది 5,09,307 మంది పాసైతే.. 4,74,313 మంది చేరిక
- ఈసారి భారీగా తేడా.. వారిలో చాలా వరకు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లోనే అడ్మిషన్
- అవకతవకలను కప్పిపుచ్చుకునేందుకు బయటికి వెల్లడించని కాలేజీలు!
- ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు దృష్టి



(ఒకేషనల్‌లో చేరిన వారి వివరాలు కాకుండా)

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రవేశాల వ్యవహారం గందరగోళంగా మారింది. పదో తరగతి ఉత్తీర్ణులైన వారిలో దాదాపు సగం మంది విద్యార్థులే ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరారు. అడ్మిషన్ల గడువు ముగింపు దగ్గరపడుతున్నా మరో రెండు లక్షల మందికిపైగా ఏమయ్యారనేదానిపై అధికారిక 'లెక్క' లేకుండా పోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 4,19,460 మంది ఉత్తీర్ణులయ్యారు. జూన్‌లో జరిగిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో మరో 53,777 మంది పాసయ్యారు. గతంలో ఫెయిలై, ఈ ఏడాది కంపార్ట్‌మెంట్‌లో ఉత్తీర్ణులైన వారు ఇంకో 3,335 మంది ఉన్నారు. మొత్తంగా ఈ ఏడాది టెన్త్ ఉత్తీర్ణుల సంఖ్య 4,76,572. కానీ జూలై రెండో వారం పూర్తయినా ఇంటర్ ఫస్టియర్‌లో చేరిన విద్యార్థుల సంఖ్య 2,30,141 మాత్రమే. పాలిటెక్నిక్ కాలేజీల్లో 31 వేల వరకు సీట్లు ఉంటాయి, మిగతా కోర్సుల్లోనూ రెండు, మూడు వేల మందికి మించి చేరే అవకాశం లేదు. మరి మిగతా రెండు లక్షల మంది వరకు విద్యార్థులు ఏమైనట్టు అనే ప్రశ్న తలెత్తుతోంది. 2022లో పదో తరగతిలో 5,09,307 మంది ఉత్తీర్ణులుకాగా.. 4,74,313 మంది ఇంటర్మీడియట్‌లో చేరారు. అంటే డ్రాపౌట్లు సుమారు 40 వేల మందికూడా లేరు. ఈసారి భారీగా తేడా కనిపిస్తోంది.



ప్రైవేటులో ప్రవేశాల లెక్కలో తేడా?

ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన కాలేజీలు రాష్ట్రవ్యాప్తంగా 3,216 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 408కాగా.. వాటిలో చేరిన విద్యార్థుల సంఖ్య 57,340. ఇవి కాకుండా ప్రభుత్వ పరిధిలోని రెసిడెన్షియల్, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలలో కలిపి 32,142 మంది ఇంటర్మీడియట్ స్థాయి కోర్సుల్లో చేరారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా 1,571 ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఉండగా.. ఇప్పటివరకు 1,40,659 మంది చేరినట్టు అవి బోర్డుకు వివరాలు పంపాయి. నిజానికి ఏటా సుమారు 2.75 లక్షల మంది వరకు విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో చేరుతున్నారు. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో చేరి ఉంటారని అంచనా. కానీ అవి అడ్మిషన్లను పూర్తిస్థాయిలో చూపకపోవడంతో విద్యార్థుల సంఖ్య తక్కువగా కనిపిస్తోందని అధికారులు భావిస్తున్నారు.

తరగతుల అవకతవకలతోనే..

కార్పొరేట్, ప్రైవేటు ఇంటర్ కాలేజీలు అడ్మిషన్లలో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అడ్మిషన్లు జరుగుతున్నట్టు చూపుతున్న కాలేజీలు ఒకచోట ఉంటే.. విద్యార్థులకు తరగతులు వేరొక చోట జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా యథేచ్ఛగా సాగుతూ వస్తున్న ఈ వ్యవహారం.. గత ఏడాది ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యల సందర్భంగా వెలుగులోకి వచ్చింది. దీంతో విద్యార్థి ఎక్కడ అడ్మిషన్ తీసుకుంటే అదే కాలేజీలో తరగతులు నిర్వహించాలని.. లేనిపక్షంలో భారీగా జరిమానా విధిస్తామని ఇంటర్ బోర్డు హెచ్చరించింది కూడా.

ప్రవేశాల ప్రక్రియ ముగిసేదాకా ఆగి..

ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు కొన్నేళ్లుగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులను కూడా జిల్లాల్లోని ఇతర బ్రాంచీలు/ కాలేజీల్లో చదువుతున్నట్టు లెక్క చూపుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా భవనాలు, మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ లేకపోవడం వంటి అంశాలను కప్పిపుచ్చుకునేందుకు.. ఇలా చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈసారి ఇంటర్ బోర్డ్ గట్టి నిఘా పెట్టడంతో ఇప్పటివరకు విద్యార్థుల జాబితా వెల్లడించలేదని.. ప్రవేశాల ప్రక్రియకు ఇంకా గడువు ఉండటంతో, అది ముగిసేలోగా జాబితాలు పంపే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

ఆ విద్యార్థుల పరిస్థితి ఏమిటి?

కాలేజీల్లో చేరినా లెక్కచూపని విద్యార్థుల సంఖ్య 1.25 లక్షల మంది వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు వీరిని ఆఖరి నిమిషంలో ఏదో ఒక బ్రాంచీలో చేరినట్టు చూపి, అక్కడి నుంచి పరీక్షలు రాయించే వీలుందని అంటున్నారు. దీనితోపాటు అదనపు సెక్షన్లకు అనుమతి తీసుకుని, వాటిలో చేరినట్టు చూపే అవకాశమూ ఉందని చెప్తున్నారు. అంటే ఈ 1.25 లక్షల మందీ ప్రైవేటు కాలేజీల లెక్కలోకి చేరితే.. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో టెన్త్ పాసైన విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరే వీలుందని అంటున్నారు.

ప్రవేశాలు ఊపందుకుంటాయి

ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాలు తగ్గాయంటూ కొన్ని కార్పొరేట్ కాలేజీలు, వారికి మద్దతిచ్చే కొన్ని సంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. అది వాస్తవం కాదు. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు ఇటీవలే వచ్చాయి. కొన్నిరోజుల్లో ఇంటర్ అడ్మిషన్లు ఊపందుకునే అవకాశం ఉంది.

– రామకృష్ణగౌడ్, ఇంటర్ విద్య పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్

ఇప్పటివరకు ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలు ఇలా..

యాజమాన్యం	కాలేజీలు	చేరిన విద్యార్థులు
ప్రభుత్వ కాలేజీలు	408	57,340
కేంద్ర ప్రభుత్వ కాలేజీలు	3	135
ఎయిడెడ్ కాలేజీలు	43	3,252
రెసిడెన్షియల్ కాలేజీలు	37	669
ఎస్సీ గురుకులాలు	238	2,430
ఎస్టీ గురుకులాలు	125	1,323
బీసీ గురుకులాలు	145	1,312
మోడల్ స్కూల్స్	194	7,079
కేజీబీవీ	246	6,752
మైనార్టీ వెల్ఫేర్ కాలేజీలు	205	9,154
టీఎస్ఆర్టీసీ కాలేజీ	1	11
టీఎస్ స్పోర్ట్స్ కాలేజీ	1	25
ప్రైవేటు కాలేజీలు	1,571	1,40,659
మొత్తం	3,216	2,30,141



సమగ్ర వివరాలు సేకరిస్తున్నాం..

ఇంటర్ ప్రవేశాలు గత ఏడాది డిసెంబర్ వరకు జరిగాయి. ఈసారి ఇంకా గడువు ఉంది. ఆలోగా విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరే అవకాశం ఉంది. ప్రైవేటు కాలేజీలు ప్రవేశాలు పొందిన విద్యార్థుల వివరాలను బోర్డుకు అందించలేదన్న అనుమానాలు వస్తున్నాయి. కాలేజీలు ఒకచోట, విద్యార్థులు మరోచోట ఉండటాన్ని సీరియస్‌గా తీసుకున్నాం. అందుకే ప్రైవేట్ కాలేజీలు డేటా పంపేందుకు తటపటాయిస్తున్నాయని సందేహాలు ఉన్నాయి. ఈ అంశంలో సమగ్ర వివరాలు సేకరించాలని జిల్లా అధికారులను ఆదేశించాం.

– నవీన్ మిత్తల్, ఇంటర్ బోర్డు కార్యదర్శి

ఆర్టీసీ ఉద్యోగులపై 'సీయూజీ భారం'

- బీఎస్ఎన్ఎల్ నుంచి ప్రైవేటు సంస్థకు అప్పగించే యోచన
- సాలీనా ఉద్యోగులపై రూ.3 కోట్లకుపైగా భారం
- మండిపడుతున్న కార్మికులు..
- మెరుగైన సేవల కోసమే: అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఆదాయం పెంచుకొనేందుకు ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటున్న ఆర్టీసీ తాజాగా తీసుకున్న ఓ నిర్ణయం ఉద్యోగుల ఆగ్రహానికి కారణమైంది. సీయూజీ ఫోన్ నెట్‌వర్క్ అందిస్తున్న సర్వీసు ప్రొవైడర్‌ను మార్చాలన్న ఆర్టీసీ యోచన వల్ల ఉద్యోగులపై సాలీనా రూ. 3.15 కోట్ల కొత్త భారం పడబోతుండటమే దీనికి కారణం. అసలే వేతన సవరణ జరగకపోవటంతో ఆందోళన బాట పడుతున్న తరుణంలో కార్మికులకు ఆర్టీసీ నిర్ణయం.. మరింత ఆగ్రహాన్ని తెప్పించింది. తమ ఆందోళన అంశాల జాబితాలో దాన్ని కూడా చేర్చటంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు పునరాలోచనలో పడ్డారు.

ఇదీ సంగతి..

ఆర్టీసీ ఉద్యోగులకు బీఎస్ఎన్ఎల్ సర్వీసు ప్రొవైడర్‌గా సీయూజీ ఫోన్ నెట్‌వర్క్ అందుబాటులో ఉంది. అంతర్గతంగా ఉచితంగా అన్‌లిమిటెడ్ కాల్స్ మాట్లాడుకొనే వెసులుబాటు ఉండాలన్న ఉద్దేశంతో దాదాపు దశాబ్దన్నర క్రితం నాటి ఎండీ ఈ ఏర్పాటు చేశారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్‌కే ఆ అవకాశం కల్పించారు. సీయూజీ చార్జీగా ప్రతి ఉద్యోగి జీతం నుంచి నెలకు రూ. 36 చొప్పున కోత విధిస్తున్నారు. ఉద్యోగి సీయూజీ సిమ్‌తోపాటు యాడ్ ఆన్‌గా మరో నాలుగు సిమ్‌కార్డులను వారి కుటుంబ సభ్యులకు బీఎస్ఎన్ఎల్ అందిస్తోంది. తాజాగా బీఎస్ఎన్ఎల్‌ను తప్పించి ఓ ప్రైవేటు సర్వీస్ ప్రొవైడర్ ద్వారా సీయూజీ సేవలు పొందేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. దీని ప్రకారం ఉద్యోగి జీతం నుంచి నెలకు రూ. 99 చొప్పున మినహాయించాల్సి వస్తోంది. బీఎస్ఎన్ఎల్ నెలకు కేవలం 6 జీబీ డాటానే ఇస్తోందని, కొత్త సంస్థ 60 జీబీ ఇస్తుందని, ఇది ఎంతో వెసులుబాటుగా ఉంటుందని సంస్థ పేర్కొంది. కానీ ఆ రూపంలో తమపై భారం మోపడం కరెక్ట్ కాదని, కొత్త సంస్థ యాడ్ ఆన్‌గా ఒక్క సిమ్ కార్డునే ఇస్తుండటం, 5జీ నెట్‌వర్క్ ఇవ్వనున్నందున.. చాలా మంది వద్ద దానికి అనువైన ఫోన్లు లేనందున కొత్తవి కొనాల్సి రావడం ఆర్థికంగా భారమవుతుందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది పోర్టబులిటీ కానందున, పాత నంబర్ల స్థానంలో కొత్త నంబర్లు కేటాయిస్తే.. యూఏఎన్ లాంటి వాటితోపాటు అన్ని కేవైసీల్లో నంబర్లు మార్చుకోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఒక ఉద్యోగిపై పడే భారం తక్కువగానే కనిపిస్తున్నా 42 వేల మందిని కలిపి లెక్కిస్తే సాలీనా అదనపు భారం రూ. 3.15 కోట్లను మించుతోందని అధికారుల దృష్టికి తెచ్చారు.

ఆ డబ్బుతో 9 కొత్త పల్లెవెలుగు బస్సులు కొనొచ్చు..

గతంలో ఉద్యోగుల నామమాత్రపు కాంట్రిబ్యూషన్‌తో ఆర్టీసీ 2–3 బస్సులు కొనుగోలు చేసింది. కానీ సొంతంగా నిధులు సమకూర్చుకోలేక సిబ్బంది విరాళాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడిందంటూ కొందరు పేర్కొనడాన్ని ఆర్టీసీ తీవ్రంగా పరిగణించింది. ఉద్యోగుల జీతంలో ఈ రూపంలో కోతలు సరికాదంటూ ఆ విధానాన్ని ఉపసంహరించుకుంది. కానీ తాజాగా సీయూజీ ఫోన్ల సర్వీస్ ప్రొవైడర్ మార్పు ద్వారా సాలీనా ఉద్యోగులపై రూ. 3 కోట్లపైన అదనపు భారం పడనుంది. ఈ డబ్బు వెచ్చిస్తే దాదాపు 9 కొత్త పల్లెవెలుగు బస్సులను కొనుగోలు చేయొచ్చు. అలా బస్సులు సమకూర్చినా నేరుగా ప్రయాణికులకు ఉపయోగపడే వీలుంటుంది.

పునరాలోచనలో అధికారులు..

ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహాన్ని గుర్తించిన అధికారులు పునరాలోచనలో పడ్డట్లు కనిపిస్తోంది. దీంతో బీఎస్ఎన్ఎల్‌తో చర్చిస్తున్నట్లు సమాచారం. ''ఉద్యోగులు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు. భవిష్యత్తులో ఉద్యోగుల ఫోన్లకు చాలా సమాచారం ఆన్‌లైన్ ద్వారా అందించాల్సి ఉంటుంది. ఇందుకు ప్రస్తుత సీయూజీ డేటా సరిపోవడం లేదు. కొత్త ప్రొవైడర్ మెరుగైన ఫీచర్లతో ముందుకు వచ్చినందుననే ఈ ఆలోచన చేశాం. ఇందులో ఉద్యోగులపై భారం మా ఉద్దేశం కాదు. బీఎస్ఎన్ఎల్ కొత్త ఫీచర్లను ఇస్తూ, డేటా సామర్థ్యం పెంచితే దానినే కొనసాగించేందుకు సిద్ధం' అని అధికారులు పేర్కొంటున్నారు.

తల్లితో కలిసి భర్తను హత్య చేసి..

- వేధింపులు తాళలేక తల్లీ కూతుళ్ల దుశ్చర్య
- జగిత్యాల జిల్లా నేరెళ్లలో ఘటన

ధర్మపురి: అనుమానంతో భర్త వేధిస్తుండటంతో భార్య తన తల్లితో కలిసి అతన్ని హత్య చేసిన ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసండ్ల మాణిక్యం(40), అదే గ్రామానికి చెందిన జమున 19 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. జమున తండ్రి గతంలోనే మృతి చెందాడు. దీంతో ఆమె తల్లి నమిలికొండ శాంతమ్మ ఇంట్లోనే భార్యాభర్తలు కాపురముంటున్నారు. దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న మాణిక్యం.. నిత్యం మద్యం తాగి వస్తూ డబ్బు కోసం భార్య, అత్తను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో మాణిక్యంను మట్టుబెట్టాలని తల్లీకూతుళ్లు భావించారు. ఆదివారం రాత్రి మద్యం తాగి వచ్చి నిద్రపోతున్న మాణిక్యం తలపై తల్లీకూతుళ్లు కర్రలతో గట్టిగా కొట్టారు. తీవ్రగాయాలతో రక్తపు మడుగులో కొట్టుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు ఇంటికి తాళం వేసి పొరుగు ఇంట్లో నిద్రించారు. సోమవారం ఇంటి తలుపులు తీసిన తల్లీకూతుళ్లు ఏమీ తెలియనట్లు రోదించసాగారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి వచ్చిన పోలీసులు జాగిలాలను రప్పించారు. ఇంట్లోంచి రోడ్డు వైపు వెళ్లిన జాగిలాలు.. తల్లీకూతుళ్ల వద్ద ఆగాయి. దీంతో జమున, శాంతమ్మను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా విషయం బయటపడింది. మృతుడి తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు తల్లీకూతుళ్లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతుల భూములు.. హెచ్‌ఎండీఏ లేఅవుట్లు!

- హైదరాబాద్ చుట్టుపక్కల భూములు సేకరించి అభివృద్ధి చేసేందుకు కసరత్తు
- ఆ లేఅవుట్లలో రైతులకు 60శాతం వాటా
- వెయ్యి ఎకరాల్లో వెంచర్ల ఏర్పాటుకు చర్యలు

సాక్షి, హైదరాబాద్: శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహా నగరం చుట్టుపక్కల ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరిగేలా 'హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)' దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అన్ని అవసరాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికలతో కూడిన లేఅవుట్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. నగరానికి అన్నివైపులా హెచ్‌ఎండీఏ సొంత భూములతోపాటు రైతుల నుంచి పెద్ద ఎత్తున భూములను సేకరించి.. మొత్తంగా వెయ్యి ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, పార్కులు, ఇతర సదుపాయాలతో నివాసయోగ్యమైన వెంచర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

60శాతం వాటా.. ఆన్‌లైన్ విక్రయాలు

రైతుల నుంచి సేకరించిన భూములను అభివృద్ధి చేశాక 60శాతం స్థలాలను వారికి వాటా కింద అప్పగిస్తారు. మిగతా 40శాతం స్థలాలను హెచ్‌ఎండీఏ తీసుకుంటుంది. ఈ భూముల్లో బహుళ వినియోగ ప్లాట్లను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయిస్తారు. మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఇప్పటికే సేకరించిన భూముల్లో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల రైతుల నుంచి భూములను సేకరించేందుకు అధికారులు చర్చలు జరుపుతున్నారు.

వెయ్యి ఎకరాల్లో అభివృద్ధి ప్రణాళికలు

హైదరాబాద్ శివార్లలోని కుర్మల్‌గూడ, ప్రతాప సింగారం, దండుమల్కాపురం, లేమూరు, ఇన్ముల్‌నెర్వ, కొర్రెముల, నాదర్‌గుల్ తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న భూములను గుర్తించారు. ఇప్పటికే ఇన్ముల్‌నెర్వ, లేమూరులో సేకరించిన భూముల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. వీటితోపాటు కుర్మల్‌గూడ, బోగారం, ప్రతాప సింగారం, దండుమల్కాపురం తదితర ప్రాంతాల్లో కలిపి 924 ఎకరాలకుపైగా భూములను గుర్తించారు. మరింత మంది రైతులతోనూ చర్చలు జరుపుతున్నారు. ఎలాంటి వివాదాలు లేని భూముల్లో, అన్ని అనుమతులు, సౌకర్యాలతో హెచ్‌ఎండీఏ వెంచర్లు ఉంటుండటంతో.. డిమాండ్ ఎక్కువగా వస్తోంది. ఇప్పటికే అభివృద్ధి చేసిన లేఅవుట్లలో భూములు, ప్లాట్ల విక్రయానికి హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్లు విడుదల చేసింది. వివిధ ప్రాంతాల్లో ఆగస్టు మొదటి, రెండో వారంలో ఆన్‌లైన్ బిడ్డింగ్ జరగనుంది.

ఇంకా 20శాతం లోటు వర్షపాతమే!

బలహీనపడిన అల్పపీడనం.. పలుచోట్ల వానలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంకా లోటు వర్షపాతం కొనసాగుతోంది. ప్రస్తుత నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 24.45 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. సోమవారం నాటికి 19.6 సెంటీమీటర్లు మాత్రమే నమోదైంది. అంటే సాధారణం కంటే 20శాతం లోటు ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. ఇక ఉత్తర జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారం ఉదయం బలహీనపడిందని తెలిపింది. దీనికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం దక్షిణ జార్ఖండ్, దాని పరిసరాల్లో కొనసాగుతోందని వివరించింది. అయితే వచ్చే 48 గంటల్లో వాయవ్య బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని.. మంగళవారం పలుచోట్ల మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వెల్లడించింది.

బొగతకు పర్యాటకుల వరద



ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. సోమవారం సెలవుదినం కావడంతో పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. బొగత సమీపంలో ఏర్పాటు చేసిన నీటి కొలనులో సేదదీరారు. జలపాతాన్ని తమ ఫోన్లలో బంధించడంతోపాటు సెల్ఫీలతో సందడి చేశారు. –వాజేడు

ఏపీ బ'డిజిటల్'



ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు నెలాఖరులోగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన ప్రారంభం కానుంది. ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా.. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్మార్ట్ టీవీల ద్వారా బోధించనున్నారు. కొన్ని పాఠశాలల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభం కాగా విద్యార్థులు శ్రద్ధాసక్తులతో పాఠాలు నేర్చుకుంటున్నారు. ఈ చిత్రాలు కృష్ణా జిల్లా నిడమనూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనివి. ఇక్కడ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ట్యాబ్లెట్ల సాయంతో ఇప్పటికే విద్యార్థులకు బోధన కొనసాగుతోంది. – విశాల్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గొర్రు కొట్టి.. నాటు వేసి!



రైతన్నలా మారిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్(హన్వాడ): మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కాసేపు అధికారిక కార్యక్రమాలను పక్కన పెట్టి రైతన్నలా, వ్యవసాయకూలీలా మారారు. వరి పొలంలో ఎద్దులతో గొర్రుకొట్టి, పిండి(డీఏపీ) చల్లి.. మహిళలతో కలిసి నాటేశారు. ఈ ఆసక్తికర సంఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం శివారు చిన్నదర్పల్లిలో చోటుచేసుకుంది. హన్వాడ రైతువేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి జిల్లాకేంద్రానికి వస్తుండగా, మార్గమధ్యంలో ఉన్నట్టుండి కాన్వాయ్ ఆపారు. చిన్నదర్పల్లికి చెందిన వేముల బాలకిషన్‌రావు పొలంలో నాటువేస్తుండగా గమనించి దగ్గరికి వెళ్లారు. ఎద్దులతో కట్టిన గొర్రుతో కరిగెట చదును చేశారు. అడుగుమందు చల్లి మహిళాకూలీలకు నారు అందించి, వారితో కలిసి నాటేశారు. చిన్నతనంలో పంటచేనుకు తల్లిదండ్రుల వెంట వెళ్లి పొలంపనుల్లో సహాయం చేసేవాడినని తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు.

వరికి 'చిరు' సాయం...



కరీంనగర్ జిల్లాలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. కూలీల కొరతతో కూలి రేట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో చిన్నసన్నకారు రైతులకు నాట్లు వేయడం భారంగా పరిణమించింది. ఇలాంటి పరిస్థితిలో పొలంలో వరి నాట్లేస్తున్న తల్లిదండ్రులకు చిన్నారులు సాయమందిస్తున్నారు. విద్యాసంస్థలకు రెండు రోజులు సెలవులు రావడంతో.. పిల్లలు వరి నారు పంచుతూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. – సాక్షి, కరీంనగర్ ఫొటోగ్రాఫర్

కిలో కూరగాయలు రూ.20కే!



ఇల్లెందు: ఆకాశాన్నంటిన కూరగాయల ధరలతో అల్లాడుతున్న వినియోగదారులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఓ కూరగాయల వ్యాపారి కుటుంబం ఉపశమనం కలిగించింది. టమాటా ధరచూస్తే నోట మాటరాని పరిస్థితి. పచ్చిమిర్చి ముట్టుకోకుండానే మంటమండుతున్న వేళ ప్రజలెవరూ మార్కెట్ ముఖం చూడకపోవడంతో పలురకాల కూరగాయల ధరలు తగ్గించింది. ఇన్నిరోజులు ధరల దరువుతో వెలవెలబోయిన మార్కెట్‌లో తాజాగా వినియోగదారుల సందడి నెలకొంది. ఇల్లెందుకు చెందిన కూరగాయల వ్యాపారి యాకూబ్ కుమారులు గౌస్, జానీ, ఖాజా మానవతాదృక్పథంతో ముందుకు వచ్చి ఐదు రకాల కూరగాయల ధరలను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చారు. కిలో రూ.60 పలుకుతున్న బెండ, దొండ, సొరకాయ, వంకాయ, ఆలుగడ్డను కేవలం రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ విషయమై గౌస్, జానీ, ఖాజా మాట్లాడుతూ కూలీలు, చిరుద్యోగులు కూరగాయలు కొనే పరిస్థితి లేకపోవడంతో తమ తండ్రి స్ఫూర్తితో లాభనష్టాలు చూసుకోకుండా ధరలు తగ్గించినట్లు తెలిపారు.

'మానవ హక్కుల కమిషన్' నియామకానికి నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. మానవ హక్కుల రక్షణ చట్టం 2019, నవంబర్ 28న జారీ చేసిన జీవో మేరకు ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. చైర్మన్ పోస్టుకు.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా న్యాయమూర్తి, జ్యుడీషియల్ సభ్యుని పోస్టుకు.. హైకోర్టు న్యాయమూర్తి లేదా ఏడేళ్ల అనుభవంతో జిల్లా జడ్జి అలాగే నాన్ జ్యుడీషియల్ సభ్యుని పోస్టుకు.. మానవ హక్కులపై పూర్తి అవగాహన ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఆగస్టు 14లోగా దరఖాస్తులను సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వుల్లో వెల్లడించారు. మానవ హక్కుల చైర్మన్, సభ్యుల నియామకం చేపట్టడం లేదంటూ ఇటీవల హైకోర్టు అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

హరితహారం లక్ష్యం 19.29 కోట్ల మొక్కలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది 19.29 కోట్ల మొక్కలను నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకునట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని 24 శాతం నుంచి 33 శాతానికి పెంచే లక్ష్యంతో 2015–16లో హరితహారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపింది. ఇందుకోసం మొత్తం 230 కోట్ల మొక్కలను నాటాలని నిర్ణయించగా గత తొమ్మిదేళ్లలో 273 కోట్ల మొక్కలను నాటినట్లు వివరించింది. ప్రభుత్వ పరంగానే కాకుండా అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసి మొక్కలు నాటడాన్ని ప్రభుత్వం ఓ ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తోందని పేర్కొంది. ప్రభుత్వ చర్యల ఫలితంగా 2015–16లో 19,854 చదరపు కిలోమీటర్లుగా ఉన్న అటవీ విస్తీర్ణం 2023 నాటికి 26,969 చదరపు కిలోమీటర్లకు పెరిగిందని ఐ అండ్ పీఆర్ ఆ ప్రకటనలో తెలిపింది.

'ఎన్నారై సెల్' ఏర్పాటు హామీ ఏమైంది?

పీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ గంప వేణుగోపాల్

సాక్షి, హైదరాబాద్: 'ఎన్నారై సెల్' ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని మంత్రి కేటీఆర్‌ను పీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ గంప వేణుగోపాల్ ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినా ఇప్పటి వరకు అతీగతీ లేదని సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. 2014–18లో ఎన్నికల ప్రణాళికలో ఎన్నారై సెల్, ఎన్నారై పారిశ్రామికవేత్తలకు రాయితీ ఇస్తామని, సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పి మోసగించారని ఆరోపించారు. మరో వైపు రేషన్‌కార్డులో పేర్ల తొలగింపుతో దళిత బంధు, బీసీ బంధు, వివిధ పథకాలకు గల్ఫ్ ఎన్నారైలను ఆదుకోలేకపోతున్నారని మండిపడ్డారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.